శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్రము

వివరణ



శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు

తెలుగు అనువాదం – కాజ సుధాకర బాబు

2వ భాగము

Sri Vishnu Sahasra Nama Stotram

Annotated commentary by : Sri Narasimhan Krishnamachari

Telugu Translation by : Kaja Sudhakara Babu

Volume-2

శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రము వివరణ

శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు

తెలుగు అనువాదం – కాజ సుధాకర బాబు

Sri Vishnu Sahasra Nama Stotram

Annotated commentary by : Sri Narasimhan Krishnamachari

Telugu Translation by : Kaja Sudhakara Babu

This work is published under

Creative Commons Non-Commercial License

The above license applies only to my translation, which is done with permission from the original author, Sri N. Krishnamachari.

Excerpts from other works reproduced in this work are not covered in the above license. Main examples of such reproductions are

(a) Telugu Translation of Bhagavdgitha Slokas, which are taken from the publication of Gita Press, Gorakhpur

(b) Excerpts from book of Sri Pemmaraju Rajarao (Especially translation of Purva Peethika)

(c) Excerpts from the book of Dr. Krovi Partha Saradhi

(d) Excerpts from other works which are mentioned in appropriate places.

All Photographs and pictures are by me (Kaja Sudhakara Babu) or taken from free sources such as Wikipedia.

<u>Cover Photo:</u>

Sculpture at Dwaraka Thirumala, West Godavari District, Andhra Pradesh.

అజః సర్వేశ్వరః సిద్ధః సిద్ధిః సర్వాదిరచ్యుతః |
వృషాకపిరమేయాత్మా సర్వయోగవినిస్సృతః || (11)

96. అజః

- జన్మము లేనివాడు.
- అన్ని అడ్డంకులను తొలగించువాడు.
- భక్తుల హృదయములందు చరించుచుండువాడు.
- అన్ని శబ్దములకు మూలమైనవాడు ('అ' – అక్షరము).

ఓం అజాయ నమః

ఈ నామము మరల 206వ నామముగాను, 524వ నామముగాను వచ్చును.

11వ శ్లోకము. 96వ నామము. అజః – **అజః సర్వేశ్వరః సిద్ధః సిద్ధిః సర్వాదిరచ్యుతః**

22వ శ్లోకము. 206 వ నామము. అజః – **అజో దుర్మర్షణః శాస్తా విశ్రుతాత్మా సురారిహా**

11వ శ్లోకము. 524వ నామము. అజః – **అజో మహార్హః స్వాభావ్యో జితామిత్రః ప్రమోదనః**

పుట్టుక లేనివాడు. **న జాయతే ఇతి అజః** – ఇందుకు శ్రీ శంకరులు చెప్పిన శృతి ప్రమాణము -

ఋగ్వేదము 1.81.5. **న జాతో న జనిష్యతే.** ఆయన ఇంతకుముందు జన్మింపలేదు. ఇకముందు జన్మింపబోడు.

న హి జాతో న జాయేఽయం న జనిష్యతే కదాచన

క్షేత్రజ్ఞః సర్వభూతానాం తస్మాదహం అజస్మృతః – మహాభారతము శాంతిపర్వము 330.9

నేను పూర్వము జన్మించియుండలేదు. ఇప్పుడు జన్మించినవాడను కాను. భవిష్యత్తులో జన్మించను. నేను సర్వభూతములందును క్షేత్రజ్ఞుడను. కనుక నన్ను 'అజుడు' అని యందురు.

'అజ' నామమునకు మరికొన్ని ప్రమాణములు –

కఠోపనిషత్తు 1.2.18 – **అజో నిత్యః శాశ్వతోऽయమ్ పురాణః**

బృహదారణ్యకోపనిషత్తు 4.4.22 – **స వా ఏష మహాన్ అజ ఆత్మా**

శ్రీ భట్టుల వివరణ – భగవంతుడు శ్రీనారసింహామూర్తియై స్తంభమునుండి ఆవిర్భవించెను. తక్కిన జీవజాలమువలె ఆయన జన్మింపడు. (3వ నామము 'స్వయంభూః' వివరణను గమనింపదగును.)
'అజ్' అనే ధాతువునకు 'చలనము','తొలగించుట' అనే అర్థాలు కూడా ఉన్నాయి (**అజౌ గత క్షేపణయోః**) ఈ భావములో మరికొన్ని వ్యాఖ్యానాలు మనకు లభించాయి.

శ్రీ భట్టులు – పరమపద ప్రాప్తికై తపించు ముముక్షువుల మార్గమునుండి అన్ని విఘ్నములను తొలగించి అనుగ్రహించువాడు భగవంతుడు. అజుడు.

శ్రీ శంకరులు – **అజతి గచ్ఛతి క్షిపతి ఇతి వా అజః** – భక్తుల హృదయమున ప్రవేశించి చరించువాడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – మన అజ్ఞానమును తొలగించువాడు. తన భక్తుల చెంతకు చేరి, వారిని తన పరంధామమువైపు నడిపించువాడు.

ఇంకా – **అకార వాచ్యతయా జాతః అజః** – 'అ'కార వాచకముచే తెలుపబడినవాడు అజుడు. అన్న భావములో కూడ ఈ నామమునకు వ్యాఖ్యానాలు ఉన్నాయి.

గీత 10.33 - **అక్షరాణామ్ అకారోऽస్మి.** అక్షరములలో నేను అకారమును – అని శ్రీకృష్ణభగవానుడు సెలవిచ్చెను. దీనినే శ్రీ రాధాకృష్ణశాస్త్రిగారు ఇలా వివరించారు - ప్రళయకాలమున పంచభూతములును ఏకమగును (**ఆకాశాత్ వాయుః, వాయోరగ్నిః, అగ్నేరాపః, అద్భ్యః పృథివీ** .. .. అనే క్రమానికి తిరుగు క్రమంలోనన్న మాట). అలా జరిగినపుడు చివరకు శబ్ద తన్మాత్ర మాత్రమే మిగులును. అది 'అ'కార శబ్దములో లీనమగును. ప్రళయాంతమున ఆ 'అ'కార శబ్దరూపమే భగవంతుని రూపము. **అకారో వై సర్వావాక్** – అని శృతిలో ఉన్నది. అలాగే తిరుక్కురళ్ లో – **అకార ముదలాయ ఎడుత్తెల్లామ్ ఆది భగవాన్ ముదత్రే ఉళగు** – అని చెప్పారు.

97. సర్వేశ్వరః

- ఎవరు తనను కోరుకొందురో వారి చెంతకు తానై వచ్చి అనుగ్రహించువాడు.

- ఈశ్వరులకు ఈశ్వరుడు. ప్రభువులకు ప్రభువు.

ఓం సర్వేశ్వరాయ నమః

అశక్తానాం చ శక్తానాం వైరూప్యం శరణైషితామ్

అశ్ను తే పరిహర్తుం యః సర్వేశ్వర ఈరితః

సమర్థులైనా గాని, అసమర్థులైనా గాని తనను శరణుజొచ్చినవారి అనిష్టములను పోగొట్టేవాడు ఈశ్వరుడు. 'అశ్' అనగా 'వ్యాపించుట' అనే మూలం శ్రీభట్టుల వ్యాఖ్యకు ఆధారం. ఉనాది సూత్రము 738 ప్రకారం – **అశ్నోతే రాశు కర్మణి వరత్ చ** – అనగా అశ్+వరత్=ఈశ్వరః

దీని అర్థము 'అనతికాలంలో విజయమును ప్రసాదింపగలవాడు'. అనగా, తనను శరణుజొచ్చినవారిని అనుగ్రహించి, వేగిరమే వారి కడగండ్లను కడతేర్చి, ముక్తిని ప్రసాదించేవాడు ఈశ్వరుడు. ఇందుకు వారి శక్తి, అర్హతలు ముఖ్యము కాదు. ఆ శరణాగతవత్సలుని శరణుజొచ్చుటే చాలును. **త్వమేవ శరణం మమ, అన్యథా శరణం నాస్తి – వినా వేంకటేశం న నాథో న నాథః – రామాన్నాస్తి పరాయణం పరతరం రామస్య దాసోస్మ్యహమ్.**

సర్వేషామ్ ఈశ్వరాణామ్ ఈశ్వరః సర్వేశ్వరః – ఆయన ఈశ్వరులకు ఈశ్వరుడు. దేవదేవుడు. భక్తవరదుడు. బృహదారణ్యకోపనిషత్తు 4.4.22 - **ఏష సర్వేశ్వరః**

ఏష సర్వేశ్వర ఏష సర్వజ్ఞ ఏషోంతర్యామ్యేష

యోనిః సర్వస్య ప్రభవాప్య యౌ హి భూతానమ్ – మాండుక్యోపనిషత్తు

ఇతడే అన్నింటికిని ప్రభువు. అంతర్యామి, నియామకుడు, కారణము, ఉత్పత్తి, వినాశము అన్నీ ఇతడే. అదే ఆత్మ. అదే పరమేశ్వరుడు.

98. సిద్ధః

తన భక్తులకు అందుబాటులో నుండెడివాడు.

ఓం సిద్ధాయ నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

11వ శ్లోకము. 98వ నామము. సిద్ధః – **అజః సర్వేశ్వరః సిద్ధః సిద్ధిః సర్వాదిః అచ్యుతః**

88వ శ్లోకము. 825వ నామము. సిద్ధః – **సులభః సువ్రతః సిద్ధః శత్రుజిత్ శత్రుతాపనః**

శ్రీ భట్టుల వ్యాఖ్యానమును నిరుక్తములో ఇలా పొందుపరచారు – **స్వరూపేణైవ భక్తానామ్ సిద్ధత్వాత్ సిద్ధః ఉచ్యతే** – తన నిజరూపములో భక్తులకు సిద్ధించేవాడు (చేతికందువాడు). శ్రీమన్నారాయణుడు భక్తుల పాలిట కొంగు బంగారము. **ముంగిటనల్లదివో మూలనున్న ధనము.** పిలిచిన పలుకును. తలచినంతనే కరుణించును. పూజలు చేకొనును. కీర్తనలు విని యానందించును. మోక్షమును ప్రసాదించును.

'సిద్ధః' అనగా మరొక అర్థము 'సాధింపదగినదానిని అంతటిని సాధించినవాడు'. ఇక ఆయన పొందదగిన సిద్ధులేవియును లేవు. **నానవాప్తమవాప్తవ్యమ్** – అని గీతావాణి.

శ్రీ శంకరుల భాష్యము – **నిత్య నిష్పన్న రూపత్వాత్ సిద్ధః** – ఏవిధమైన లోపములు లేని, సకల పరిపూర్ణమైన రూపముగలవాడు.
అమరకోశము – **సిద్ధయతి ఇతి సిద్ధః**

శ్రీ రామరక్షాస్తోత్రమునుండి

చరితం రఘునాథస్య శతకోటి ప్రవిస్తరమ్ - ఏకైక మక్షరం పుంసాం మహాపాతక నాశనమ్.
ధ్యాత్వా నీలోత్పల శ్యామం రామం రాజీవలోచనమ్ - జానకీ లక్ష్మణోపేతం జటామకుట మండితమ్.
సాసితూణ ధనుర్బాణ పాణిం నక్తం చరాంతకమ్ - స్వలీలయా జగత్రాతు మావిర్భూత మజం విభుమ్.
రామరక్షాం పఠేత్ ప్రాజ్ఞః పాపఘ్నీం సర్వకామదామ్ - శిరో మే రాఘవః పాతు ఫాలం దశరథాత్మజః
కౌసల్యేయో దృశౌపాతు విశ్వామిత్రః ప్రియః శృతీ - ఘ్రాణం పాతు మఖత్రాతా ముఖం సౌమిత్రి వత్సలః
జిహ్వాం విద్యా నిధిః పాతు కంఠం భరత వందితః - స్కంధౌ దివ్యాయుధః పాతు భుజౌ భగ్నేశ కార్ముకః
కరౌ సీతాపతిః పాతు హృదయం జామదగ్న్యజిత్ - మధ్యం పాతు ఖరధ్వంసీ నాభిం జాంబవదాశ్రయః
సుగ్రీవేశః కటీ పాతు సక్థినీ హనుమత్ప్రభుః - ఊరూ రఘూత్తమః పాతు రక్షఃకుల వినాశకృత్.
జానునీ సేతుకృత్పాతు జంఘే దశముఖాంతకః - పాదౌ విభీషణ శ్రీదః పాతు రామో ఖిలం వపుః
ఏతాం రామబలోపేతాం రక్షాం యః సుకృతీ పఠేత్ - స చిరాయుః సుఖీ పుత్రీ విజయీ వినయీ భవేత్.
పాతాళ భూతల వ్యోమ చారిణశ్చద్మ చారిణః - న ద్రష్టు మపి శక్తాస్తే రక్షితమ్ రామనామభిః
రామేతి రామభద్రేతి రామ చంద్రేతి వా స్మరన్ - నరో నలిప్యతే పాపైర్భుక్తిం ముక్తిం చ విందతి.
జగజ్జైత్రైక మంత్రేణ రామనామ్నాభి రక్షితమ్ - యః కంఠే ధారయేత్తస్య కరస్థాః సర్వ సిద్ధయః

99. సిద్ధిః

సాధనా ఫలము. పరమ లక్ష్యము. సాధింపదగినవాడు.

ఓం సిద్ధయే నమః

అయమేవ హ్యుపాయైశ్చ సిద్ధిస్స్యా త్సాధ్యతే యతః – వేరు వేరు ఉపాయాలతో కూడా సాధింపబడువాడు.

'సిద్ధి' అనగా సాధించిన విజయము, ఫలితము. సకల సాధనలకు పరమార్థము భగవంతుడే గనుక ఆయనే సిద్ధి. అన్ని కర్మ, జప, తపములకు పరమ గమ్యము మోక్షము. ఆ మోక్షమును ప్రసాదించువాడు ఆ పరంధాముడే. తక్కిన స్వర్గాది ఫలములు శాశ్వతములు కావు. మోక్షమునకు సరి తూగవు. కనుక భగవంతుని చేరుటయే పరమార్థము. అందువలన ఆయనే ముముక్షువులకు సిద్ధి.

పోతన భాగవతము – గజేంద్రమోక్షము

ముక్తసంగులైన మునులు - దిద్రుక్షులు సర్వ భూత హితులు

సాధుచిత్తులు అసదృశవ్రతాఢ్యులు - గొల్తురెవని దివ్యపదము.

100. సర్వాదిః

సర్వమునకును మూలకారణము, ప్రప్రథమము.

ఓం సర్వాదయే నమః

సర్వేషామ్ పురుషార్థానామ్ ఆదిః సర్వాదిః – తన భక్తులకు సకలపురుషార్థాలు సిద్ధించడానికి మూలమైనవాడు సర్వాది. **సర్వాన్ కామాన్ ప్రాప్నువంతే విశాలాన్ త్రైలోక్యేస్మిన్ కృష్ణ నామాభి ధానాత్** – శ్రీకృష్ణపరమాత్ముని స్మరించడంవలన అన్ని విధాలైన కోరికలు తీరుతాయి.

సర్వభూతానామ్ ఆది కారణత్వాత్ సర్వాదిః – అన్ని భూతాలకు ఆదికారణమైనవాడు సర్వాది. అన్నింటికిని ఆరంభము ఆ పరమాత్ముడే. అన్నింటికంటె ముందుగా ఉన్నవాడు, వేరేదీ లేనప్పుడు తానైయున్నవాడు ఆ నారాయణుడే. కార్యమునకు ముందు కారణమువలె, సృష్టికి ముందుగా సంకల్పమై, సర్వమునకును ఆదియైనవాడు శ్రీమహావిష్ణువు. ఆయన సంకల్పమాత్రమున సకల సృష్టి సంభవించినది.

101. అచ్యుతః

- తన దివ్య తేజోవిభూతి శక్తి సంపన్నత్వమునుండి ఎన్నడు జారనివాడు (పతనము చెందనివాడు.)
- తన భక్తులెన్నడును పతనము కాకుండ కాపాడువాడు.
- జన్మ, పరిణామము, వార్ధక్యము వంటి దశలకు అతీతమైనవాడు.

ఓం అచ్యుతాయ నమః

ఈ నామము 101, 320, 557వ నామములుగా మూడుమార్లు వచ్చును.

11వ శ్లోకము. 101వ నామము. అచ్యుతః – **అజః సర్వేశ్వరః సిద్ధః సిద్ధిః సర్వాదిరచ్యుతః**

35వ శ్లోకము. 320వ నామము. అచ్యుతః – **అచ్యుతః ప్రథితః ప్రాణః ప్రాణదో వాసవానుజః**

59వ శ్లోకము. 557వ నామము. అచ్యుతః – **వేధాః స్వాంగోఽజితః కృష్ణో దృఢః సంకర్షణోఽచ్యుతః**

8 నవంబరు 2014. మస్కట్ లో జరిగిన శ్రీవేంకటేశ్వర కళ్యాణము.

భక్తేభ్యోఽచ్యుత పూర్వత్వాత్ అచ్యుతః పరికీర్తితః

ఆశ్రితానాం చ్యుతిర్యస్యా న్నాస్తి సోఽచ్యుత ఈరితః

తన భక్తుల కొరకు మరుగు పడనటువంటివాడు. తనను శరణన్నవారిని ఎప్పుడూ వదలిపెట్టనివాడు అచ్యుతుడు. 'చ్యుతి' అనగా పతనము. అచ్యుతుడు అనగా పతనము కాని(లేని)వాడు. లేదా పతనము కానీయనివాడు.

పతనము లేనివాడు – బ్రహ్మ, ఇంద్రుడు తదితర దేవతలు తమ స్థానములను కొంతకాలము తరువాత (కల్పాంతమున) కోల్పోవవచ్చును. అంతేగాక వారివారి కర్మఫలములచే వారి వైభవము ప్రభావితమగును. కాని శ్రీమన్నారాయణుని పదమునకు ఆదియు, అంత్యము లేదు. ఆయనకు జన్మ కర్మాది బంధములు వర్తించవు. ఆయన అజుడు. అప్రమేయుడు. అచ్యుతుడు.

మహాభారతము. శాంతి పర్వము . 12.330.16 - **యస్మాత్ న చ్యుత పూర్వోఽహమ్ అచ్యుతస్తేన కర్మణా**

ఈ శృతివాక్యమును వివరించడంలో శ్రీశంకరులు, శ్రీభట్టులు కొంత వైవిధ్యాన్ని చూపారు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **స్వరూప సామర్థ్యాత్ న చ్యుతో న చ్యవతే** – ఆయన స్వరూప సామర్థ్యములలో ఎన్నడును కొరవడలేదు (పతనము కాలేదు). ఇప్పుడు కొరత లేదు. ఇంకముదెన్నడును కొరత రాజాలదు. ఆయన వైభవము, శక్తి, సౌందర్యములు అపూర్వములు, అనంతములు, అవిచ్ఛిన్నములు. కనుక ఆయన అచ్యుతుడు.

పతనము కానీయనివాడు - ఇంక పైన చెప్పిన (**యస్మాత్ న చ్యుత పూర్వోఽహమ్ అచ్యుతస్తేన కర్మణా**) శృతివాక్యమునకే శ్రీ భట్టుల వివరణ ద్వారా రెండవ అర్థాన్ని గ్రహింపవచ్చును – నేను (నా భక్తులను) ఎన్నడును విడనాడను. అందువలన నన్ను అచ్యుతడని అందురు. **తేభ్యః ప్రపన్నేభ్యః న అపగతః అచ్యుతః** – తనను శరణు జొచ్చినవారినుండి ఎన్నడును దూరము కానివాడు అచ్యుతుడు.

శ్రీ తిరుక్కుళ్ళమ్ నృసింహరాఘవాచారిగారు తమ భగవద్గీతాభాష్యములో చెప్పిన భావము – **న చ్యవయతి ఇతి అచ్యుతః** – అనగా తన భక్తులను పతనము కానీయనివాడు అచ్యుతుడు. తనను నమ్ముకొనినవానిని విజయుని చేయుటకై ఆయన పార్థసారథియై పగ్గములు చేపట్టిన ఆప్తబంధువు గనుక ఆయనను అర్జునుడు 'అచ్యుత' అని సంబోధించాడు. గీత 9.31 - **కౌంతేయ ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి** – కౌంతేయా! నా భక్తుడెన్నడును నష్టమునకు గురికాడు అను విషయమును నిశ్చయముగా ఎఱుంగుము.

మార్పు లేనివాడు - 'చ్యుతమ్' అనగా మార్పు. సమస్త జీవులును పరిణామ స్వభావము కలిగియున్నవి. జననము, జీవనము, రూపములో మార్పిడి, పెరుగుట, కృశించుట, తుదకు శరీరమునుండి నిష్క్రమించుట – ఇట్టి మార్పులు జీవులకు సహజము. కాని భగవానుడు – **శాశ్వతమ్ శివమ్ అచ్యుతమ్** – అనగా శాశ్వతమైనవాడు, మంగళకరమైనవాడు, మార్పులేనివాడు అని తైత్తరీయారణ్యక ఉపనిషత్తు (10.11)లో ఉన్నది. పరిణామశీలకము కానివాడు గనుక ఆ వేంకటరమణుని అచ్యుతుడని శరణుజొచ్చెదను.

పతిం విశ్వస్యాత్మేశ్వరగ్ం శాశ్వతగ్ం శివ మచ్యుతమ్
నారాయణం మాజ్ఞేయం విశ్వాత్మానం పరాయణం.

విశ్వానికి అతీతుడు, విశ్వమే తానుగ అయినవాడు, నిత్యుడు, సర్వవ్యాపకుడు, విశ్వానికి జీవనాధారమైనవాడు, విశ్వపతి, విశ్వానికి ఈశ్వరుడు, శాశ్వతుడు, మంగళకరుడు, నాశనరహితుడు, తెలుసుకోదగిన పరమాత్ముడు, విశ్వపరాయణుడు అయిన నారాయణునకు నమస్కారము.

పోతన భాగవతము – భీష్ముడు కృష్ణుని స్మరించిన విధము

హరి రింఖా ముఖ ధూళి ధూసర పరిన్యస్తాలకోపేతమై
రయజాత శ్రమతోయబిందు యుతమై రాజిల్లు నెమ్మోముతో
జయముం బార్థునకిచ్చు వేడ్కనని నా శస్త్రాహతిం జాల నొ
చ్చియు బోరించు మహానుభావు మదిలో జింతింతు నశ్రాంతమున్

గుఱ్ఱపు గిట్టల తాకిడికి లేచిన ధూళి చేతను, వేగముగా రథము తోలు శ్రమవల్ల కలిగిన చెమట బిందువుచేతను రాజిల్లు చక్కని మోము కలిగి, నా (భీష్ముని) బాణముల వల్ల నొచ్చియు, పార్థునికి జయము కల్గించుటకై యుద్ధము చేయించు మహానుభావుని స్మరించెదను.

అచ్యుతాష్టకము నుండి

అచ్యుతమ్ కేశవం రామనారాయణం - కృష్ణ దామోదరం వాసుదేవం హరిమ్
శ్రీధరం మాధవం గోపికావల్లభం - జానకీ నాయకం రామచంద్రం భజే

102. వృషాకపిః

శ్రీవరాహమూర్తిని స్తుతించు పుణ్యనామము.

జలములలో (అధర్మములో) మునిగిపోవు భూమిని ఉద్ధరించినవాడు. ధర్మపరిరక్షకుడు. వరాహస్వరూపి.

ఓం వృషాకపయే నమః

కపిర్వరాహశ్శ్రేష్ఠశ్చ ధర్మశ్చ వృష ఉచ్యతే
తస్మాద్వృషాకపిః ప్రోక్తో వస్వర్ణోऽభీష్టదో మనుః

వృష అంటే ధర్మము. కపి అంటే వరాహము. వృషాకపి అంటే ధర్మస్వరూపమైన శ్రేష్ఠమైన వరాహము. ఈ నామాన్ని **'ఓం వృషాకపయే నమః'** అనే అష్టాక్షరీ మంత్రంగా జపిస్తే సర్వాభీష్టాలు నెరవేరుతాయి.

ధర్మమును రక్షించు శ్రీవరాహమూర్తి.

కపిర్వరాహః శ్రేష్ఠశ్చ ధర్మశ్చ వృష ఉచ్యతే
తస్మాద్ వృషాకపిమ్ ప్రాహ కాశ్యపో మామ్ ప్రజాపతిః - మహాభారతము.శాంతిపర్వము.330.24

వరాహశ్రేష్ఠమును 'కపి' యందురు. ధర్మమును 'వృష' అనియందురు. (కోరికలు వర్షించునది గనుక ధర్మము వృష యగును.) కనుక ప్రజాపతి కశ్యపుడు నన్ను 'వృషాకపి'యని పిలిచెను.

జలములలో మునిగిపోవు భూమిని ఉద్ధరించినవాడు.

కాత్ – అపాత్ - ఉదకములనుండి (భూమిని) ఉద్ధరించినవాడు.

ఈ రెండు అర్థములను అనుసంధానిస్తూ శ్రీ చిన్మయానంద ఇలా వివరించారు – వరాహస్వరూపమును ధరించి, అధర్మసాగరమున మునిగిపోవు భూమిని ఉద్ధరించినందున ఆయన 'వృషాకపి'యగును. (ఈ నామముపై వేర్వేరు వ్యాఖ్యానకర్తల భాష్యములలో భేదాలు స్పష్టంగా కనుపిస్తున్నాయని శ్రీ చిన్మయానంద అభిప్రాయము.)

శ్రీ భండారు పర్వతరావు రచన – 'ఓం నమో నారసింహాయ' నుండి.

ప్రళయకాలంలో సృష్టి అంతా జలమయం కాగా భూమి పాతాళానికి దిగిపోయింది. ప్రళయానంతరం పునఃసృష్టికై స్వాయంభువ మనువు నియమించబడ్డాడు. ఆయన తనకూ, తన సంతతికీ ఉండేందుకు స్థలం ఏదని బ్రహ్మను అడిగాడు. బ్రహ్మ 'విష్ణువును ప్రార్థించుము' అన్నాడు. మనువు ప్రార్థన నాలకించి, విష్ణువు బ్రహ్మనాసికారంధ్రం నుండి అంగుళమంత వరాహంగా బయటకు వచ్చాడు. అంతా చూస్తుండగానే ఆ వరాహం క్షణాలపై చకచకా పెరిగి ఆకాశమంత అయింది. సముద్రంలో మునిగి భూమిని తన కొమ్ము కొసన ధరించి పైకి వస్తుండగా హిరణ్యాక్షుడు తారసిల్లాడు. వరాహమూర్తికీ, హిరణ్యాక్షునికీ ఘోరయుద్ధం జరిగింది.

బ్రహ్మ వచ్చి, విష్ణువుతో 'ఇలా ఉపేక్ష చేయకుము. అభిజిన్ముహూర్తం వచ్చింది. వెంటనే రాక్షసుని సంహరించు' అన్నాడు. శ్రీవరాహమూర్తి చేతులలో రాక్షసుడు మరణించగానే దేవతలంతా జయజయ ధ్వానాలు చేసి విష్ణువును స్తుతించారు. దేవతల స్తోత్రాలను స్వీకరించి విష్ణువు (స్వస్వరూపంలో) వైకుంఠానికి వెళ్ళాడు.
ఈ కథను విన్నా, చదివినా గొప్ప కీర్తి, నారాయణ పదభక్తీ, ఇహపర సౌఖ్యాలూ కలుగుతాయి.

శ్రీవిష్ణుమహాపురాణమునుండి (భక్తి నివేదన - మే 2002) - (శ్రీవిష్ణుమహాపురాణాన్ని పరాశరమహర్షి రచించాడు. ఈ తెలుగు సేత శ్రీ ఉభయ వేదాంత శ్రీమాన్ ఎస్.వి. రంగరామానుజాచార్యస్వామివారిది.)
స్వామి వరాహరూపాన్ని ధరించి భూసముద్ధరణకై సముద్యమించాడు. స్వామి ఘుర్ఘుర ధ్వని చేస్తూ ఉంటే సామవేద కమనీయస్వరం వినిపిస్తున్నది.

తతః సముక్షిప్య ధరాః స్వదంష్ట్రయా - మహావరాహః స్ఫుట పద్మలోచనః
రసాతా దుత్పల పత్ర సన్నిభః - సముత్థితో నీల ఇవాచలో మహాన్

స్వామి తన కోరలతో పాతాళాంతర్గత అయిన భూమిని పైకి సముద్ధరించాడట. విశాలంగా వికసించిన పద్మాల్లా ఉన్న నేత్రాలతో మహావరాహరూపి అయిన స్వామి, భూమిని పైకెత్తుతూ నల్లని కలువ వంటి దేహచ్ఛాయ కలిగి ఒక మహావినీలగిరిలా పైకి లేచినాడట. పైకి లేస్తూ తన ముఖంనుండి ఆవిర్భవించిన వాయువులతో జలాలను పైకి చిమ్ముతూ ఉంటే, ముఖవాయు సముత్థితమైన జలం పైనున్న జనలోకవాసులపై పడిందట. పైలోకాలలో ఈ సన్నివేశాన్ని సానందంగా దర్శిస్తున్న సనక సనందనాది మహర్షుల స్వాభావిక పరిపూతులైనవారిని పరమపావనులుగా చేసిందట ఆ జలం.

జయదేవుని దశావతారస్తుతి నుండి.

వసతి దశన శిఖరే ధరణీ తవ లగ్నా - శశిని కళంక కళేవ నిమగ్నా
కేశవ! ధృత సూకరరూప! - జయ జగదీశ హరే!

103. అమేయాత్మా

ఆ పరమాత్ముని తత్వ స్వరూపములను తెలిసికొన సాధ్యము కాదు.

ఓం అమేయాత్మనే నమః

11వ శ్లోకము. 103వ నామము. అమేయాత్మా – **వృషాకపిః అమేయాత్మా సర్వయోగవినిస్సృతః**

19వ శ్లోకము. 181వ నామము. అమేయాత్మా – **అనిర్దేశ్యవపుః శ్రీమాన్ అమేయాత్మా మహాద్రిధృక్**

ఇయా నిత్యపరిచేద్య స్వభావాత్సర్వతోఽధికః

అమేయాత్మా సమద్దిష్టో హ్యాన్నత్య ఫలదో మనుః

పరమేశ్వరుడు సర్వాధికుడు కాబట్టి ఇంతటివాడు అని చెప్పటానికి వీలు లేదు. ఈ నామ స్మరణ ఉన్నతమైన ఫలితాన్నిస్తుంది.

'అమేయ' అనగా తెలియరానిది, కొలువరానిద, ఊహకందనిది. ఆ విరాట్ పురుషుని అనంత విభూతి లీలాగుణ సామర్థ్యములు ఈ నామములో కీర్తింపబడుచున్నవి (శ్రీ చిన్మయానంద). ఆయన తత్వము ఎరుగ తరము కాదు. ఆయన స్వరూప స్వభావములు ఊహింప వశము కావు.

104 సర్వయోగ వినిస్సృతః

- అన్ని సంగమములకు, బంధములకు, విషయవాసనలకు అతీతుడు.
- ఎన్నో విధముల్లైన (జ్ఞాన, కర్మ, భక్తి వంటి) యోగముల ద్వారా సులభముగా పొందనగువాడు.

ఓం సర్వయోగ వినిస్సృతాయ నమః

'యోగ' అనగా 'కలయిక', 'ఉపాయము' అని రెండు అర్థాలున్నాయి. ఆలాగే ఈ నామమును రెండు విధాలుగా వ్యాఖ్యానించారు.

వినిస్సృతః – ముందుకు వచ్చుట, తప్పించుకొనుట (సర్ విలియమ్ మోనియర్ గారి సంస్కృత నిఘంటువు.

యోగ – కలయిక, వినిస్సృత – తప్పించుకొనుట

సర్వేభ్యో యోగేభ్యః వినిస్సృతః –ఆ దేవదేవుడు ఏ విధమైన సంబంధ బాంధవ్యములకు, విషయ సంగమములకు బద్ధుడు కానివాడు. కనుక సర్వయోగ వినిస్సృతుడు.

పోతన భాగవతము – తానెవరినో వామనుడు బలికి ఇలా చెప్పాడు.

ఎవ్వరి వాడనంచు ఏమని పల్కుదు నా అంతవాడనై నడువనేర్తు
ఇది నా నడవడియని ఎట్లు వక్కాణింతు పూని ముప్పోకలు పోవనేర్తు
అది నేర్తు నిది నేర్తునని ఏల చెప్పంగ నేరుపులన్నియు నేనె నేర్తు
ఒరులు గారు నాకు ఒరులకు నేనౌదు ఒంటివాడను చుట్టమొకడు లేడు.

యోగ – ఉపాయము, వినిస్సృత – కదలివచ్చి అందువాడు.

సర్వైరుపాయైః ప్రాప్యశ్చ సర్వయోగవినిస్సృతః – భక్తులు ఎన్నో విధాలుగా ఆ జగన్నాధుని పొందగలరు.

శ్రీ భట్టుల వివరణ – యోగైః-ఉపాయైః, వి-విశేషణ, నిస్సృతః-ప్రాప్తుమ్ యోగ్యః, సుగ్రహ ఇతి వా

పోతన భాగవతము – శ్రీహరి కరుణ పొందుటకు నారదుని ఉపదేశము

కామోత్కంఠత గోపికల్ భయమునం గంసుండు వైరక్రియా
సామగ్రిన్ శిశుపాల ముఖ్య నృపతుల్ సంబంధులై వృష్ణులున్
ప్రేమన్ మీరలు భక్తి నేము నిదె చక్రిం గంటిమెట్లైన ను
ద్ధామ ధ్యాన గరిష్ఠుడైన హరిం జెందవచ్చు ధాత్రీశ్వరా

(1) శ్రీ నృసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

వసుర్వసుమనాః సత్యః సమాత్మా సంమితః సమః |
అమోఘః పుండరీకాక్షో వృషకర్మా వృషాకృతిః || (12)

105. వసుః

- తన భక్తుల హృదయములందు వసించువాడు. (వసించుట = నివసించుట)
- క్షీరసాగరమున వసించువాడు
- భక్తులు కోరుకొను పరమార్థము (అత్యుత్తమమైన సంపద.)
- అష్ట వసువులలో శ్రేష్ఠుడైన పావకుడు.
- అంతరిక్షమున వసించువాడు.

ఓం వసవే నమః

ఈ నామము మరల 271వ నామముగాను, 701వ నామముగాను వచ్చును.

12వ శ్లోకము. 105వ నామము – వసుః – **వసుః వసుమనా సత్యః సమాత్మా సమ్మితః సమః**

29వ శ్లోకము. 271వ నామము – వసుః – **సుభుజో దుర్ధరో వాగ్మీ మహేంద్రో వసుదో వసుః**

74వ శ్లోకము. 701వ నామము – వసుః – **వసుప్రదో వాసుదేవో వసుః వసుమనా హవిః**

వసతీతి వసుస్తేషు ప్రీత్యా పరమయా స్వయమ్ – తనభక్తుల యందు అపారమగు ప్రీతితో వారియందు వసించువాడు వసువు.

వసతీతి వసుః – నివాసముండువాడు 'వసుః' అనే ఆధారంగా మొదటి రెండు అర్ధాలు వస్తాయి. కొద్దిపాటిగానైనను భక్తి భావము కలిగినవారి హృదయాలలో శ్రీహరి స్థితుడైయుండును. మరియు ఆ శ్రీమన్నారాయణుడు శేషశయనుడై క్షీరసాగరమున వెలుగొందుచుండును. ఒక ఉపన్యాసములో శ్రీకృష్ణప్రేమిగారు ఇలా చెప్పారు. – భక్తులు ఎంతో దీక్ష, సాధన తరువాత గాని వైకుంఠప్రాప్తిని పొందలేరు. అట్టివారికి అందుబాటులో ఉండడం కోసం శ్రీమన్నారాయణుడు శ్రీలక్ష్మీసమేతుడై పాలసంద్రమున పవళించియుండును. సామాన్య భక్తుల చెంతకు వచ్చి చేయూతనిచ్చు కరుణామయుడే ఆ అచ్యుతుడు. తానై శబరి చెంతకు చేరి నైవేద్యమును స్వీకరించిన జానకీరాముడు. అజ్ఞానమువల్లనైనను పూజావిధులను నిర్వర్తించిన గుణనిధిని అనుగ్రహించిన గౌరీవల్లభుడు. ఎన్నోతప్పులు చేసినవారి ముడుపులు కూడ స్వీకరించి, వారి ఆపదలను తొలగించు అలమేలు మంగాపతి శ్రీవేంకటరమణుడు.

అనంతశయనుని క్షీరసాగర నివాసమునుగూర్చి శ్రుతులలో ఇలా ఉన్నది.
స లోకానామ్ హితార్థాయ క్షీరోదధే వసతి ప్రభుః – ఆ ప్రభువు సకల లోకములకు మేలు చేయుటకై పాలసంద్రమున వసించియుండును.
ఏష నారాయణః శ్రీమాన్ క్షీరార్ణవ నికేతనః (హరివంశము 113.62) – ఈ నారాయణుడు లక్ష్మీ సమేతుడై పాలకడలియందు నివాసముండును.

'వసు' అనగా ఐశ్వర్యము అని కూడ అర్థము. – **వసతి నీతిమతామ్ గృహ ఇతి వసుః** – అత్యుత్తమమగు ఐశ్వర్యము, మోక్షగాముల పరమార్థము ఆ శ్రీనివాసుడే. సకల సంపదల రూపము, సకల తపముల సిద్ధి, సకల జ్ఞానముల గమ్యము ఆ శ్రీహరియే. **వాసుదేవః సర్వమ్** - అని గీత (7.19)లో చెప్పబడినది. జ్ఞానులు అన్వేషించు పరమార్థమే శ్రీకృష్ణ పరమాత్మ.

అష్టవసువులలో శ్రేష్ఠుడైన పావకుడు (అగ్ని) గనుక ఆయనను 'వసుః' నామమున కీర్తింతురు. **వసూనామ్ పావకశ్చాస్మి** – అని శ్రీ శంకరులు గీత (10.23)నుండి ఆధారము చూపారు.

ధరో ధ్రువశ్చ సోమశ్చ, అహశ్చైవానిలోఽనలః
ప్రత్యూషశ్చ ప్రభాసశ్చ, వసవోఽష్టౌ ప్రకీర్తితాః (మహాభారతము. ఆదిపర్వము. 6.18)
ధరుడు, ధ్రువుడు, సోముడు, అహస్సు, అనిలుడు, అనలుడు (అగ్ని, పావకుడు), ప్రత్యూషుడు, ప్రభాసుడు అనువారు వసువులు. వీరిలో అనలుడు (అగ్ని) వసువులకు రాజు. దేవతలకు హవిస్సును అందించువాడు. మరియు ఇతడు భగవానుని ముఖముగా భావింపబడువాడు. కనుక భగవానుడు అగ్ని(పావకు)ని తన స్వరూపముగా తెల్పెను. (గీతా తత్త్వ వివేచనీవ్యాఖ్యనుండి)

కఠోపనిషత్తు (2.5.2)లో - **వసురంతరిక్షాత్** – అని చెప్పబడినది. అనగా ఆ పరంధాముడు వాయువువలె సంచరించుచు అంతరిక్షమున (ఆకాశమున) వసించును.

106 వసుమనాః

- శ్రేష్ఠమయిన, సకలైశ్వర్యవంతమైన మనసు గలవాడు.
- తన భక్తులను గొప్ప నిధులుగా భావించువాడు.

ఓం వసుమనసే నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది. 12వ శ్లోకంలోను, 74వ శ్లోకంలోనూ కూడా **వసుః, వసుమనాః** అనే నామములు ఒకదాని తరువాత మరొకటి వచ్చాయి.

12వ శ్లోకము. 106వ నామము. వసుమనాః – **వసుః వసుమనా సత్యః సమాత్మా సమ్మితః సమః**

74వ శ్లోకము. 702వ నామము. వసుమనాః – **వసుప్రదో వాసుదేవో వసుః వసుమనా హవిః**

వసునీవ నిధౌ తేషు మనో యస్యాస్తి సర్వదా
సర్వైర్వసుమనాః ప్రోక్తో మాతృవత్ పోషకో మనుః
మానవులకు తమయొక్క ధనం మీద, భాగ్యము మీద, సంపదమీద మనసు ఏ విధంగా లగ్నమై ఉంటుందో, అదేవిధంగా తనభక్తులయందు మనసు లగ్నమై ఉండువాడు. ఈ నామ మంత్రము తల్లివలె పోషించును. ఓం వసుమనసే నమః.

రాగద్వేష రహితము, మదమాత్సర్య రహితము, మాలిన్యము లేనిదినగు మనస్సు శ్రేష్ఠమయిన మనసు. అట్టి బంగారు మనస్సుగలవాడు వసుమనస్కుడు. ఆయనకు కామక్రోధములు అంటవు. విషయవాసనలు పట్టవు. దోషములు దరిచేరవు.

శ్రీహరి తన భక్తుల పాలిటి కల్పవృక్షము. శ్రీహరికి తనభక్తులు పెన్నిధివంటివారు.

బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే
వాసుదేవః సర్వమితి స మహాత్మా సుదుర్లభః – గీత 7.19
అనేక జన్మల పిదప జ్ఞానియైనవాడు (భగవత్తత్త్వమును ఎఱిగినవాడు) సర్వమూ వాసుదేవమయమే అని భావించి నన్ను శరణు పొందును. అట్టి మహాత్ముడు లభించుట అరుదు. కనుకనే శ్రీమన్నారాయణుడు తన భక్తులను ఇష్టనిధులుగా భావించి ప్రేమతో వారి యోగక్షేమములను వహించును.

107. సత్యః

- నిజము.
- ప్రాణము, పదార్థము (అన్నము), సూర్యుడు – ఈ మూడింటిచే కూడిన రూపము గలవాడు.
- సత్ప్రవర్తనయందు ప్రీతిగలవాడు.

ఓం సత్యాయ నమః

ఈ నామము మరి రెండుమార్లు (218, 873 నామములుగా) వస్తుంది.

12వ శ్లోకము. 107వ నామము. సత్యః – **వసుః వసుమనా సత్యః సమాత్మా సమ్మితః సమః**

23వ శ్లోకము. 218వ నామము. సత్యః – **గురుర్గురుతరో ధామః సత్యః సత్యపరాక్రమః**

93వ శ్లోకము. 873వ నామము. సత్యః – **సత్త్వవాన్ సాత్త్వికః సత్యః సత్యధర్మపరాక్రమః**

'సత్యము' అనగా 'నిజము' అనేది అందరికీ తెలిసిన అర్థము. ఇది సామాన్యమైన వాడుక పదము. 'సత్యః' అనే నామంతో శ్రీకృష్ణభగవానుని సంబోధించే ప్రామాణికం మహాభారతం ఉద్యోగపర్వము (69.12.13)లో ఉన్నది.

సత్యే ప్రతిష్ఠితః కృష్ణః సత్యమస్మిన్ ప్రతిష్ఠితమ్
సత్తా సత్తే చ గోవిందః తస్మాత్ సత్యః సతామ్ మతః

శ్రీకృష్ణునిలో సత్యమున్నది. సత్యములో శ్రీకృష్ణుడున్నాడు. సత్తు, అసత్తు (ఉనికి, మాయ) రెండును గోవిందునిలో స్థితములైయున్నవి. కనుక జ్ఞానులైన మహానుభావులు శ్రీకృష్ణుడే సత్యమని తెలిపినారు.

శ్రీ శంకరులు ఐతరేయారణ్యకమునుండి మరొక ఆధారమును ఉదాహరించారు.

సదితి ప్రాణాస్తీత్యన్నమ్ యమిత్య సావాదిత్యః – సత్ అనగా ప్రాణము, తి అనగా అన్నము, యమ్ అనగా సూర్యుడు. ప్రాణము, అన్నము, సూర్యుడు అనే రూపములలోనుండువాడు గనక శ్రీమన్నారాయణుని 'సత్యః' అని సేవింపనగును. మనలోని ప్రాణములు భగవంతుని రూపము. ఆ ప్రాణములు నిలుపు అన్నము పరబ్రహ్మస్వరూపము. ఆ అన్నము నొసగు సూర్యుడు ప్రత్యక్షనారాయణుడు.

సత్సు సాధుత్వాత్ సత్యః – సచ్ఛీలురైనవారి పట్ల భగవంతుడు ప్రీతి కలిగియుండున. వారికి పరమాత్ముడే ఆత్మబంధువు.

తత్ర సాధుః – అనే పాణిని సూత్రము (4.4.98)ననుసరించి – **తత్రేతి సప్తమీశమర్థాత్ సాధురిత్యే తస్మిన్నర్థే యత్ ప్రత్యయో భవతి** – 'యత్' ప్రత్యయము చేర్చుటవలన 'ఉత్తమమైన, సజ్జనులైనవారి విషయమునందు' అనే అర్థం వస్తుంది. సత్-యత్ = సజ్జనులయందు నిజమైనవాడు. సాధుసజ్జనుల యందుండు సత్ప్రవర్తనమే సత్యము. నిత్యము, భగవద్రూపము.

శ్రీ చిన్మయానంద – వేదాంతపరముగా భూత, వర్తమాన, భవిష్యత్ కాలములలో మారకుండ నిలిచియుండునదే సత్యము. అటువంటి గుణము కలిగినాడు సర్వేశ్వరుడు మాత్రమే. మాయామేయ జగంబును దాటి, కాలమునధిగమించిన పిదప ఏకాకృతితో వెలుగువాడు ఆ ఆత్మభవుడు. భూతభవ్యభవత్ప్రభువు. అవ్యయుడు. అక్షరుడు. శ్రీ వాసుదేవుడు.

108. సమాత్మా

సమమైన, భేదభావములు లేని, రాగద్వేష రహితమగు ఆత్మ.

ఓం సమాత్మనే నమః

సమస్త భూతములందు ఆత్మయై వసించు భూతాత్మునకు రాగద్వేషములు, తర తమ భావములు, స్వ పర భేదములు లేవు.

సమోఽహమ్ సర్వ భూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః
యే భజంతి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్ – గీత 9.29
నేను సకల భూతముల (ప్రాణుల)యందును సమ భావముతో వ్యాపించియుందును. నాకు అప్రియుడు గాని, ప్రియుడు గాని ఎవ్వడును లేడు. కాని నన్ను భక్తితో భజించువారు నాయందే ఉందురు. నేను వారియందు ప్రత్యక్షముగా ఉందును.

సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరమ్
వినశ్యత్స్వవినశ్యంతం యః పశ్యతి స పశ్యతి – గీత 13.27
నశ్వరములైన చరాచర భూతముల (ప్రాణుల)యందు సమముగా స్థితుడైయున్న పరమేశ్వరుడు నాశరహితుడు. అట్టి పరమేశ్వరుని చూచువాడే నిజమైన ద్రష్ట.

109. సమ్మితః

109. అసమ్మితః

- తన భక్తులచే ఇచ్ఛానుసారముగా నియంత్రింపబడువాడు (వారి అనుభవములకు గోచరించువాడు).
- ఋషులచే అంగీకరింపబడి, ఉపనిషత్తులద్వారా తెలుపబడినవాడు.
- పరిచ్ఛేదింప జాలనివాడు. అంత్యము, హద్దు లేనివాడు (అసమ్మితః)

ఓం సమ్మితాయ నమః

ఓం అసమ్మితాయ నమః

'సమ్మిత' అనగా 'ఒప్పుకొనబడినది' అనే పదంనుండి మొదటి రెండు అర్థములను గ్రహించవచ్చును. మొదటి అర్థము, శ్రీ భట్టుల వ్యాఖ్య ప్రకారము – లోకాధినాధుడు, బ్రహ్మను కన్న తండ్రి, దేవదేవుడు తానే బిడ్డయై దేవకీవసుదేవుల జన్మను ధన్యమొనర్చెను. నందనందనుడై, యశోదాదేవి ముంగిట ముత్యమై మన్ను తినెను. కౌసల్యా దశరథుల చెంత రామచంద్రుడై రఘువంశ కులదీపకుడయ్యెను. తన భక్తుల పట్ల ప్రేమతో వారికి బిడ్డయై, చెలుడై, చుట్టమై వారి జీవితమున పాత్రధారియగుటకు సమ్మతించెను. కనుక ఆ జగన్నాటక సూత్రధారిని 'సమ్మితః' అని కీర్తించిరి.

శ్రీ చిన్మయానంద – ఆయనే సత్యము, నిత్యము అనిఋషులు సమ్మతించినారు. ఉపనిషత్తులు తెలిపిన సత్యము ఆయనే.

(అద్వైతపాఠము ననుసరించి) శ్రీ శంకరులు ఈ నామమును 'అసమ్మితః' అని పరిగణించారు. అసమ్మితము అనగా మితము లేనిది. ఊహించ జాలనిది. పరిచ్ఛేదము కానిది. పరబ్రహ్మము. కనుక ఆయన అసమ్మితుడు.

110. సమః

- అన్నింటియందు సమభావము కలిగినవాడు.
- మార్పు లేక ఎల్లప్పుడు సమముగా (ఒకే తీరున) ఉండువాడు.
- శ్రీలక్ష్మి సమేతుడు.

ఓం సమాయ నమః

వికార రహితుడై, ద్వంద్వములకు అతీతుడైనవాడు, అందరిపట్ల సమ భావము కలిగినవాడు గనుక వాసుదేవుడు సముడగును.

'సమ' అనే అర్థాన్నే 'మార్పు లేక సమముగా ఉండువాడు' అని శ్రీ శంకరులు అన్వయించారు.

శ్రీ శంకరుల మరొక వివరణ – మా యా- లక్ష్మితో ఎల్లప్పుడూ, స-సహవర్తత్ - కూడియుండువాడు. కనుక ఆయన సదా లక్ష్మీవల్లభుడు. శ్రీధరుడు. శ్రీనివాసుడు. సముడు.

111. అమోఘః

తనను పూజించువారికి నిశ్చయముగా సత్ఫలములను ప్రసాదించువాడు.

ఓం అమోఘాయ నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

12వ శ్లోకము. 111వ నామము. అమోఘః - **అమోఘః పుండరీకాక్షో వృషకర్మా వృషాకృతిః**

17వ శ్లోకము. 156వ నామము. అమోఘః – **ఉపేంద్రో వామనః ప్రాంశుః అమోఘః శుచిరూర్జితః**

మోఘము అనగా వ్యర్థము. (మోఘమ్ నిరర్థకమ్ – అమరకోశము). అమోఘము అనగా వ్యర్థము కానిది. అర్థవంతమైనది. విశేషించి ఫలించునది.

అమోఘమ్ దర్శనమ్ రామ న చ మోఘః తవ స్తవః

అమోఘాస్తే భవిష్యన్తి భక్తిమంతశ్చ యే నరాః – రామాయణము. యుద్ధకాండము 120.31

రామా! నీ దర్శనము ఎల్లప్పుడూ అమోఘము. శ్రీరామ స్తుతి ఎన్నడూ వ్యర్థము కాజాలదు. నీ పట్ల భక్తులైన నరులు సదా విజయము పొందుదురు.

శ్రీరామరక్షాస్తోత్రమునుండి (గీత ప్రెస్ వారి ప్రచురణలోని అనువాదం)

ఏతాం రామబలోపేతాం రక్షాం యః సుకృతీ పఠేత్ - స చిరాయుః సుఖీ పుత్రీ విజయీ వినయీ భవేత్.

పాతాళ భూతల వ్యోమ చారిణశ్చద్మ చారిణః - న ద్రష్టు మపి శక్తాస్తే రక్షితమ్ రామనామభిః

రామేతి రామభద్రేతి రామ చంద్రేతి వా స్మరన్ - నరో నలిప్యతే పాపైర్భుక్తిం ముక్తిం చ విందతి.

జగజ్జైత్రైక మంత్రేణ రామనామ్నాభి రక్షితమ్ - యఃకంఠే ధారయేత్తస్య కరస్థాః సర్వ సిద్ధయః

వజ్రపంజర నామేదం యో రామకవచం స్మరేత్ - అవ్యాహతాజ్ఞః సర్వత్ర లభతే జయమంగళం.

శ్రీరాముని దివ్యబలయుతమైన ఈ రామరక్షాస్తోత్రమును పఠించెడి ధన్యుడు దీర్ఘాయువును, సుఖమును, పుత్రసంతానమును, విజయమును, వినయసంపదను పొందగలడు. పాతాళ, భూతల, ఆకాశ చరములు గాని, అదృశ్యరూపమున విహరించెడి శక్తులు గాని రామనామముచే రక్షింపబడునట్టివానిని కన్నెత్తి అయినను చూడజాలవు. 'రామ'యని, 'రామభద్ర'యని. 'రామచంద్ర'యని స్మరించెడి నరునకు ఎట్టి పాపమును అంటదు. అతడు భుక్తిని, ముక్తిని పొందగలడు. జగత్తును జయించగలిగిన ఏకైక మంత్రమగు రామనామముచే సురక్షితమైన (రక్షా)స్తోత్రమును కంఠస్థము చేసినవానికి సర్వసిద్ధులును కరస్థములగును. వాని ఆజ్ఞలకు ఎదురుండదు. సర్వకాల సర్వావస్థలయందును అతనికి జయము, శుభము కలుగును.

112. పుండరీకాక్షః

- తామరపూవువంటి కన్నులు గలవాడు.
- అందరి హృదయ కమలమున వసించి సమస్తమును చూచువాడు.
- వైకుంఠవాసులకు కనుచూపు వంటివాడు.

ఓం పుండరీకాక్షాయ నమః

పుండరీకము అనగా తామరపూవు. **పుండరీకే ఇవ అక్షిణీ యస్య సః పుండరీకాక్షః** – పద్మములవంటి సుందరమగు నేత్రములు కలవాడు పుండరీకాక్షుడు.

శ్రీ లింగాయత సూరిగారు తమ అమరకోశవ్యాఖ్యానములో ఇంకొక అర్థం కూడా చెప్పారు. **పుండరీకమ్ హృత్కమలమ్ అక్షతీతి వా** – హృదయ కమలమున వ్యాపించినవాడు పుండరీకాక్షుడు. (అక్షతి-వ్యాపించును)

శ్రీ భట్టులు 'పుండరీక' అనే పదానికి 'వైకుంఠము' అనే అర్థం గ్రహించారు. శ్రీవైకుంఠవాసులకు ఆయనే కన్నులవంటివాడు గనుక పుండరీకాక్షుడు. ఇందుకు మహాభారతము ఉద్యోగ పర్వము (69.6)లో ఆధారం ఉన్నది.

పుండరీకమ్ పరమ్ ధామ నిత్యమ్ అక్షరమ్ అవ్యయమ్
తద్భావాన్ పుండరీకాక్షః దస్యుత్రాసో జనార్దనః

నిత్యము, అవ్యయమునైన పరంధామమే పుండరీకము. ఆ దివ్యలోకవాసులకు చూపువైనందున (కంటికి రెప్పలాగా కాపాడువాడు గనుక) ఆయనను పుండరీకాక్షుడని కీర్తింతురు.

పృథివీ కృత శ్రీవరాహస్తుతి.

నమస్తే పుండరీకాక్ష! శంఖ చక్ర గదాధర!

మాముద్ధరాస్మాదద్యత్వం త్వత్తోఽహం పూర్వముత్థితా!

---

113. వృషకర్మా

ధర్మమే తన నిజకర్మగా కలిగినవాడు.

ఓం వృషకర్మణే నమః

శ్రేయస్కరం ధర్మరూపం కర్మయస్య ప్రచక్షతే
వృషకర్మేతి విఖ్యాతః శుభకర్మప్రదో మనుః

భక్తులకు శ్రేయోదాయకమైన ధర్మము అనబడే కర్మగలవాడు. ఈ నామాన్ని మంత్రంగా జపిస్తే శుభకర్మలు జరుగుతాయి.

'వృష' అనగా ధర్మము. కోరినవానిని వర్షించునది. **అభిలాషితమ్ వర్షతీతి వృషః** – శ్రీహరి కర్మములే ధర్మములు. ధర్మసంస్థాపనమే ఆయన కార్యము. కర్మబంధములు లేకున్నను, సాధింపదగినది (అవుసరము) ఏమీ లేకున్నను, ఆయన ధర్మపరిరక్షణకై, లోకహితమునకై కర్మలు ఆచరించును.

న మే పార్థాస్తి కర్తవ్య త్రిషు లోకేషు కించన

నానవాప్తమవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి – గీత 3.22

ఓ అర్జునా! ఈ ముల్లోకములందును నాకు కర్తవ్యము అనునదియే లేదు. అట్లే పొందదగిన వస్తువులలో నేను పొందనిదియును లేదు. ఐనను నేను కర్మలయందే ప్రవర్తిల్లుచున్నాను.

యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత

అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ – గీత 4.7

పరిత్రాణాయ సాధూనామ్ వినాశాయ చ దుష్కృతామ్

ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే – గీత 4.8

ఓ భారతా! ధర్మమునకు హాని కలిగినప్పుడును, అధర్మము పెచ్చుపెరిగిపోవుచున్నప్పుడును నన్ను నేను సృజించుకొందును. సత్పురుషులను పరిరక్షించుటకును, దుష్టులను రూపు మాపుటకును, ధర్మమును సుస్థిరమొనర్చుటకును నేను ప్రతియుగమునందును అవతరించుచుందును.

114. వృషాకృతిః

మూర్తీభవించిన ధర్మస్వరూపుడు.

ఓం వృషాకృతయే నమః

వృష-ధర్మము, ఆకృతి-ఆకారము. ధర్మమే ఆకారముగా కలవాడు వృషాకృతి.

తాపత్రయాగ్ని దగ్ధానాం సుధేవాత్యన్త శీతలమ్

రూపం కర్మ చయస్యాప్తి వృషకర్మా వృషాకృతిః

తాపత్రయాలతో తపిస్తున్నటువంటి తన భక్తులకు అమృతమువలె చల్లనైన రూపము, సుఖము ఇచ్చేటటువంటి ధర్మకర్మములు కలవాడు వృషకర్మ, వృషాకృతి.

రామో విగ్రహవాన్ ధర్మః సాధుః సత్యపరాక్రమః

రాజా సర్వలోకస్య దేవానామివ మానవః

శ్రీరాముడు ధర్మమే మూర్తీభవించిన స్వరూపుడు. కనుక ధర్మమునాచరించువాడును, ధర్మమును పూజించువాడును వేరుకాదు. ధర్మసంస్థాపనకై ఆకృతినొందినవాడు – అనికూడ అన్వయించుకొనవచ్చును.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

రుద్రో బహుశిరా బభ్రుర్విశ్వయోనిః శుచిశ్రవాః |
అమృతః శాశ్వతః స్థాణుర్వరారోహో మహాతపాః || (13)

115. రుద్రః

- కన్నులలో నీరు తెప్పించువాడు.
- భక్తులకు శుభము కలిగించువాడు.
- దుఃఖమును, దారిద్ర్యమును నాశనము చేయువాడు.

ఓం రుద్రాయ నమః

ఈదృగ్రూపై శ్చేష్టితైశ్చ భక్తానానంద బాష్పయన్
రోదయన్ రుద్ర ఉద్దిష్టః సర్వ సంతోషదో మనుః

పై నామాలలో చెప్పిన రూపము, చేష్టలతో తన భక్తులను ఆనంద పరవశులను గావించి, వారి కన్నులనుండి ఆనందబాష్పములు రప్పించువాడు. ఈ నామాన్ని మంత్రముగా జపించినట్లయితే సకల సంతోషాలు సమకూరతాయి. ఓం రుద్రాయ నమః. **రోదయతీతి రుద్రః** – నుండి మొదటి అర్థము వస్తుంది. ఈ అర్థమునే వ్యాఖ్యాతలు రెండు విధాలుగా అన్వయించారు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – ఆ భక్తవరదుడు తన ఆశ్రితుల కన్నులలో ఆనందబాష్పములు స్రవింపజేయును గనుక రుద్రుడు. ఇందుకు శ్రీ రాధాకృష్ణశాస్త్రిగారు శ్రీమద్భాగవతములోని ఒక శ్లోకాన్ని ఉదాహరించారు. దాని సారాంశము – భగవంతుని లీలాగుణ శ్రవణము వల్లను, ఆయన పుణ్యనామకీర్తన వల్లను ఆనందబాష్పములు రానివారిది రాతిగుండె కావలెను.

మరొక వ్యాఖ్య – ప్రళయ కాళమున సకల ప్రాణులను లయము కావించుచు వారికి దుఃఖమును కలిగించువాడు రుద్రుడు

శ్రీ శంకరుల మరొక వ్యాఖ్య – రుద్-శుభములను, ర-కలిగించువాడు. మంగళప్రదుడు. శ్రీకరుడు. శుభకరుడు. మరొక వ్యాఖ్య – **రుమ్ ద్రావయతి ఇతి రుద్రః** – దుఃఖములను హరించువాడు రుద్రుడు.

శ్రీ పెమ్మరాజు రాజారావు రచననుండి

రుద్రాణామ్ శంకరశ్చాస్మి (గీత 10.23) – ఏకాదశరుద్రులలో శుభప్రదాతయగు శంకరుడను నేనని గీతాచార్యుడు తెలిపియున్నాడు. **'శం' కరోతి ఇతి శంకరః** – శుభములను కలుగజేయు వాడగుటచేత శంకరుడు అనబడుచున్నాడు. శ్రీ మహావిష్ణువే 'రుద్ర' నామముతో ఇచట స్తవము చేయబడుచున్నాడు.

శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే

శివస్య హృదయం విష్ణుః విష్ణోశ్చ హృదయగ్ం శివః

116. బహుశిరాః

అనేక శిరస్సులు కలవాడు. అనంతుడు.

ఓం బహుశిరసే నమః

ఋగ్వేదము, పురుష సూక్తములో – **సహస్ర శీర్షా పురుషః సహస్రాక్షః సహస్రపాత్** – వేయి శిరసులు, వేయి కన్నులు, వేయి పాదములు – అని భగవానుని విరాడ్రూపమును వర్ణించారు. ఇదే విధమైన వర్ణన గీతలో విశ్వరూపదర్శనములోను, పరబ్రహ్మ తత్వవివరణలోను ఉన్నాయి. ఆయన అనంత ముఖములు అన్నియెడల విస్తరించియుండును. ఇది భాషకు, ఊహకు అందని విరాట్ పురుషుని గూర్చిన వర్ణన

అనేక వక్త్ర నయనమ్ అనేకాద్భుత దర్శనమ్

అనేక దివ్యాభరణం దివ్యానేకోద్యతాయుధమ్ – గీత 11.10

దివ్య మాల్యాంబరధరం దివ్య గంధానులేపనమ్

సర్వాశ్చర్యమయం దేవం అనంతం విశ్వతోముఖమ్ – గీత 11.11

అర్జునుడు చూచిన ఆ పరమేశ్వరుని విరాట్ (విశ్వ) రూపమునందలి ముఖములు అనంతములు. నేత్రములు అసంఖ్యాకములు. అందలి దృశ్యములు అద్భుతములైనవి. ఆ రూపము అనేక దివ్యాభరణ శోభితము. ఆ పరమేశ్వరుడు పెక్కు దివ్యాస్త్రములను చేపట్టి యుండెను. దివ్యములగు మాలలను, వస్త్రములను ధరించెను. ఆ దివ్య శరీరమునుండి దివ్య చందన పరిమళములు దశదిశల గుబాళించు చుండెను. ఆ రూపము సర్వాశ్చర్యకము. అనంతము. సర్వతోముఖము.

సర్వతః పాణి పాదం తత్ సర్వతోऽక్షి శిరోముఖమ్
సర్వతః శృతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి – గీత 13.13
ఆ పరమాత్ముని చేతులు, పాదములు, నేత్రములు, చెవులు, శిరస్సులు, ముఖములు సర్వత్ర స్థితములై యున్నవి. అతడు సర్వమును ఆవరించియున్నాడు.

ఈ నామము సహస్రాధిక ఫణ సంపన్నుడైన అనంతుని రూపమున విలసిల్లు శ్రీమహావిష్ణువును స్తుతించునని శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు.

117. బభ్రుః

ఆధారమైనవాడు. భరించువాడు.

ఓం బభ్రవే నమః

బిభ్రతి లోకాన్ ఇతి బభ్రుః – లోకములన్నింటిని భరించి, రక్షించువాడు. సమస్తమునకును ఆధారము. ఆయన ఆదిశేషుడై పృథ్విని భరించును. ఆదివరాహమూర్తియై భూదేవిని ఉద్ధరించి, రక్షించెను.

యస్య సా సకలా పృథ్వీ ఫణామణి శిరారుణా బిభర్తి మాలాం లోకానామ్ – ఈ భూమండలమంతా ఎవని పడగలలో నుండు మాణిక్యములయొక్క కాంతిచే ఎఱ్ఱగా ప్రకాశిస్తున్నదో, అతడే ఓ లోకాన్ని భరిస్తున్నాడు.

118. విశ్వయోనిః

- విశ్వమునకు కారణమైనవాడు.
- తన భక్తులను తనయందు విలీనము చేసికొనువాడు.

ఓం విశ్వయోనయే నమః

మరల 16వ శ్లోకములో 151వ నామము విశ్వయోనిః – **అనఘో విజయో జేతా విశ్వయోనిః పునర్వసుః**

'యోని' అనగా మూలకారణము. విశ్వమంతటికి మూలకారణము గనుక శ్రీమహావిష్ణువును 'విశ్వయోని' అని స్తుతింపనగును.

89వ నామము 'విశ్వరేతా' అనగా విశ్వమునకు మూలబీజము. 118వ నామము 'విశ్వయోని' అనగా ఆ బీజమును రక్షించి, జన్మనిచ్చి పోషించు గర్భస్థానము అని చెప్పవచ్చును. 9వ నామము 'భూత భావనః' అనగా సకల జీవకోటులను పోషించువాడు. 15వ నామము 'సాక్షీ' అనగా అంతటిని చూచువాడు. కనుక **'వాసుదేవః సర్వమ్'** అని తెలిసికొన్నవాడే జ్ఞాని (గీత). శ్రీ వాసుదేవుడే తల్లి, తండ్రి, ఆధారము, సాక్షి,

పరమపదము. ఆయనే సర్వము, సర్వేశుడు. భగవద్గీత 14వ అధ్యాయములోని 3,4 శ్లోకములలో కూడ ఈ నామముల సమన్వయమును గ్రహింపవచ్చును.

మమ యోనిర్మహద్బ్రహ్మ తస్మిన్ గర్భం దధామ్యహమ్ – గీత 14.3

అహం బీజప్రదః పితాః – గీత 14.1

విశ్వేషాం భేజుషాం స్వేన విశ్వయోనిస్తు మిశ్రణేత్ – తనను ఆశ్రయించినవారందరినీ తనతో సమానమైన రూపమిచ్చి తనతో చేర్చుకొనువాడు. 'యు' అనగా 'విలీనము' (**యు-మిశ్రణే**) అనే మూలంనుండి కూడ 'యోని' పదమును అన్వయింప వచ్చును. కనుక ఆయన తన భక్తులను కూడ తనలో విలీనము చేసికొనుటచే 'యోని' యగును. ఇది ఆయనకు భక్తులపట్ల గల అవ్యాజప్రేమ వలన జరుగును. కనుక ఆ గోపీజన ప్రియుని 'విశ్వయోని'యని కీర్తించిరి.

119. శుచిశ్రవాః

- ధర్మపూరితములు, సత్యములునగు వాక్కులను విని ఆనందించువాడు.
- మంగళకరములై, వినసొంపైన నామములు గలవాడు.
- దివ్యసుందరమగు చెవులు కలవాడు.

ఓం శుచిశ్రవసే నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య - **శుచీని శ్రావణ్యాని శృణోతి ఇతి శుచిశ్రవాః** – స్వచ్ఛమును, ధర్మయుతమునైన మాటలు ఆ భక్తవరదునకు బహుప్రీతికరములు. విదురుని పలుకులు, అన్నమయ్య కీర్తనలు, త్యాగయ్య గానము, రామదాసు స్తుతి, సూరదాసు కథలు, పోతన పద్యములు పట్ల ఆయనకు ఎంతో మక్కువ. తులసీదాసు, మీరాబాయి ఆయనను కీర్తించి తరించారు. గోదాదేవి తిరుప్పావైను ఆకర్ణించి కావేటి రంగడు పరవశించాడు.

ఈ అర్థానికి ఆధారంగా శ్రీ భట్టులు మహాభారతము శాంతిపర్వములోని శ్లోకము(344.61)ను ఉదాహరించారు.

శుచీని శ్రవణీయాని శృణోమి ఇహ ధనంజయ

న చ పాపాని గృహ్ణామి తతోऽహమ్ వై శుచిశ్రవాః

ధనంజయా! నేను స్వచ్ఛము, సొంపు అయిన విషయములను విందును. పాపవచనములను ఇచ్చగించను. కనుక నన్ను శుచిశ్రవుడు అనియందురు. ఇదే వివరణలో శ్రీ భట్టులు మహాభారతము ఉద్యోగపర్వము (93.2)నుండి విదురుని సుభాషితమును కూడా ఉదాహరించారు.

ధర్మ్యా, రమ్యాశ్చ అర్థవతీః విచిత్రార్థ పదాక్షరాః

శృణ్వంతో వివిధా వాచః విదురస్య మహాత్మనః

అకామస్త్యేవ కృష్ణస్య సా వ్యతీయాయ శర్వరీ

మహాత్ముడగు విదురుని ధర్మ, రమ్య, అర్ధవంతములైన విచిత్ర బహువిధ భాషణములను వినుచున్న శ్రీకృష్ణునికి గమనించకుండానే రాత్రి గడచిపోయినది.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **శుచీని శ్రవంసి నామాని శ్రవణీయాన్యస్యేతి శుచిశ్రవాః** – ఆయన నామములు వినుటకు ఇంపుగను, సొంపుగను ఉండును గనుక ఆయన శుచిశ్రవమూర్తి. శ్రీరామ, రామచంద్ర, రామభద్ర, గోవింద, గోపాల, వెంకరమణ, గురువాయూరప్ప, లక్ష్మీనరసింహ, సత్యనారాయణ, అప్పన్న, ఏడుకొండలవాడు, ఆపద మ్రొక్కులవాడు, బాలాజీ, కన్నయ్య, జగన్నాధ – ఇలా వేనవేలుగా భక్తులు ఆ శ్రీహరి నామములను స్మరించి, కష్టములు గడచి, తరించుచున్నారు. కనుక మనము కూడా గోవిందుని భజించి తరింతుము.

‘శ్రవస్’ అనగా ‘చెవి’ అనే అర్థంలో శ్రీ చిన్మయానంద వివరణ – ఆయన చెవులు దివ్యములు. భక్తుల మొరలు విని తరలి వచ్చెడు పరమాత్మ ఆయన. కరిరాజవరదుడు. అంతే గాక అందరిలోని వినికిడి శక్తి ఆ శుచిశ్రవ స్వామియే.

120. అమృతః

- భక్తులకు తనివి తీరని అమృతమూర్తి
- అజరుడు, అమరుడు.

ఓం అమృతాయ నమః

జరామృత్యోర్వారణేన హ్యతృప్తేర్వాపి సేవనాత్
అమృతస్స్యాన్నిరతిశయ మాధుర్యేతి చ సర్వదా
ఆశ్రితులకు మధురముగానుండి, జరామరణములు లేకుండా నివారించువాడు. ఎంత అనుభవించినప్పటికీ తృప్తి కలగకపోవటం చేత అమృతమువలె ఉండేవాడు. **శ్రీరామ నీ నామమెంతో మధురం** – భగవంతుని స్మరణ, జప, పూజాది సేవలొనర్చు భక్తులకు ఆ కొండలరాయుడు అమృతమూర్తి. భగవత్సేవా కార్యము ఎంత చేసినా భక్తులకు తనివి తీరదు. ఆయన భక్తుల హృదయములను శాంతింపజేయు అమృతమయుడు.

న విద్యతే మృతమ్ మరణమ్ అస్య ఇతి అమృతః – ఆయన షడ్వికార శూన్యుడు. జరామరణాది జీవ పరిణామములు ఆయనకు వర్తించవు. ఆయన నిత్య యవ్వనుడు. సచ్చిదానందుడు. **అజరః అమరః** – అని బృహదారణ్యకోపనిషత్తు (4.4.25)లో ఉన్నది.

భక్తుల అజ్ఞానమనే వ్యాధిని నివారించువాడగుటచే ఆయన ‘అమృతః’ అని శ్రీ చిన్మయానంద వ్యాఖ్యానించారు.

121. శాశ్వత స్థాణుః

కాలముతో నిమిత్తము లేకుండ, నిశ్చలముగా, నిత్యమై, సత్యమై, నిరంతరమైనవాడు. ఆదిమధ్యాంత రహిత పరబ్రహ్మము.

ఓం శాశ్వతస్థాణవే నమః

ఓం శాశ్వతాయ స్థాణవే నమః

ఈ నామములోని రెండు పదములు రెండు నామములుగా ఇంతకుముందు స్తుతించడమైనది.

57వ నామము. శాశ్వతః – నిరంతరముగా సృష్టి, స్థితి, లయ కార్యములొనర్చు శాశ్వతమూర్తి.

28వ నామము. స్థాణుః – భక్తులకు నిశ్చయముగా కామితార్థములను, పరమార్థమును ప్రసాధించువాడు. కాలమువలన మార్పు చెందనివాడు.

మరల 'స్థావర స్థాణుః' అనే 427వ నామములో భాగంగా 'స్థాణు' అనే పదము వస్తుంది. ప్రస్తుత 121వ నామము 'శాశ్వతస్థాణుః' ఒకే నామముగా దాదాపు అన్ని వ్యాఖ్యానాలలోను ఉన్నది.

శ్రీ భట్టుల వ్యాఖ్య – ఆయన ఉనికి, స్వభావము, స్వరూపములు కాలముతో మారవు. స్థలము వల్లను మారవు. పాలసముద్రమును చిలుకుటవలన సాధించిన అమృతమును వేరెవరో తన్నుకొని పోవచ్చును. కాని శ్రీహరి ధ్యానమగ్నులైన భక్తులనుండి ఆయనను విడదీయుట సాధ్యము కాదు. కనుకనే ఆ నారాయణుడు శాశ్వతస్థాణువు (Eternal and Steady) .

భోగ్యే హ్యపునరావృత్త్యా భోక్తృభ్యో రోచతే యతః

స్వయం నిత్యస్సదాయోऽసౌ శాశ్వతస్థాణురుచ్యతే

తానెప్పుడు నిత్యముగా ఉంటాడు కాబట్టి తన భక్తులైన నిత్యముక్తులకు పునర్జన్మ లేనటువంటి భోగ్యవస్తువైనాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – కాలముతో నిమిత్తము లేకుండా దృఢముగా, స్థిరముగా నిలిచియుండువాడు. (Eternally firm)

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – తుది, మొదలు లేనివాడు గనుక 'శాశ్వత', వయస్సు, క్షీణత లేనివాడు గనుక 'స్థాణు'. వెరసి ఆ పరమాత్ముడు శాశ్వతస్థాణువు.

122. వరారోహః

- అన్నింటికంటె శ్రేష్ఠమగు ఊర్ధ్వగతి. పొందదగిన అత్యున్నత పదము.

- అత్యున్నతమగు వృద్ధి కలిగినవాడు.

- ఆదిశేషునిపై పవళించువాడు.

ఓం వరారోహాయ నమః

పరమోత్కృష్ట మారోహం యస్య స్వప్రాప్తి లక్షణమ్
వర్తతే న వరారోహః ప్రకృష్టః స్థానదో మనుః
అన్నింటికీ మిన్నయయిన తనను పొందడం అనే పరమోన్నతమైన లక్షణము కలవాడు. ఈ నామము ఉన్నతమైన స్థానాన్ని ప్రసాదిస్తుంది. 'వరమ్' అనగా శ్రేష్ఠమైనది. 'ఆరోహమ్' అనగా పైకి ఎక్కుట. ఈ నామమును శ్రీ భట్టులు 'అత్యున్నతి గతి' అనీ, శ్రీ శంకరులు 'అత్యున్నత ఊర్ధ్వమార్గము' అనీ వ్యాఖ్యానించారు. శ్రీ వైకుంఠమే ముముక్షువుల పరమపదము. పరంధామము. శ్రీమన్నారాయణుడే పరమగతి. **స న పునరావర్తతే** – అట్టివానికి పునరావృతి లేదు (అతడు తిరిగిరాడు) అని ఛాందోగ్యోపనిషత్తులో ఉన్నది.

ఆదిశేషునిపై శయనించినవాడు, ఉన్నతమైన పర్యంకము కలవాడు గనుక వరారోహుడు అని శ్రీరాధాకృష్ణశాస్త్రిగారు వివరించారు.

మాముపేత్య పునర్జన్మ దుఃఖాలయ మశాశ్వతమ్
నాప్నువంతి మహాత్మానః సంసిద్ధిం పరమాం గతాః – గీత 8.15
ఆ బ్రహ్మ భువనాల్లోకాః పునరావర్తినోఽర్జున
మాముపేత్య తు కౌంతేయ పునర్జన్మ న విద్యతే – గీత 8.16
పరమ సిద్ధిని పొందిన మహాత్ములు నన్ను చేరిన పిదప, దుఃఖములకు నిలయమైన, క్షణభంగురమైన పునర్జన్మను పొందరు. అర్జునా! బ్రహ్మలోకము పర్యంతము ఉన్న సమస్త లోకములును పునరావృతములు. కౌంతేయా! (ఈ లోకములన్నియును కాలమునకు పరిమితములైనవి. నేను కాలాతీతుడను). కనుక నన్ను చేరినవానికి పునర్జన్మయుండదు.

న తద్భాసయతే సూర్యో న శశాంకో న పావకః
యద్గత్వా న నివర్తంతే తద్ధామ పరమం మమ – గీత 15.6
స్వయంప్రకాశ స్వరూపమైన నా పరంధామమును సూర్యుడు గాని, చంద్రుడు గాని, అగ్ని గాని ప్రకాశింపజేయ జాలరు. అట్టి పరంధామమును చేరిన పుణ్యాత్ములు మరల ఈ జగత్తున ప్రవేశింపరు. అనగా జన్మింపరు.

శ్రీ భట్టుల నామవిభాగ ప్రకారము ఈ పుణ్యస్తోత్రములోని మొదటి 122 పవిత్ర, మంగళ నామములు శ్రీమహావిష్ణువుయొక్క పరవాసుదేవ స్వరూపమును కీర్తించునవి. పరవాసుదేవ స్వరూపము షడ్గుణైశ్వర్య సంపన్నము. జ్ఞాన, బల, ఐశ్వర్య, వీర్య, శక్తి, తేజో గుణములచే పరిపూర్ణమైనది. ఎల్లలు లేనిది. ఆధారము అవుసరము లేనిది. ముముక్షువుల పరమావధి. (1) 'విశ్వమ్' నుండి (122) 'వరారోహః' వరకు చెప్పబడిన నామములు భగవంతుని దివ్య పరతత్వమును కీర్తించుచున్నవి. పరవాసుదేవుని పూజించుచున్నవి.

ఇంతేగాక, యుధిష్ఠిరుని ఆరు ప్రశ్నలలో మొదటి రెండు ప్రశ్నలకును సమాధానము ఈ 122 దివ్య నామములలో పొందుపరచియున్నదని శ్రీభట్టుల వివరణ. ఆ రెండు ప్రశ్నలు

(1) **కిమేకమ్ దైవతమ్ లోకే** – లోకమున ఒక్కడేయైన దేవుడెవ్వరు?

(2) **కిమ్ వాపి ఏకమ్ పరాయణమ్** – మానవులు పొందదగిన ఏకైక మహోన్నత స్థానమేది?

ఇక యుధిష్ఠిరుని 3వ ప్రశ్న

(3) **స్తువంతః కిమ్** – ఎవనిని స్తుతింపవలెను?

ఈ ప్రశ్నకు సమాధానముగా 'వ్యూహ స్వరూపములు' అని చెప్పబడినది అని శ్రీభట్టులు వ్యాఖ్యానించారు. భగవంతుని వ్యూహములు నాలుగు. అవి.

1. వాసుదేవుడు
2. సంకర్షణుడు
3. ప్రద్యుమ్నుడు
4. అనిరుద్ధుడు.

వీనిలో వాసుదేవమూర్తియే పరవాసుదేవ స్వరూపముగా భావింపవచ్చును. కనుక ఈ వ్యూహము 1 నుండి 122 వరకు నామములలో కీర్తింపబడినది.

భగవంతుని వ్యూహావతారములు సృష్టి, స్థితి, లయ కార్యములకు ఆధారములుగా గ్రహించాలి. ఒక్కొక్క వ్యూహమునకున ఒక్కో ప్రధాన కార్యమును ఆపాదించారు. ఆ కార్యమునకు అనుగుణముగా ప్రతి వ్యూహమునకు కొన్ని గుణములు, రూపములు వర్తించును. ఈ వ్యూహములలో భగవంతుడు సృష్టి, స్థితి, లయలను నిర్వహించును. శాస్త్రములను ప్రతిపాదించును. వాని ప్రాముఖ్యతను తెలియబరచును. శాస్త్రానుగుణముగా ఫలములను ప్రతిపాదించును.

సంకర్షణమూర్తి జ్ఞాన, బల సంపన్నుడు. ఇక్కడి నుండి – అనగా 'మహాతపః' నామమునుండి – సంకర్షణుని స్తుతించే నామములు చెప్పబడినవి.

బాదామి గుహలో నారాయణుని శిల్పం. వికీపీడియా చిత్రం.

123. మహాతపః

మహత్తరమైన జ్ఞానము కలిగినవాడు.

ఓం మహాతపాయ నమః

మహత్ పూజ్యం తపో జ్ఞానం యస్యేతి స మహాతపాః – పూజనీయమైన జ్ఞానము కలవాడు.

ముండకోపనిషత్తులో - **యస్య జ్ఞానమయం తపః** - అని చెప్పబడినది.

పరమాత్మయొక్క తపస్సు జ్ఞానస్వరూపము. 'మహత్' అనగా పూజింప దగినది. సంచిత, ఆగామి, ప్రారబ్ధ కర్మ బంధములను అధిగమించి, భవసాగరమును తరించు జ్ఞానము ఆయననుండియే లభించును.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

శ్రీ సీతారామచంద్రాభ్యాం నమః

శ్రీ సుందర కాండము

శ్రీ మద్వాల్మీకి రామాయణాంతర్గత 'సుందర కాండము' నందు హనుమంతుని జయఘోష

శ్రీ వావిలికొలను సుబ్బారావుగారి శ్రీ మదాంధ్రవాల్మీకి రామాయణము (మందరము)నందు తెలుగు అనువాదము.

నమోస్తు రామాయ సలక్ష్మణాయ
దేవ్యైచ తస్యై జనకాత్మజాయై
నమోస్తు రుద్రేంద్ర యమానిలేభ్యో
నమోస్తు చంద్రార్క మరుద్గణేభ్యః

మ్రొక్కెద రామచంద్రునకు మ్రొక్కెదఁ గేలు సుమిత్ర పట్టికిన్
మ్రొక్కెదఁ దద్విదేహప తనూజకు శ్రీరఘురాము దేవికిన్
మ్రొక్కెద ధర్మ వాసవ మరుద్గణ మారుత రుద్రపాళికిన్
మ్రొక్కెద సూర్య చంద్రులకు మ్రొక్కెదఁ దామరసాప్త సూతికిన్

జయత్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః
రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః

జయము జయంబు రామునకు సారపరాక్రమ ధన్యమూర్తికిన్
జయము జయంబు విద్విషదసహ్య తరస్వి సుమిత్ర పట్టికిన్
జయము జయంబు దాశరథి సంపరిపాలితుఁడౌ వలీముఖో
చ్ఛయపతి సూర్యపుత్రునకు సాహసవిక్రమ కీర్తిశాలికిన్

దాసోహం కోసలేంద్రస్య రామస్యాక్లిష్ట కర్మణః
హనుమాన్ శత్రుసైన్యానాం నిహన్తా మారుతాత్మజః
న రావణ సహస్రం మే యుద్ధే ప్రతిబలం భవేత్
శిలాభిస్తు ప్రహరతః పాదపైశ్చ సహస్రశః

దాసుఁడ సర్వ సద్గుణ వితాన మనోహర రామమూర్తికిన్
గోసల దేశ వల్లభుకున్ హత శత్రుఁడ వాయుపుత్రుఁడన్
నా సరిగారు సంగరమునన్ దశకంఠులు వేవురేనియున్
వాసి యడంతు ఱాల ద్రుమపాళుల నే హనుమత్సమాఖ్యుఁడన్

అర్దయిత్వా పురీం లంకాం అభివాద్య చ మైథిలీమ్
సమృద్ధార్థో గమిష్యామి మిషతాం సర్వరక్షసామ్

ధ్వంసంబుఁ జేసి లంకను
హింసించి సమస్త రాక్షసేంద్రుల సీతా
హంసీయానకు మ్రొక్కి ప్ర
శంసిత గతిం జనెద మిడుక సకల సురారుల్.

మహాబల సంపన్నుడైన శ్రీరామునకు జయము. మిక్కిలి పరాక్రమశాలియైన లక్ష్మణస్వామికి జయము. శ్రీరామునకు విధేయుడు, కిష్కింధకు ప్రభువు అయిన సుగ్రీవునకు జయము. అసహాయ శూరుడు, కోసల దేశపు ప్రభువు అయిన శ్రీరామునకు నేను దాసుడను. వాయుపుత్రుడను. నా పేరు హనుమంతుడు. శత్రుసైన్యములను రూపుమాపువాడను. వేయి మంది రావణులైనా గాని యుద్ధ రంగమున నన్నెదిరించి నిలువలేరు. వేలకొలది శిలలతోడను, వృక్షములతోడను సకల రాక్షసులను, లంకాపురిని నాశనం చేస్తాను. రాక్షసులందరూ ఏమీ చేయలేక చూస్తూ ఉండెదరు గాక. నేను వచ్చిన పనిని ముగించుకొని, సీతాదేవికి నమస్కరించి వెళతాను.

సర్వగః సర్వవిద్భానుర్విష్వక్సేనో జనార్దనః |
వేదో వేదవిదవ్యంగో వేదాంగో వేదవిత్కవిః || (14)

115. సర్వగః

అంతటను గమనము కలవాడు. ఎక్కడైనా చేయూతనిచ్చువాడు.

ఓం సర్వగాయ నమః

ధారయన్ సంహృతాద్యై పై గచ్ఛతీతి సర్వగః – అన్నింటిని తన శక్తితో ధరించి, సంహరించి, మళ్ళీ సృష్టించి, వాటియందు ప్రవేశించువాడు.

సర్వత్ర గచ్ఛతి ఇతి సర్వగః – అన్నిచోట్లకు వెళ్ళువాడు. అందరికీ, అన్నింటికీ ఆధారముగానుండు శక్తిసంపన్నుడు. ప్రళయకాలమున అంతనూ తనలో ఇముడ్చుకొన్నవాడు.

సర్వగః పాణిపాదం తత్ సర్వతోఽక్షి శిరోముఖమ్
సర్వతః శృతి ముల్లోకే సర్వమావృత్య తిష్ఠతి – గీత 13.13
ఆ పరమాత్ముని చేతులు, పాదములు, నేత్రములు, చెవులు, శిరస్సులు, ముఖములు సర్వత్ర స్థితముల్లై యున్నవి. అతడు సర్వమును ఆవరించి యున్నాడు.

కొండలలో నెలకొన్న కోనేటిరాయని తిరుమలలో పూజించవచ్చును. ద్వారకాతిరుమలలో సేవింపవచ్చును. చిలుకూరులో ప్రదక్షిణము చేయవచ్చును. మస్కట్ లో ధ్యానించవచ్చును. అమెరికాలో గాని, అంతరిక్షమున గాని, ఆంధ్రప్రదేశ్ లో గాని, ఇంటిలో గాని, గుండెలలో గాని నివసించి, మ్రొక్కినవారికి పెక్కు శుభములు కలిగించు సంకర్షణునికి నమస్కారములు.

125. సర్వవిత్ / సర్వవిద్భానుః

- సమస్తమును తెలిసినవాడు.

- సమస్తమునకు పునరుజ్జీవనము ప్రసాదించువాడు.

ఓం సర్వవిదే నమః

సర్వ వేత్తి విందతి ఇతి వా సర్వవిత్ – దీనికి రెండు అర్థాలు చెప్పారు.

* సమస్తమును ఎరిగినవాడు. శ్రీహరి విశ్వాంతరాత్ముడై, సాక్షియై, అనంతుడై, ఆదిమధ్యాంతరహితుడై సర్వమును తెలిసికొనును. విష్ణువునకు తెలియని జ్ఞానము లేదు. ఆయనెరుగని కార్యము లేదు.

* సమస్తమును వెలికి తీయువాడు. ఇది ప్రద్యుమ్న వ్యూహమును సూచించు కార్యము. ఆయన సంకర్షణుడై సకల జీవములను తనలో లీనమొనర్చుకొనగా, ప్రద్యుమ్నుడై సకల జీవములను తిరిగి వెలికి తీయును. (పునర్జీవితులను చేయును.) – **ప్రద్యుమ్నత్వేతు కార్యాణి లభతే యః స సర్వవిత్.** ప్రద్యుమ్న మూర్తియై తనతో సృష్టింపబడిన సమస్త కార్యములను లభింపజేయువాడు సర్వవిత్.

శ్రీ శంకరుల భాష్యము ప్రకారము, 'సర్వవిత్' మరియు తరవాతి నామము 'భానుః' కలిపి ఒకే నామముగా 'సర్వవిద్భానుః'అని చెప్పబడినది.

ఓం సర్వవిద్భానవే నమః

శ్రీ పెమ్మరాజు రాజారావు రచననుండి – సర్వవిత్ + భానుః = 'సర్వవిద్భానుః' అననది ఏకనామము. 'సర్వవిత్' అనగా సర్వమును ఎరింగినవాడనియు, 'భానుః' అనగా కాంతి స్వరూపుడనియు భావము. **జ్యోతిషామపి తజ్జ్యోతి** (గీత 13.13) – సూర్య చంద్రాది జ్యోతులకంటెను దివ్యప్రకాశ సంపన్నుడు. సూర్య చంద్రాగ్నులయందు గల తేజస్సంతయు నాదే - అని భగవద్వాక్యము (గీత-15.2). 'జ్ఞానమయ దివ్య జ్యోతి' యగుట చేత భగవానుడు 'సర్వవిద్భానుః' అని కీర్తింపబడును.

126. భానుః

ప్రకాశించువాడు.

ఓం భానవే నమః

భాతి ఇతి భానుః – నిశ్చలముగా ప్రకాశించువాడు. ఆయన సృష్టి, పాలన కార్యము వలన విశ్వములో పరిణామము సహజము. కాని ఆయన మాత్రము మార్పు లేక, నిరవధికముగా, నిశ్చలముగా

ప్రకాశించుచునే యుండును. **భాను సర్వస్య భాతీతి నిర్మాణేస్యవికారతః** – అన్ని పదార్థాలను నిర్మించి, తాను కొంచెము కూడా వికారము చెందకుండా ప్రకాశించువాడు.

యదాదిత్యగతం తేజో జగద్భాసయతేऽఖిలమ్

యచ్చన్ద్రమపి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకమ్ – గీత 15.12

సమస్త జగత్తును ప్రకాశింపజేయు సూర్యుని తేజస్సు, అటులనే చంద్రుని తేజస్సును, అగ్ని తేజస్సును నా తేజస్సేయని ఎరుంగుము.

127. విష్వక్సేనః

లోకరక్షణార్థము అన్ని దిక్కులయందు సైన్యము కలిగినవాడు. తన తలంపు మాత్రమున సర్వ దానవ సైన్యమును నాశనము చేయువాడు.

ఓం విష్వక్సేనాయ నమః

ఇనేన స్వామినా సాకం వర్తతే సేన ఇత్యతః

విష్వగ్రక్ష్యే జనో యస్య విష్వక్సేన ఇతీరితః

'ఇన' అంటే ప్రభువు. అతడితో ఉన్నది సేన. అదే ఇక్కడ పరమాత్మ అంతర్యామిగా ఉండి రక్షించే సంసారము.

ఇనేన స్వామినా ఈశ్వరేణ సహావర్తతే ఇతి సేనా

విషూచీ సేనా యస్య సః విష్వక్సేనః

'ఇనుడు' అంటే స్వామి. ఆ స్వామితో కూడి ఉన్నది సేన, అనగా రక్షక వర్గము. అటువంటి రక్షక వర్గాన్ని నాలుగు దిక్కులయందు కలవాడు కాబట్టి 'విష్వక్సేనుడు' అనబడుతున్నాడు.

(పై శ్లోకాలు, మరియు అనేక నామాలకు సంబంధించిన కొన్ని శ్లోకాలను, వాని తాత్పర్యాలను డా. క్రోవి పార్థసారధి గారు రచించిన 'శ్రీకైవల్య సారధి' అనేపుస్తకం నుండి తీసికొంటున్నాను. – కా. సు. బాబు)

శ్రీ భట్టుల వివరణ ప్రకారము ఈ నామము అనిరుద్ధ మూర్తిని కీర్తించును. అనిరుద్ధుడు మనందరకును రక్షకుడు. **ఇనేన వర్తతే ఇతి సేన** – ఇక్కడ 'ఇనేన' అనగా 'స్వామికి తోడుగా' (స్వామిన్ సహా) అని అర్థము. కనుక ఎల్లప్పుడూ స్వామి వెంటనే ఉండునది సేన (సేశ్వరః). ఈ నామము ఆయన శక్తిని సూచించును. 'అ-నిరుద్ధ' అనగా నిరోధింపజాలని వాడు. ఎవ్వరి నియంత్రణలోను ఉండనివాడు. శక్తిమంతుడు. స్వతంత్రుడు. ఆ శక్తి ఆ శ్రీమన్నారాయణునిదే. ఆయనే విష్వక్సేనుడై భక్తులను కాపాడుచుండును.

తన తలంపు మాత్రమున సర్వ దానవ సైన్యమును నాశనము చేయువాడు. విష్వక్సేనుడు విష్ణుమూర్తికి సేనాపతి విష్వక్సేనుడు.

యస్య ద్విరద వక్త్రాద్యాః పారిషద్యాః పరఃశతమ్

విఘ్నం నిఘ్నన్తి సతతం విష్వక్సేనం తమాశ్రయే

128. జనార్దనః

- దుష్టులను శిక్షించువాడు.

- దుష్టుల బారినుండి సజ్జనులను రక్షించువాడు.

- కామితార్థములకై భక్తులు ఎవరిని ఆశ్రయింతురో ఆ దేవుడు.

ఓం జనార్దనాయ నమః

భక్త విద్వేషిణాం తూర్ణం మర్దనాద్ధి జనార్దనః – తనయొక్క భక్తులను ద్వేషించేవారిని శిక్షించువాడు జనార్దనుడు. శ్రీ భట్టులు చెప్పిన ప్రమాణము

దస్యు త్రాణాత్ జనార్దనః (మహాభారతము. ఉద్యోగ పర్వము. 71.6) – దస్యులను (రాక్షసులను) శిక్షించి ప్రజలను రక్షించువాడు గనుక శ్రీకృష్ణుడు జనార్దనుడగును.

శ్రీ శంకరులు రెండు అర్థాలను చెప్పారు.

జనాన్-దుర్జనాన్, అర్థయతి-హినస్తి – అనగా దుర్జనులను శిక్షించువాడు జనార్దనుడు.

జనైః అర్థయతే – జనులచే యాచింపబడువాడు జనార్దనుడు. ముడుపులు కట్టి, మ్రొక్కులు మ్రొక్కి, దీక్షలు పూని, వ్రతములు ఆచరించి, పూజలు చేసి, కీర్తనలు ఆలాపించి భక్తులు తమ కోరికలను శ్రీవేంకటరమణునికి విన్నవించుకొంటారు. ఆ జనార్దనుడు భక్తవరదుడై వారికి కామితార్థములను ప్రసాదిస్తాడు.

పరిత్రాణాయ సాధూనామ్ వినాశాయ చ దుష్కృతామ్

ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే – గీత 4.8

సత్పురుషులను పరిరక్షించుటకును, దుష్టులను రూపుమాపుటకును, ధర్మమును సుస్థిర మొనర్చుటకును నేను ప్రతి యుగమునందును అవతరించుచుందును.

ద్రౌపది ప్రార్థన. తనను వేరెవరు రక్షింపజాలరని తెలిసికొని కురుసభలో ద్రౌపది ఆర్తయై మానసంరక్షణ కొఱకు గోపీజన వల్లభుని ప్రార్థించిన విధము. మహాభారతము. సభాపర్వము.67

గోవిందా! ద్వారకా వాసిన్! కృష్ణ! గోపీజన ప్రియా!

కౌరవైః పరిభూతానాం మాం, కిం న జానాసి కేశవ?

హే నాథ! హే రమానాథ! వ్రజనాథార్తినాశన!

కౌరవార్ణవ మగ్నాం మాముద్ధరస్వ జనార్దన!

కృష్ణ! కృష్ణ! మహాయోగిన్! విశ్వాత్మన్! విశ్వభావన!

ప్రపన్నాం పాహి గోవింద! కురుమధ్యేఽవసీదతీమ్.

ఓ గోవింద! ద్వారకావాసి! ఓ కృష్ణ! గోపీజనప్రియ! కేశవ! కౌరవులు నన్ను అవమానించుచున్న విషయమును నీవెరుగవా? ఓ జగన్నాథ! లక్ష్మీనాథా! వ్రజనాథా! దుఃఖ నాశన! జనార్దన! కౌరవ సముద్రమునందు మునుగుచున్న నన్ను రక్షించుము. హేకృష్ణ! కృష్ణ మహాయోగీశ్వర! విశ్వాత్మా! విశ్వభావనా! గోవిందా! దుఃఖితురాలనై నిన్ను శరణు జొచ్చిన నన్ను కౌరవుల బారినుండి రక్షింపుము. (గీతా ప్రెస్ ప్రచురణ నుండి)

129. వేదః

సమస్త జ్ఞానము మూర్తీభవించిన స్వరూపుడు. వేదమూర్తి.

ఓం వేదాయ నమః

'విద్' అనగా 'తెలిసికొనుట'. ఈ ధాతువునుండే 'వేద' శబ్దము వస్తుంది. **వేదయతీతి వేదః** – అంతటిని తెలియపరచు పరమ సత్యమే వేదము. జనార్దనుని ఊపిరినుండి వేదములు ఉద్భవించాయి. వేదములకు, వేదవేద్యునకు భేదం లేదు.

సర్వే వేదాః సర్వ విద్యాః సశాస్త్రాః సర్వే యజ్ఞాః సర్వ ఇజ్యాశ్చ కృష్ణః (మహాభారతము) – అన్ని వేదములు, అన్ని విద్యలు, అన్ని శాస్త్రములు, అన్ని యజ్ఞములు, అన్ని నివేదనలు శ్రీకృష్ణుడే.

యోగో జ్ఞానం తథా సాంఖ్యం విద్యాః శిల్పాది కర్మ చ
వేదాశ్శాస్త్రాణి విజ్ఞానమేత త్సర్వం జనార్దనాత్ - శ్రీ విష్ణు సహస్రనామము ఉత్తర పీఠిక
యోగము, జ్ఞానము, సాంఖ్యము, విద్య, సర్వశాస్త్రములు జనార్దనుని నుండియే కలిగినవి.

శ్రీ భట్టుల వ్యాఖ్యానంలో ఈ శుభనామము జ్ఞానగుణ సంపన్నుడైన సంకర్షణ వ్యూహ స్వరూపమును సూచించును.

ద్వారకా తిరుమల భక్తి సుధ (ఆడియో కాసెట్టు నుండి)
రచన: డా. పప్పు వేణుగోపాలరావు, గానం: శ్రీమతి విజయలక్ష్మి సుబ్రహ్మణ్యం.

చిన్న తిరుపతిలోని శ్రీనివాసుడు వాడు - భవబంధములు ద్రెంచు పరమాత్ముడే వాడు
వేదములు ఘోషించు విమల తత్వము వాడు - భువనములు శాసించు పురుషోత్తముడు వాడు
నమ్మి భజియించితే నారాయణుడు వాడు - అవని రక్షింపగా అవతరించెను వాడు.

ద్వారకా తిరుమల – దీపారాధనా స్థలంవద్ద స్వామివారి ద్వయమూర్తులు

130. వేదవిత్

- వేదములను, వాని సారమును (అర్థమును) సంపూర్ణముగా నెరిగినవాడు.

- వేద జ్ఞానమును బోధించువాడు.

ఓం వేదవిదే నమః

ఈ నామము ఇదే శ్లోకములో 130, 133వ నామములుగా రెండుమార్లు వస్తుంది -

వేదో వేదవిత్ అవ్యంగో వేదాంగో వేదవిత్ కవిః

వేదమ్, వేదార్థమ్ వేత్తి ఇతి వేదవిత్ – వేదములను, ఆ వేదముల అర్థమును తెలిసినవాడు వేదవిత్.

వేదాన్ విన్తే-విచారయతి ఇతి వేదవిత్ – వేదములనెరిగి, వానిని చక్కగా విచారించువాడు, అనుష్ఠించువాడు, బోధించువాడు (ప్రద్యుమ్న, వ్యాసాది రూపములలో)

ఏ విధమైన సంశయములు లేకుండ సంపూర్ణముగా వేదములనెఱిగిన జ్ఞానానందమయుడు ఆయన మాత్రమే. వేదముల సారమైన ధర్మమును సంపూర్ణముగా నెఱిగిన ధర్మమూర్తియును ఆయనే.

సర్వస్య చాహం హృది సన్నివిష్టో మత్తః స్మృతిర్ జ్ఞానమపోహనం చ
వేదైశ్చ సర్వైరహమేవ వేద్యో వేదాన్తకృద్వేదవిదేవ చాహమ్ – గీత 15.15

సమస్త ప్రాణులలో హృదయములలో అంతర్యామిగా ఉన్నవాడను నేనే. నా నుండియే స్మృతి, జ్ఞానము, అపోహనము (సందేహమును తొలగించుట) కలుగుచున్నవి. వేదముల ద్వారా తెలిసికొనదగిన వాడను నేనే. వేదాంత కర్తను, వేదజ్ఞుడను కూడా నేనే.

131. అవ్యంగః

ఏ విధమైన లోపములు లేనివాడు.

ఓం అవ్యంగాయ నమః

'వ్యంగము' అనగా లోపము. 'అవ్యంగము' అనగా లోపము లేకుండుట. 'వేదః', 'వేదవిత్' నామములు ఇప్పుడే చెప్పిన సందర్భములో ఈ 'అవ్యంగః' నామమునకు చెప్పిన అర్థము – ఆయన వేదమూర్తి. వేదవిదుడు. వేదవేద్యుడు. కనుక వేదములకు సంబంధించిన ఎలాంటి విషయంలోనైనా (ఛందస్సు, కల్పము వంటివి) ఆయన జ్ఞానమునకు ఎలాంటి కొదువ ఉండదు. **శిక్షా వ్యాకరణాద్యైః న హీనోఽవ్యంగ ఉచ్యతే** – శిక్షా వ్యాకరణము మొదలైన వేదాంగములలో ఏ విధమైన హీనత లేనివాడు. (తక్కువ కానివాడు.). కనుక ఆయన అవ్యంగుడు.
మరో విధంగా – ఆయన షడ్గుణైశ్వర్య పరిపూర్ణుడు. జ్ఞాన, బల, ఐశ్వర్య, వీర్య, శక్తి, తేజో సంపన్నుడు. కనుక శ్రీమహావిష్ణువునందు ఎలాంటి లోపములూ ఉండవు.

శ్రీ పెమ్మరాజు రాజారావు గారి రచన నుండి – జ్ఞానము చేత పరిపూర్ణుడైనాడు. 'వ్యంగ' అనగా ఆకారము. 'అవ్యంగుడు' అనగా ఆకారరహితుడు. 'అవ్యక్తోయం' అని గీతావాక్యము (2.25). ఇంద్రియముల చేత గాని, మనస్సు చేత గాని తెలియబడనివాడగుట చేత 'అవ్యంగః' అనబడును.

132. వేదాంగః

- వేదములే శరీరముగా కలిగనవాడు.
- శృతులు, స్మృతులు శరీరముగా కలిగినవాడు.

ఓం వేదాంగాయ నమః

పరబ్రహ్మమే వేదపురుషుడు. సకల జ్ఞానము ఆయన అవయవములు. **వేదాః అంగభూతాః యస్య స వేదాంగః** – ఎవరికైతే వేదములు శరీరమగునో ఆయనే వేదాంగుడు. **వేదాః సర్వాంగాణి** - వేదములన్నియు ఆయన అవయవములు అని కేనోపనిషత్తులో ఉన్నది.

శ్రీ రాధాకృష్ణశాస్త్రిగారు మహాభాగవతంనుండి రెండు ఆధారాలు చెప్పారు.

భాగవతము 3.13.34 – **త్రయీమ్ తనుమ్ స్వామ్ పరిధున్వతే నమః** – వేదములే శరీరముగా కలిగినవానికి నమస్కరించుచున్నాను.
భాగవతము 3.13.41 – **త్రయీమయమ్ రూపమిదం చ సౌకరమ్** – వేదస్వరూపుడైన శ్రీవరాహమూర్తి.

133. వేదవిత్

వేదముల నెఱుగుటయే గాక, వేదసారమైన ధర్మము నెఱిగినవాడు. వేదములను చక్కగా అనుష్ఠానము చేయువాడు.

ఓం వేదవిదే నమః

ఈ నామము ఇదే శ్లోకములో 130, 133వ నామములుగా రెండుమార్లు వస్తుంది -
వేదో వేదవిత్ అవ్యంగో వేదాంగో వేదవిత్ కవిః

వేదైర్వేద్యతయా వేదః తదర్థో ధర్మ ఉచ్యతే
తదనుష్ఠాపనాన్నిత్యం ప్రద్యుమ్నో వేదవిత్ స్మృతః
వేదములను తెలియుటయే గాక, వాని సారమైన ధర్మమును చక్కగా తెలిసికొని, ప్రద్యుమ్నమూర్తియై వైదిక ధర్మాన్ని తన శాసనములచేత, అనుష్ఠానము చేత నిత్యము విచారణ చేయువాడు.

134. కవిః

సామాన్య దృష్టి నధిగమించి, సునిశిత దర్శనము (సూక్ష్మదృష్టి) కలవాడు.

ఓం కవయే నమః

క్రాంత దర్శిత్వాత్ కవిః – కంటికి కనిపించని దానిని కూడ దర్శించువాడు కవి. సర్వజ్ఞమూర్తి. అట్టివారిలో ఉత్తముడు గనుక భగవానుడు ‘కవి’యని స్తవనీయుడు.

స ఏవ కాన దర్శిత్వాత్ కవిరిత్యుచ్యతే బుధైః – భక్తులకు మధురముగా కనిపించువాడు కవి.

గీత 8.9 – **కవిం పురాణమనుశాసితారమ్** – ఇక్కడ సచ్చిదానంద పరబ్రహ్మము ‘కవి’యని చెప్పబడెను.
గీత 10.37 – **కవీనా ముశనా కవిః** – సూక్ష్మబుద్ధి కలవారిలో నేను శుక్రాచార్యుడను.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.
(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

లోకాధ్యక్షః సురాధ్యక్షో ధర్మాధ్యక్షః కృతాకృత: |
చతురాత్మా చతుర్వ్యూహశ్చతుర్దంష్ట్రశ్చతుర్భుజః || (15)

135. లోకాధ్యక్షః

136. సురాధ్యక్షః

137. ధర్మాధ్యక్షః

లోకములకును, దేవతలకును, ధర్మమునకును ప్రభువు.

జగన్నాధుడు, దేవదేవుడు, ధర్మాధిపుడు.

ఓం లోకాధ్యక్షాయ నమ;

ఓం సురాధ్యక్షాయ నమః

ఓం ధర్మాధ్యక్షాయ నమః

అధ్యక్షుడనగా ప్రభువు, అధిపతి.

లోకములు – ధర్మమునాచరించవలసిన ప్రజలు.

సురులు – ధర్మమార్గమున ఆరాధింపబడు దేవతలు.

ధర్మము – పూజాది కార్యక్రమములకు సాధనము.

లోకానాం అధ్యక్షః లోకాధ్యక్షః

సురానాం అధ్యక్షః సురాధ్యక్షః

ధర్మస్త త్సాధనం తేషా మధ్యక్ష స్సాత్త్రినామవాన్

లోకాధ్యక్షః సురాధ్యక్షో ధర్మాధ్యక్ష ఇతి క్రమాత్

అనిరుద్ధ స్స విజ్ఞేయో లోకాధ్యక్షాది నామవాన్

భగవంతుడు అనిరుద్ధ స్వరూపమున ఈ మూడింటికిని అధిపతియై ధర్మాచరణమునకు అనుగుణముగా ఫలములను ప్రసాదించును. ధర్మము నాచరించు వారికి సత్ఫలితములు కలుగక మానవు. అధర్మపరులకు సత్ఫలితములు కలుగనేరవు. తనను ఆశ్రయించినవారికి ఉపాయము, ధర్మము, అన్నింటికీ పరమాత్మయే ప్రభువు.

ఈ మూడు పవిత్ర నామములను మరొక విధముగా కూడా వివరించారు.

లోకములు – ప్రజలు.

సురులు – ప్రజలను రక్షించు దేవతలు.

ధర్మము – రక్షణ కలుగజేయు సాధనము.

ఆ శ్రీహరియే ఈ మూడింటికిని అధినాధుడు. ఆయన ఆజ్ఞానువర్తులై సర్వమును ప్రవర్తించును. అట్లు కానియెడల వానిని నియంత్రించునది ఆ శ్రీమన్నారాయణుడే. సూర్యచంద్రుల గమనము, వర్షాది కాలభ్రమణము జీవుల ప్రయోజనము కొఱకు జరుగుచున్నవి. కాని గోకులవాసులపై కోపగించి వారిని బాధించుటకై ఇంద్రాది దేవతలు రాళ్ళ వర్షము కురిపించినపుడు ఆ చిన్ని కృష్ణుడు చిటికెన వ్రేలితో గోవర్ధన గిరినెత్తి దేవేంద్రునికి గర్వభంగము కావించాడు.

138. కృతాకృతః

- ఇహ, పరములు రెండింటను ఫలములు ప్రసాదించువాడు.
- సమస్తమునకు కార్యము, కారణము కూడనగువాడు.
- వ్యక్తావ్యక్త స్వరూపుడు.

ఓం కృతాకృతాయ నమః

ఇహలోకమున మనము కోరుకొను ధర్మాధర్మ కామములు, ఆయురారోగ్య ఐశ్వర్య సంతానములు, పూజా దానాది పుణ్య కార్యములు – వీటన్నింటిని (కృతములను) ప్రసాదించువాడు శ్రీమన్నారాయణుడు. తరగని సంపదలను (మోక్షములను) కూడ (అకృతములను) ప్రసాదించువాడును శ్రీమన్నారాయణుడే. కనుక ఆయన కృతాకృతుడు.

అనిత్య నిత్య ఫలదౌ ప్రవర్తక నివర్తకౌ

దదౌ యస్య స్వరూపం సః కృతాకృత ఇతీరితః

అనిత్యము (ఐహిక ఫలాన్ని ఇచ్చే ప్రవృత్తి ధర్మము - కృతము), నిత్యము (శాశ్వతమైన మోక్షఫలాన్నిచ్చే నివృత్తి ధర్మము - అకృతము) – ఈ రెండింటినీ తన స్వరూపంగా కలవాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – 'కృతము' అనగా కార్యరూపము, కనుపించునది, చేయబడునది. 'అకృతము' అనగా కారణరూపము, కార్యమునకు మూలము. కృతాకృతములకు – అనగా కార్య కారణములకు ఆధారము గనుక శ్రీమహావిష్ణువు కృతాకృతుడు.

'కృతము' అనగా వ్యక్తము, సృష్టింపబడినది, తెలియజేయబడినది. 'అకృతము' అనగా అవ్యక్తము, సృష్టింపబడనిది, తెలియరానిది. భగవానుడు కృత రూపమున, అనగా నిర్దిష్ట కార్య కాలమున, అవతరించి గోచరించును. ఆయనే అకృత రూపమున అవ్యక్తుడై, నిత్యుడై, అవాఙ్మానస గోచరుడై విలసిల్లును. కనుక శ్రీహరి కృతాకృతుడు.

139. చతురాత్మా

- సృష్టి, స్థితి, లయ కార్యములందు నాలుగేసి విభూతులతో నొప్పువాడు.
- నాలుగు విధములగు సాధనావస్థలకు ప్రభువు.

ఓం చతురాత్మనే నమః

ఈ నామము రెండుమార్లు స్తుతింపబడినది.

15వ శ్లోకము. 139వ నాము. చతురాత్మా – **చతురాత్మా చతుర్వ్యూహః చతుర్దంష్ట్రః చతుర్భుజః**

82వ శ్లోకము. 775వ నామము. చతురాత్మా – **చతురాత్మా చతుర్భావః చతుర్వేదవిదేకపాత్**

సాధన, ధ్యానాది కార్యములలో ఆత్మకు నాలుగు విధములైన అవస్థలు చెప్పబడినవి.

1. జాగ్రత్ అవస్థ – మెలకువగానుండుట – బాహ్యేంద్రియములు మాత్రము పనిచేయును.
2. స్వప్న అవస్థ – కలత నిదుర – మనసు పని చేయుచుండును.
3. సుషుప్తి అవస్థ – గాఢ నిద్ర – శ్వాస మాత్రము పనిచేయును.
4. తురీయ అవస్థ – శ్వాస కూడ నియంత్రించబడును.

ఈ నాలుగు పరిస్థితులలోను పరమాత్ముడే ఆత్మకు ప్రభువు గనుక ఆయన చతురాత్ముడు.

శ్రీ శంకరుల భాష్యము – ఒక్కొక్క కార్యమునందు భగవానుని గుణవైభవము నాలుగేసి విభూతుల రూపమున మూర్తీభవించును. అందుకు ఈ విష్ణుపురాణములోని శ్లోకము ప్రమాణము.

బ్రహ్మ దక్షాదయః కాలస్తథైవాऽఖిల జన్తవః

విభూతయో హరేరేతా జగతః సృష్టిహేతవః

విష్ణుర్మన్వాదయః కాలః సర్వభూతాని చ ద్విజ

స్థితేర్నిమిత్త భూతస్య విష్ణోరేతా విభూతయః

రుద్రః కాలోఽంతకాద్యాశ్చ సమస్తాశ్చైవ జన్తవః

చతుర్ధా ప్రళయాయైతా జనార్దన విభూతయః

జగదాదౌ తథా మధ్యే సృష్టిరా ప్రళయాద్ద్విజ

ధాత్రా మరీచి మిశ్రైశ్చ క్రియతే జంతుభిస్తథా

హరి **సృష్టి విభూతులు**	**విష్ణువు** **స్థితి విభూతులు**	**జనార్దనుడు** **లయ విభూతులు**
బ్రహ్మ	విష్ణువు	రుద్రుడు
దక్షుడు మొదలగు ప్రజాతులు	మనువు మొదలైనవారు	కాలము
కాలము	కాలము	యముడు
సమస్త జంతువులు (సర్వ భూతములు)	సర్వ భూతములు (సర్వ భూతములు)	సమస్త జంతువులు (సర్వ భూతములు)

140. చతుర్వ్యూహః

నాలుగు వ్యూహామూర్తులుగా – వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ రూపాలలో – విలసిల్లువాడు.

ఓం చతుర్వ్యూహాయ నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

15వ శ్లోకము. 140వ నామము. చతుర్వ్యూహః - **చతురాత్మా చతుర్వ్యూహః చతుర్దంష్ట్రః చతుర్భుజః**

82వ శ్లోకము. 773వ నామము. చతుర్వ్యూహః – **చతుర్మూర్తిః చతుర్బాహుః చతుర్వ్యూహః చతుర్గతిః**

వాసుదేవుడు, సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు – అనే నాలుగు వ్యూహా స్వరూపములు కలిగినవాడు. ఇందుకు ప్రమాణముగా శ్రీ శంకరులు చెప్పిన వ్యాసుని శ్లోకము.

వ్యూహాత్మనమ్ చతుర్ధావై వాసుదేవాది మూర్తిభిః

సృష్ట్యాదీన్ ప్రకారోత్యేష విశ్రుతాత్మా జనార్దన

విశృతాత్ముడైన జనార్ధనుడు వాసుదేవుడు మొదలుగాగల నాలుగు మూర్తులు కలిగి సృష్టివంటి కార్యములు నిర్వర్తించును. వ్యూహము అనగా ఒక ప్రయోజనము కొఱకు ఏర్పడిన ఆకారము. ఈ నాలుగు వ్యూహములు భగవంతుని వేర్వేరు కార్యములు ఆధారముగా విలసిల్లు స్వరూపములు.

1. **ప్రద్యుమ్నుడు:** సృష్టి కార్యమును నిర్వర్తించును. ఈ రూపము ఐశ్వర్య, వీర్య సంపన్నము. 'ప్ర-ద్యుమ్న' అనగా అమితముగా వీర్యము కలవాడని అర్థము. మనస్సునకు ప్రతీక.
2. **అనిరుద్ధుడు**: స్థితి కార్యమును నెరపు సంరక్షకుడు. ఈయన శక్తి, తేజస్సు గుణములు ప్రధానముగా కలవాడు. 'అ-నిరుద్ధ' అనగా ఆపజాలనివాడు. కనుక ఆయన రక్షణలోనున్నవారికి ఇంక భయము వలదు. అహంకారమునకు ప్రతీక.
3. **సంకర్షణుడు**: లయకార్యమును జరిపించువాడు. సమస్తమును ఆకర్షించి తనయందు లీనమొనర్చుకొనును. జ్ఞాన, బల గుణములు ప్రధాన లక్షణములు. జీవునకు ప్రతీక.
4. **వాసుదేవుడు**: పరమాత్ముడు. షడ్గుణ పరిపూర్ణుడు. అనగా జ్ఞానము, బలము, ఐశ్వర్యము, వీర్యము, శక్తి, తేజస్సు అను ఆరు గుణములు అవధులు లేకుండ కలిగినవాడు. సమస్తమునకును ఆధారము. సర్వత్ర వ్యాపించినవాడు. అనంత కాంతిమయుడు.

నమస్తే వాసుదేవాయ నమః సంకర్షణాయచ
ప్రద్యుమ్నాయ అనిరుద్ధాయ చ సాత్వతాం పతయే నమః

141. చతుర్ద్రంష్ట్రః

నాలుగు కోరలు (పన్నులు) కలిగినవాడు. శ్రీ నృసింహమూర్తి.

ఓం చతుర్ద్రంష్ట్రాయ నమః

దంష్ట్రములు అనగా దృఢమైన కోరలు. భక్తులకు అభయము నొసగి, కోర్కెలు దీర్చు శ్రీ లక్ష్మీనృసింహమూర్తిని కీర్తించు దివ్యనామమిది.

చతుర్ద్రంష్ట్రత్వము మహాపురుష లక్షణము అని చెబుతూ శ్రీ భట్టులు వాల్మీకి రామాయణం సుందరకాండ నుండి ఉదాహరించారు. హనుమంతుడు సీతమ్మ వారికి శ్రీరామచంద్రుని రూపమును వర్ణిస్తూ – **చతుర్దశ సమద్వంద్వః చతుర్ద్రంష్ట్రః చతుర్గతిః** – అని చెప్పాడు. అనగా ఆ సుందరాంగుడు (శ్రీరాముడు) పదునాల్గు జతల అవయవములు (కనుబొమలు, నాసికాపుటములు, నేత్రములు, చెవులు, స్తనాగ్రములు, మోచేతులు, మణికట్టులు, మోకాళ్ళు, ముష్కములు, పిఱుదులు, చేతులు, పాదములు, పిఱుదులపై ఎత్తైన కండరములు) సమప్రమాణములో కలవాడు (ఇవి రాజ లక్షణములు). నాలుగు చక్కనైన దంష్ట్రలు(సూదివలె మొనదేలిన

దంతములు - రెండు పలు వరుసలలో మధ్యగల నాలుగు దంతములకు ప్రక్కన ఉన్న నాలుగు పన్నులకు 'దంష్ట్రలు' అనే పేరు ప్రసిద్ధము.) కలవాడు. (ఏనుగు, పులి, సింహము, ఎద్దు అనే) నాలుగు జంతువుల నడకలోని అందమును పుణికిపుచ్చుకొన్నవాడు.

142. చతుర్భుజః

నాలుగు బాహువులతోనొప్పువాడు. శంఖ చక్ర గదా పద్మ ధారి.

ఓం చతుర్భుజాయ నమః

శ్రీ మహావిష్ణువు శంఖము, చక్రము, గద, పద్మములతో విలసిల్లు సుందర చిత్రము భక్తులకు సుపరిచితము. ధర్మ రక్షణార్థమై ఈ నాలుగు సాధనములను ఉపయోగించు విధమును శ్రీ చిన్మయానంద చక్కగా వర్ణించారు – దుష్కార్యములు వదలి, సచ్చిదానంద పరబ్రహ్మమగు విష్ణుపద మార్గమున పయనించమని ప్రణవ నాద భరితమైన శంఖము మనలను ఉద్బోధించును. అలా చేయనివారిని దుష్టశిక్షణాయత్తమగు గద దండించును. జీవితమున తారసపడు దుఃఖములే ఈ శిక్షణా సాధనములు. అయినను సన్మార్గమునకు మరలని వారిని కాలరూపియగు చక్రము పరిసమాప్తమొందించును. ఈ విధమైన పిలుపు, శిక్ష, అంతము ఎందుకు? పరమ పదమునకు చేర్చుటకే. ఆ పరమపదమునకు సంకేతము పద్మము.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – శ్రీమన్నారాయణుని నాలుగు భుజములును ధర్మార్థకామమోక్షములను నాలుగు పురుషార్థములను సూచించును. అన్నింటికిని నెలవు కొండలలో కొలువైన దేవదేవుడే.

గోపాలోత్తర తామిని.55 – **సత్వ రజస్తమ ఇతి అహంకారశ్చతుర్భుజః** – సత్వము, రజస్సు, తమస్సు, అహంకారము అనే నాలుగు గుణములును నాలుగు భుజములు.

మరొక వివరణ – పద్మము చిత్తమును, శంఖము మనస్సును, గద అహంకారమును, చక్రము బుద్ధిని సూచించును.

సశంఖ చక్రమ్ స కిరీట కుండలమ్
స పీత వస్త్రమ్ సరసీరుహేక్షణమ్
స హార వక్ష స్థల శోభి కౌస్తుభమ్
నమామి విష్ణుమ్ శిరసా చతుర్భుజమ్

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

భ్రాజిష్ణుర్భోజనం భోక్తా సహిష్ణుర్జగదాదిజః |
అనఘో విజయో జేతా విశ్వయోనిః పునర్వసుః || (16)

143. భ్రాజిష్ణుః

స్వయంప్రకాశ స్వరూపుడు. తేజోమయుడు. భక్తులకు కనుపించువాడు.

ఓం భ్రాజిష్ణవే నమః

భ్రాజత ఇతి తచ్ఛీలో భ్రాజిష్ణుః – ప్రకాశించుట అను గుణము కలవాడు 'భ్రాజిష్ణుః'. 'భ్రాజృ' అనే ధాతువునుండి, పాణిని సూత్రము 3.2.138 ప్రకారము, అనగా 'ఇష్ణుచ్' ప్రత్యయము చేర్చినపుడు 'ఆ విధమైన గుణాదికము కలిగియుండుట' అనే అర్థం వస్తుంది. కనుక భ్రాజృ + ఇష్ణు = భ్రాజిష్ణు అవుతుంది. తేజేమయుడైన శ్రీమన్నారాయణుడు తన భక్తులకు దర్శనము ఇచ్చువాడని శ్రీ భట్టులు వివరించారు.

ఉపాసితృభ్యో భ్రాజిష్ణుః స్వప్రకాశన శీలతః – తనను ఉపాసన చేసే భక్తులు జ్ఞానదీపికలతో ప్రకాశించాలనే కోరికతో తాను ప్రకాశించువాడు.

శ్రీ విష్ణు సహస్ర నామమునకు సంస్కృతములో విపులమైన వ్యాఖ్యానము వ్రాసిన శ్రీ సత్యదేవో వాసిష్ఠ గారి సూచన – సూర్య చంద్రాదులలోని తేజస్సు వారి స్వంతం కాదు. శ్రీమహావిష్ణువు యొక్క ప్రకాశము వల్లనే వారు వెలుగు వెదజల్ల గలుగుచున్నారు.

గీత 13.17 – **జ్యోతిషామపి తజ్జ్యోతిః** – ఆ పరబ్రహ్మము అన్ని జ్యోతులకును జ్యోతి. పరంజ్యోతి.

యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽఖిలమ్

యచ్చన్ద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకమ్ - గీత 15.12

సమస్త జగత్తును ప్రకాశింపజేయు సూర్యుని తేజస్సు, అటులనే చంద్రుని తేజస్సు, అగ్ని తేజస్సును నా తేజస్సేయని ఎఱుంగుము

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – బయటినుండి వచ్చిన కాంతి వస్తువులపై పడుటవలన మనకు వస్తువులు కనిపించును. వస్తువులనుండి పరావర్తనము చెందినందువలన మనకు కాంతి కనిపించిన అనుభూతి కలుగును. కాని భగవానుడు స్వయంప్రకాశమానుడు. అయనకు వేరు వస్తుసముదాయముతో పని లేదు. అందువలన భక్తులు కానివారు ఆయనను కనుగొనలేరు. భక్తులకు మాత్రము ఆయన స్వయముగా దర్శనమిచ్చును.

ఈ నామమునకు ప్రమాణముల్లైన యజుర్వేద వాక్కులు.

బ్రహ్మ సూర్య సమం జ్యోతిః

సూర్యో జ్యోతిః – జ్యోతిః సూర్యః

144. భోజనమ్

భక్తులకు ఆనందానుభుతిని ఒసగువాడు. సచ్చిదానంద స్వరూపుడు.

ఓం భోజనాయ నమః

తం భుజ్యతే, సుఖేన అనుభూయతే ఇతి భోజనమ్ – శ్రీహరిని పూజించుట, సేవించుట, కీర్తించుట, స్మరించుట మొదలగు కార్యములు భక్తులకు పరమానందమును కలుగజేయును. ఇలా భగవంతుడే భక్తులకు ఆనంద కారణము, సాధనము అగును.

భోజనము అనగా తినే ఆహార పదార్థము అని అందరికీ తెలిసిన అర్థము. వేదాంత పరముగా అన్ని ఇంద్రియముల ద్వారాను గ్రహించి, అనుభవించు వస్తువులను అన్నింటిని 'భోజనము' అని చెబుతారు. ఆహారము వలెనే ఇవన్నీ జీవనమునకు ఆధారము. వాటిని అనుభవించుటలో ఆనందము లభిస్తుంది. (ఆకొన్న కూడె అమృతము.)

ఈ విధముగా అయన మన నిత్యావసర పదార్థములను అనుభవించుటలో ఆనందమును లభింపజేయును. అంతే గాక, ఐహిక వాంఛలను త్యజించి, ముక్తి మార్గమున సాధన చేయు భక్తులకు స్వయముగా శ్రీలక్ష్మీనారాయణుడే ఆనందము. పరమానందము. (ఆనందో బ్రహ్మ).

145. భోక్తా

- భుజించువాడు.

- ఆనందించువాడు. భక్తితో ఒసగిన కానుకలు స్వీకరించి సంతుష్టుడగును. యజ్ఞములో అర్పించిన దానిని గ్రహించువాడు.

ఓం భోక్త్రే నమః

ఈ నామము మూడుమార్లు వచ్చును.

16వ శ్లోకము. 145వ నామము. భోక్తా – **భ్రాజిష్ణుః భోజనం భోక్తా సహిష్ణుః జగదాదిజః**

53వ శ్లోకము. 502వ నామము. భోక్తా – **శరీరభూతభృత్ భోక్తా కపీంద్రో భూరిదక్షిణః**

95వ శ్లోకము. 888వ నామము. భోక్తా – **అనన్తో హుతభుక్ భోక్తా సుఖదః నైకదోగ్రజః**

భక్తులకు ఆనందము కలుగజేయుటయే కాదు. భక్తులొసగినవానిని అమృతమువలె స్వీకరించి ఆ పరమాత్ముడు సంతోషించును.

పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి
తదహం భక్త్యుపహృతశ్నామి ప్రయతాత్మనః – గీత 9.16

నిర్మల బుద్ధితో, నిష్కామ భావముతో పరమభక్తునిచే సమర్పింపబడిన పత్రమును గాని, ఫలమును గాని, జలమును గాని నేను ప్రత్యక్షముగా (స్వయముగా) ప్రీతితో ఆరగింతును.

ఏ యజ్ఞము చేసినా, ఏ దేవునికి నివేదన చేసినా, అన్ని అర్పణములు వేంకటరమణునే చేరును. హరి యవతారములే అన్ని దేవతలు. హరి నామములే అన్ని మంత్రములు. కనుక ఆయన భోక్తయగును.

అహం హి సర్వయజ్ఞానాం భోక్తా ప్రభురేవ చ - గీత 9.24 – సకల యజ్ఞములకును భోక్తను, స్వామిని కూడ నేనే.

మనకు ఆనందము కలుగజేయువాడు ఆయనే. మనము నివేదించిన దానిని స్వీకరించి ఆనందించువాడు ఆయనే. అంతా కృష్ణార్పణము.

యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసియత్
యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్ – గీత 9.27

ఓ కౌంతేయ! నీవు ఆచరించు కర్మలను, భుజించెడి ఆహారమును, హోమము చేయు హవ్యమును, అర్పించు దానమును, ఆచరించు తపస్సును నాకే సమర్పించుము.

146. సహిష్ణుః

- క్షమించి, అనుగ్రహించు కరుణామయుడు.

- ఓర్పు కలిగి, భరించు సర్వసాక్షి, సహనమూర్తి.

- దుష్టులను సంహరించు వాడు.

ఓం సహిష్ణవే నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

16వ శ్లోకము. 146వ నామము. సహిష్ణుః – **భ్రాజిష్ణుః భోజనం భోక్తా సహిష్ణుః జగదాదిజః**

60వ శ్లోకము. 570వ నామము. సహిష్ణుః – **ఆదిత్యో జ్యోతిరాదిత్యః సహిష్ణుః గతిసత్తమః**

'సహ్' అనే ధాతువునకు మన్నించుట, క్షమించుట అని అర్థము. 'భ్రాజిష్ణు' నామ వివరణలో చెప్పినట్లుగానే, 'ఇష్ణుచ్' ప్రత్యయము చేర్చినపుడు 'గుణము కలిగి యుండుట' అనే భావం వస్తుంది. 'సహిష్ణు' అనగా క్షమాగుణమూర్తి. మన మొనర్చే లెక్కకు మిక్కిలి తప్పిదములను క్షమించి, నామస్మరణ పూజాది తరణోపాయములను ప్రసాదించి, ఇహపర భాగ్యములను కలుగజేయు పరమాప్తుడే ఆ పురుషోత్తముడు.

'సహ్' అనగా 'ఓర్పుతో సహించుట' అని కూడా అర్థము. శ్రీహరి విశ్వాత్మకుడై, అంతరాత్మయై, అందరికిని సాక్షియైనవాడు. లోక భారమును వహించువాడు. ఎన్ని అపరాధములు జరిగినా జగన్నాధుడు సహించుచూ, సకల భువనములను భరించుచుండును. **నా క్షతప్యతే భూరిభారః** – అని ఋగ్వేద మంత్రము. ఈ కొండయే కాదు. బ్రహ్మాండములు పైబడ్డను నా వ్రేలు చలించదు అని బాలగోపాలుడు గోవర్ధన గిరిధారియై అభయమిచ్చెను.

'సహతే' అనగా 'జయించుట' అనే అర్థంలో శ్రీ శంకరులు వ్యాఖ్యానించారు. హిరణ్యాక్షాది దుష్ట రాక్షసులను సంహరించినందున శ్రీ వరాహమూర్తిని సహిష్ణు అని కీర్తించనగును.

శ్రీ భట్టుల వ్యాఖ్యానము ప్రకారము, 1వ నామము 'విశ్వమ్' నుండి, 146వ నామము 'సహిష్ణుః' వరకు భగవంతుని వ్యూహస్వరూపములను కీర్తించును.

1-122 నామములు: పరవాసుదేవమూర్తి స్వరూపమునకు చెందినవి.

123-124 నామములు: సంకర్షణమూర్తి స్వరూపమునకు చెందినవి.

125 - ? నామములు: ప్రద్యుమ్నమూర్తి స్వరూపమునకు చెందినవి.

? – 146 నామములు: అనిరుద్ధమూర్తి స్వరూపమునకు చెందినవి.

ఇంక భగవంతుని 'విభవ' స్వరూపముల గుణకీర్తనము ఆరంభమవుతున్నది. వీనిలో ముందుగా 'విష్ణు' విభవ స్వరూపమును సూచించు పుణ్యనామములు 147వ నామముతో ఆరంభమగును.

147. జగదాదిజః

జగములన్నింటికంటెను ముందున్నవాడు. **జగత్-ఆది-జాతః**

ఓం జగదాదిజాయ నమః

జగత్సృష్టికి పూర్వము ఆ సృష్టి చేయగలిగినవాడు ఉండవలయును. అట్టి సృష్టికర్త శ్రీమహావిష్ణువే. ఆయనే బ్రహ్మను కన్న తండ్రి.

జగతామాది భూతాసు మూర్తి ష్వన్యత మత్వతః

జాతత్వాద్విష్ణు రూపేణ ప్రోచ్యతే జగదాదిజః

జగత్తులో సర్వభూతములకు ఆదియందు విష్ణుమూర్తిగా అవతరించినవాడు జగదాదిజుడు.

శ్రీ చిన్మయానంద – ప్రళయానంతరము, సృష్టి ఆరంభమునకు పూర్వము హిరణ్యగర్భమూర్తియైన శ్రీమహావిష్ణువు జగదాదిజుడు. ఆయన విరాట్ ఆత్మ స్వరూపము.

దేవతలకు విష్ణువే పూర్వజుడనుటకు ప్రమాణము మహాభారతము ఉద్యోగపర్వము 12.11లో ఉన్నది.

గతిశ్చ నస్త్వమ్ పూర్వజో జగతః ప్రభుః

రక్షార్థమ్ సర్వ భూతానామ్ విష్ణుస్త్వమ్ ఉపజగ్మివాన్

నీవే మాకు గతి (శరణు). నీవే సకల దేవతలకు ముందుగా నున్నట్టివాడవు. నీవే జగములన్నింటికిని ప్రభువు. సర్వభూతముల రక్షణకై విష్ణురూపమును ధరించినవాడవు.

148. అనఘః

పాప రహితుడు. కల్మషము లేనివాడు. – **పాపమ్ న విద్యతే అస్మిన్ ఇతి అనఘః**

ఓం అనఘాయ నమః

16వ శ్లోకము. 148వ నామము. అనఘః - **అనఘో విజయో జేతా విశ్వయోనిః పునర్వసుః**

89వ శ్లోకము. 835వ నామము. అనఘః – **అమూర్తిః అనఘోఽచింత్యో భయకృత్ భయనాశనః**

విష్ణువు సంసార మధ్యమున అవతరించినా గాని, ఆయనకు పాపములు అంటవు. కర్మలు ఆయనను బంధించవు. ఇందుకు శృతులలో అనేకప్రమాణములు ఉన్నాయి.

శుద్ధమ్ అపాప విద్ధమ్ – యజుర్వేదము 40.8

న పుణ్య పాపే మమ – కైవల్యోపనిషత్తు 22

149. విజయః

జయించుటయే స్వభావముగా గలవాడు.

ఓం విజయాయ నమః

వివిధమ్ విశేషేణ వా జయతి ఇతి విజయః – ఇలా అలా అనీ, ఇక్కడ అక్కడ అనీ, ఇప్పుడూ అప్పుడూ అనీ కాక అన్నింటి (అందరి)పైనా, అన్ని విధములుగానూ, అన్ని చోట్లా శ్రీమహావిష్ణువు విజయము పొందును. ఆయన సత్, చిత్, ఆనంద స్వరూపుడు. ప్రకృతి, జీవులు ఆయనకు అధీనమై యుండును. ఆయన జ్ఞాన, వైరాగ్య, ఐశ్వర్యాదులు అపరిమితములు, అసమానములు. కనుక జయించుట ఆయనకు స్వభావ సిద్ధము. వేరు విధముగా కానేరదు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – జగత్తులో జరిగేదంతా విష్ణువు అధీనములో ఉంటుంది. బ్రహ్మ చేసే సృష్టి, రుద్రుని లయ కార్యము కూడా ఆయన ఇచ్ఛానుసారమే జరుగుతాయి. **తదాऽదర్శిత పంథానౌ సృష్టి సంహార కారకౌ** (మహాభారతము. మోక్షపర్వము.169.9). కనుక ఆయన విజయుడు.

డా. క్రోవి పార్థ సారధి రచననుండి – బ్రహ్మ, రుద్రుడు, ఇంద్రుడు మొదలైన సమస్త దేవతల విజయానికి కారణమైనాడు. దేవతలందరూ తమ తమ పనులందు విజయము సాధించడానికి కారణము గనుక ఆయన విజయుడు.

150. జేతా

జయించువాడు.

ఓం జేత్రే నమః

సర్వమ్ జగత్ జయతి ఇతి జేతా – జయించు స్వభావము కలాడు గనుక ఆయన జేతయే అగును. ఆయన ఇచ్ఛ కానిది ఏదియును జరుగదు. ఆయన సత్య సంకల్పుడు, సత్యకామి, సత్య స్వరూపుడు. సత్యమే జయించును గనుక ఆ సచ్చిదానందమూర్తి జేత, విజేత. అన్యదేవతలు అందరు ఆయన ఇచ్ఛానుసారమే వర్తిస్తారు.

డా. క్రోవి పార్థ సారధి రచననుండి – **స్వాభిప్రాయే స్థాపయితా ఔతాస్యాద్విధి శంకరౌ** –బ్రహ్మ, రుద్రుడు, మొదలైన వారిని తన ఇష్టానుసారముగ స్థిరముగ ఉంచువాడు జేత.

151. విశ్వయోనిః

- విశ్వమునకు జన్మ స్థానము, కారణము.
- విశ్వమే కారణముగా కలవాడు.

ఓం విశ్వయోనయే నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

13వ శ్లోకములో 118వ నామము. విశ్వయోనిః – **రుద్రో బహుశిరా బభ్రుః విశ్వయోనిః శుచిశ్రవాః**

16వ శ్లోకములో 151వ నామము. విశ్వయోనిః – **అనఘో విజయో జేతా విశ్వయోనిః పునర్వసుః**

విశ్వం తత్కార్య వర్గస్స్యాత్ యోనిస్తస్య తు కారణమ్
తస్య బ్రహ్మాది ముఖతః విశ్వయోని రితీరితః
విశ్వము అంటే శ్రీమన్నారాయణుని చేత నిర్మింపబడిన సంసారము. యోని అనగా ఆ సంసారమునకు కారణమైనది. అంటే సకల చరాచర జగత్తునకు కారణభూతమైనవాడు విశ్వయోని.

విశ్వస్య సకలస్య యోనిః కారణమ్ విశ్వయోనిః – సకల విశ్వమునకు జన్మ స్థానము, కారణము గనుక ఆయన విశ్వయోని.

మరొక భావము – శ్రీమహావిష్ణువునకు, ఆయన అవతార వైభవమునకు విశ్వము కారణము. లోకములందున్న పరిస్థితుల కారణంగానే ఆయన వివిధ రూపములలో అవతరించుచుండును. ధర్మమును రక్షించును. కనుక ఆయనకు విశ్వము కారణమని చెప్పవచ్చును.

152. పునర్వసుః

- తన సృష్టియందు అంతట, సకల దైవములందును అంతరాత్మయై, మరల మరల విలసిల్లువాడు.
- ప్రళయానంతరము మరల సృష్టి కావించువాడు.

ఓం పునర్వసవే నమః

బ్రహ్మాదిష్వపి దేవేషు అంతరాత్మతయా చ యః
పునర్వసనా న్నిత్యం పునర్వసురుదాహృతః
బ్రహ్మాది దేవతలను, సకల భూతాలను పుట్టించడమే కాక, వారిలో మళ్ళీ అంతరాత్మగా ఉన్నవాడు శ్రీహరియే గనుక ఆయన 'పునర్వసుః'. హరి నామములే అఖిల మంత్రములు. హరియవతారములే అఖిల దైవములు. హరియే విశ్వాంతరాత్ముడు. అన్ని పూజలు శ్రీహరికే చెందును.

ఇంద్రుడు రుద్రునితో ఇలా అన్నాడు – **తవాంతరాత్మా మమ చ యే చాऽన్యే దేహి సంజ్ఞితః** (మహా భారతము. మోక్షపర్వము. 179.4) – నీకును, నాకును, ముక్తులైనవారందరకును ఆయనే అంతరాత్మ.

మరొక వివరణ – ప్రతి ప్రళయము తరువాతను మరల పూర్వమువలెనే సూర్య చంద్రులను, భూమిని, సకల భూతములను సృష్టించును. కనుక ఆయన పునర్వసువు.

సూర్య చంద్రాంసౌ ధాతా యథా పూర్వమ్ అకల్పయాత్

దివమ్ చ పృథ్వీమ్ చాऽంతరిక్షమ్ అథోస్వః – ఋగ్వేదము. 10.190.3

కరారవిందేన పదారవిందమ్

ముఖారవిందే వినివేశయంతమ్

వటస్య పత్రస్య పుటేన యానమ్

బాలం ముకుందమ్ మనసా స్మరామి.

---

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

ఉపేంద్రో వామనః ప్రాంశురమోఘః శుచిరూర్జితః |

అతీంద్రః సంగ్రహః సర్గో ధృతాత్మా నియమో యమః || (17)

153. ఉపేంద్రః

- ఇంద్రునికి తమ్ముడై అవతరించినవాడు.
- ఇంద్రునిపైన ఇంద్రుడు (ఇంద్రునకు అధిపతి)

ఓం ఉపేంద్రాయ నమః

ఉపగతః ఇంద్రమ్ ఉపేంద్రః – వామనావతారమున శ్రీమహావిష్ణువు అదితి గర్భమున జన్మించెను. ఇంద్రుని తల్లి అదితి గనుక వామనుడు ఇంద్రునకు తమ్ముడగును.

శుక్రాచార్యుల ఆదేశము ప్రకారము ప్రహ్లాదుని మనుమడైన బలి తపోయజ్ఞములను ఆచరించి ఇంద్రుని జయించెను. ఇంద్రుని తల్లి అదితి తన బిడ్డ (ఇంద్రుని) క్షేమం కొరకు భగవంతుని ప్రార్థించినది. యజ్ఞయాగాదుల ద్వారా ప్రాభవమును సాధించిన బలిని ఓడించడం వీలుకాదు. కనుక భగవానుడు అదితి గర్భమున జన్మిచి, యాగశాలలో బలిని యాచించి, మూడడుగుల నేల గైకొని, రెండడుగులో బ్రహ్మాండముల నతిక్రమించి, మూడవ అడుగును బలి తలపై మోపి, పాతాళమున బంధించివేసెను.

జఘన్యజస్సర్వేషాం ఆదిత్యానాం గుణాధికః
ద్వాదశేవాదితేః పుత్రాః శక్రముఖ్యాః నరాధిపః
తేషామవరజోవిష్ణుః యత్ లోకాః ప్రతిష్ఠితాః

రాజా! అదితి పుత్రులలో చివరివాడు కాని గుణములలో పెద్దవాడు, సకల లోకపాలకుడు శ్రీమహావిష్ణువేనయ్యా!

ఇంద్రస్య ఉపరి ఇంద్రః – ఇంద్రునిపైన ఉన్నవాడు ఉపేంద్రుడు. ఇక్కడ 'ఉప' అనగా 'పైన, అధిక' అనే అర్థాలు వర్తిస్తాయి. ఇంద్రుని కాచే ప్రభువు, ఇంద్రునికి శక్తినొసగే ఈశ్వరుడు శ్రీమహావిష్ణువే. ఇంద్రుడు గోపాలురపై అలిగి వారిని శిక్షించాలని యత్నించగా ఆ శ్రీహరి నందగోపబాలుడై గోవర్ధనగిరినెత్తి, గోపకులమును రక్షించి, ఇంద్రుని గర్వమును అణగించెను.

శ్రీ పెమ్మరాజు రాజారావు గారి రచన నుండి – ఓ కృష్ణా! నీవు గోవులకు ఈశ్వరుండవగుట చేత 'ఇంద్రుడవు'గా విలసిల్లితివి. ఈ కారణము చేత దేవతలు నిన్ను 'ఉపేంద్ర' అని పిలుతురు. – అని హరివంశము (76.47)నందు వర్ణింపబడెను.

మమోపరి యధేంద్రస్త్వం స్థాపితో గోభిరీశ్వరః
ఉపేంద్ర ఇతి కృష్ణ! త్వాం గాస్యంతి భువిదేవతా
డా. క్రోవి పార్థసారధి గారి రచన నుండి – కృష్ణా! నేను ఏవిధముగా ఇంద్రుడనో, అలాగే నీవు నాకు పైగా, ఇంద్రుడుగా, ఈశ్వరుడుగా, స్వామిగా, గోవులచేత నిలుపబడ్డావు. అందుచేత నిన్ను భూలోకములో మానవులు, స్వర్గములో దేవతలు కూడా 'ఉపేంద్రుడు' అని అంటారు.

154. వామనః

- పొట్టివానిగా అవతరించినవాడు.
- చక్కనైన, కనులకింపైన రూపము గలవాడు.

ఓం వామనాయ నమః

శ్రీమహావిష్ణువు తన ఐదవ అవతారంలో వామనుడై బలిచక్రవర్తిని యాచించి, త్రివిక్రముడై ముల్లోకములను ఆక్రమించెను.

వామయతి త్యాజయతి మదమ్ బలిమ్ – 'వామ్' అనగా త్యజించుట, వెళ్ళగ్రక్కుట. ఇలా చూచినట్లయితే బలిచక్రవర్తి చేత గర్వమును, వైభవమును, రాజ్యమును బయటకు క్రక్కించినవాడు వామనుడు.

శ్రీ లింగాయత సూరి – **వామో వాల్గుత్వమ్ అస్య అస్తి ఇతి వామనః** – సుందరమైన పొట్టి ఆకారము కలిగినవాడు వామనుడు. మరో విధముగా – **వామో వటుత్వమ్ అస్య అస్తి ఇతి వామనః** – పొట్టియైన వడుగు (గురుకుల విద్యార్థి) స్వరూపమును ధరించినవాడు వామనుడు.

వామనావతారము – నేపాల్ కు చెందిన చిత్రము (వికీపీడియానుండి)

వామనుని రూపసౌందర్యము వర్ణన శ్రీమద్భాగవతము (8.18.26)లో చక్కగా ఉన్నది.

యజమానః ప్రముదితో దర్శనీయ మనోరమమ్

రూపానురూపావయవమ్ తస్మాఽసనమాహరాత్

మరొక వివరణ – **సర్వాణి వామాని నయతి ఇతి వామనః** – భక్తుల సకల కామితార్థములను ప్రసాదించువాడు వామనుడు. తన స్వయంప్రకాశ దివ్యస్వరూప దర్శనమును అనుగ్రహించి, వారి హృదయములను ఆనందింపజేయువాడు. **ఏషా సర్వే వామనీః ఏష హి సర్వాణి వామాని నయతి** (ఛాందోగ్యోపనిషత్తు 4.25)

ద్రష్టూన్ స్వకాన్త్యా వామాని సుఖాని నయతీతి యః స వామనో. తనను సేవించేవారికి తన దివ్యకాంతులతో సుఖములను ఇచ్చేవాడు వామనుడు.

మధ్యే వామనమాసీనం విశ్వే దేవా ఉపాసతే (కఠోపనిషత్తు 3.5). హృదయ కమలము మధ్యభాగమున విలసిల్లుతున్న వామనుని సకల దేవతలును ఉపాసించుచున్నారు.

155. ప్రాంశుః

ఎంతో ఎత్తైన, ఉన్నతమైన, విస్తారమైన దేహము గలవాడు.

ఓం ప్రాంశవే నమః

ప్రాశున్నతే ప్రకర్షేణ ఊర్ధ్వమ్ ఇతి ప్రాంశుః – బలి చక్రవర్తి మూడడుగులు దానమిచ్చుటకై జలమును ధారగా పోయగానే వామనుడు ఇంతింతై, తానింతై, భూనభోంతరాళములను అతిక్రమించుచూ, త్రివిక్రముడై బ్రహ్మాండాంత సంవర్ధియయ్యెను. అప్పుడు ఆయన శరీరంలో సకలదేవతలు కనిపించారు. భూమియే ఆయన పాదపీఠమయ్యెను. ఆకాశము శిరస్సుగా నయ్యెను. సూర్యచంద్రులు కన్నులాయెను.

తోయోతుపతితే హస్తే వామనోఽభూదవామనః

సర్వదేవమయం రూపం దర్శయామాసవై ప్రభుః

భూపాదః ద్యౌః శిరశ్చాస్య చంద్రాదిత్యా చ చక్షుషీ

వామనుడు త్రివిక్రముడైన సుందర, మంగళ రూపమును హరివంశము (31.89)లో మనోహరముగా వర్ణించినారు. వ్యాఖ్యానకర్తలు ఈ ప్రమాణమును తరచుగా ఉదహరించారు.

తస్య విక్రమతో భూమిమ్ చంద్రాదిత్యౌ స్థానాంతరే

నభః ప్రక్రమాణస్య నాభిదేశే వ్యవస్థితౌ

సూర్యచంద్రులు ముందు కన్నులగానయ్యెను. తరువాత ఉదర సమము, తరువాత నాభివద్ద, తరువాత మోకాళ్ళవద్ద గోచరించెను.

ఈ విషయంలో పోతన భాగవతంలోని వర్ణన తెలుగువారికి సుపరిచితము..

ఇంతింతై వటుడింతయై మరియు తానింతై నభో వీధి పై

నంతై తోయద మండలాగ్రమున కల్లంతై ప్రభారాశి పై

నంతై చంద్రుని కంతయై ధ్రువుని పై నంతై మహర్వాటిపై

నంతై సత్య పదోన్నతుండగుచు బ్రహ్మాండాంత సంవర్ధి యై.

రవి బింబంబుపమింప పాత్రమగు ఛత్రంబై శిరో రత్నమై

శ్రవణాలంకృతియై గళాభరణమై సౌవర్ణకేయూరమై

ఛవిమత్కంకణమై కటిస్థలి నుదంచత్ ఘంటయై నూపుర

ప్రవరంబై పదపీఠ మై వటుడు తా బ్రహ్మాండమున్ నిండుచోన్.

156. అమోఘః

ఆయన ప్రతికార్యము విశేషించి కారణయుక్తము. వ్యర్థము కాదు. పరమార్థము ఉన్నది.

ఓం అమోఘాయ నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

12వ శ్లోకము. 111వ నామము. అమోఘః – **అమోఘః పుండరీకాక్షో వృషకర్మా వృషాకృతిః**

17వ శ్లోకము. 156వ నామము. అమోఘః – **ఉపేంద్రో వామనః ప్రాంశుః అమోఘః శుచిరూర్జితః**

మోఘము అనగా వ్యర్థము. (మోఘమ్ నిరర్థకమ్ – అమరకోశము). అమోఘము అనగా వ్యర్థము కానిది. అర్థవంతమైనది. విశేషించి ఫలించునది.

111వ నామము. అమోఘః – భక్తులకు నిశ్చయముగా సత్ఫలములు ప్రసాదించువాడు.

156వ నామము. అమోఘః – ఆయన చేసే ప్రతిపనికి ఏదో పరమార్థముండును.

శ్రీ భట్టులు వామనావతారపరంగా తమ వ్యాఖ్యను కొనసాగించారు - **న మోఘమ్ చేష్టితమ్ యస్య సః అమోఘః.** ఆయన కార్యము ఏదీ వ్యర్థము కాదు.

బలేశ్చ వాసవస్యాపి కృతార్థీ కరణాత్వమమ్
మానాతీత ప్రభావత్వా దమోఘః పరికీర్తితః

బద్ధ శత్రువులైన బలిచక్రవర్తి, మరియు దేవేంద్రుల కోరికలను ఒకేసారి తీర్చాడు కాబట్టి అమోఘమైన మహిమ కలవాడు అని చెప్పబడుచున్నవాడు. శ్రీమహావిష్ణువు వామనుడై బలిని యాచించి, రెండడుగులతో బ్రహ్మాండమును కొలిచినందున ఇంద్రునకు తిరిగి రాజ్యము లభించెను. మూడవ అడుగు బలి తలపై మోపి, పాతాళమునకు త్రొక్కివేసినందువలన, బలికి మహాభక్తుడనే గౌరవము లభించెను. యజ్ఞములో బలి సమర్పించిన హవిస్సును సకల దేవతలును స్వీకరించిరి. బలికి మనువు పదవి లభించింది. కనుక భగవానుని కార్యములు ఏవీ వ్యర్థము కాలేదు.

157. శుచిః

పరమ పావనమూర్తి. ఏ విధమైన దోష మాలిన్యములును అంటనివాడు.

ఓం శుచయే నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

17వ శ్లోకము. 157వ నామము. శుచిః – **ఉపేంద్రో వామనః ప్రాంశురమోఘః శుచిరూర్జితః**

27వ శ్లోకము. 252వ నామము. శుచిః – **అసంఖ్యేయో అప్రమేయాత్మా విశిష్టః శిష్టకృత్ శుచిః**

శుచయతి ఇతి శుచిః – శుభ్రపరచువాడు. పరమ పవిత్రుడు. కర్మ ప్రభావములు పరమాత్మకు వర్తించవు.

స్వయంకృతోప కారేషు యత్కించిత్ప్రత్యుపక్రియామ్
అనపేక్షస్థితో యోऽసౌ శుచిస్స్యాద్ధర్మదోమనుః
స్వయంగా తాను మానవులకు ఉపకారం చేస్తాడు కాని వారినుంచి ఏ విధమైన ప్రతిఫలాన్నీ ఆశించడు కనుక అయన పవిత్రుడు. మరియు తనను స్మరించేవారిని పవిత్రులుగా చేసేవాడు.

శ్రీమహావిష్ణువు **'పవిత్రాణాం చ పవిత్రమ్'**. అంతే కాదు. ఆయనను ధ్యానించి, పూజించువారి పాపములు పటాపంచలగును. వారును పవిత్రులగుదురు. భగవంతుడు ధర్మ స్వరూపుడైనందున, శుద్ధ సత్వ స్వరూపుడైనందున, భగవంతునికి సంబంధించిన దేదియును అపవిత్రము కాదు. బలిని అణచి, ఇంద్రునికి సహాయపడినందున ఆయన పక్షపాతి అనిపించవచ్చును. కాని బలికి మరింత ప్రయోజనము ఒనగూడెను. శ్రీమన్నారాయణుడే బలికి ద్వారపాలకుడయ్యెను.
శుద్ధమ్ అపాపవిద్ధమ్ – ఈశావాశ్యోపనిషత్తు.
అస్పర్శశ్చ మహాన్ శుచిః

భగవంతుని పవిత్రతను మరింత విశదీకరిస్తూ శ్రీ సత్యదేవ వాసిష్ఠగారుఇలా చెప్పారు – సృష్టిలోని సౌందర్య మాధుర్యములు భగవంతుని శుచిత్వమును చాటిచెప్పుచున్నవి. పూవులు, తావులు, సెలయేరులు, పిల్లగాలులు భగవంతుని గుణగానము చేయుచు, మనసా వాచా కర్మణా పవిత్రముగా నుండవలెనని బోధించుచున్నవి.

158. ఊర్జితః

అనంత శక్తి సామర్ధ్య సంపన్నుడు.

ఓం ఊర్జితాయ నమః

'ఊర్జా' అనగా బలము. ఇది భగవంతుని షడ్గుణములలో ఒకటి. దుష్టశిక్షణ, శిష్టరక్షణ, లీలామాత్రముగ సకల భువనముల భారమును వహించుట వంటి ఆయన లీలలను స్మరిస్తూ, ఆయన బలమును అర్థం చేసుకోవడానికికి మనం ప్రయత్నించవచ్చును. అయన అనంత బలసంపన్నుడు. అంతే కాదు. సకల భూతములలోని బల వైభవములు కూడ భగవంతునివల్లనే కలుగుచున్నవి.

యద్యద్విభూతి మత్సత్వం శ్రీమదూర్జితమేవవా
తత్తదేవాగచ్ఛ త్వం మమ తేజోంశ సంభవమ్ – గీత 10.41

విభూతియుక్తమైన, అనగా ఐశ్వర్య యుక్తము, కాంతియుక్తము, శక్తియుక్తము ఐన వస్తువు ఏదైనా నా తేజస్సుయొక్క అంశమునుండియే కలిగినదిగా తెలిసికొనుము.

అందరిలోని బలము భగవంతునివల్లనే కలుగుచున్నది. పెక్కు మంత్రములద్వారా పూర్వీకులు బలాన్ని కోరారు.

ఊర్జాదేతామ్ అవస్యోజసాం త్వామ్ పిబా సోమమదాయ కమ్ శతక్రతో – ఋగ్వేదము 8.36.3
ఊర్జా పిన్వస్వ సమిషోదిదేహిన – ఋగ్వేదము 3.3.7
ఊర్గస్యాంగిరస్యూర్ణమ్రదా ఊర్జమ్ మయి దేహి – యజుర్వేదము 4.15
బలమసి బలమ్ మయి దేహి – యజుర్వేదము 19.9
ఊర్జో బలమ్ స ఓజో మ ఆగన్ – అధర్వణ వేదము 18.4.53
ఓజోऽసి సహోऽసి బలమసి భ్రాऽజోసి

159. అతీంద్రః

ఇంద్రునికంటె అధికుడు

ఓం అతీంద్రాయ నమః

శ్రీమహావిష్ణువు దేవతలకును, దేవతల పాలకునకును రక్షకుడు. ఆయన కృపవల్లనే ఇంద్రునికి ఆ వైభవము ప్రాప్తించెను.

శ్రీకైవల్య సారధినుండి – ఇంద్రునికి తమ్ముడే అయిప్పటికీ ఐశ్వర్యములో అతనిని మించినవాడు.

శ్రీ చిన్మయానంద – వేదాంతపరముగా ఇంద్రుడు ఇంద్రియములకు. మనసుకు, బుద్ధికి ప్రతీక. మనస్సునకు ఆధారము ఆత్మ. అన్ని ఆత్మలకును ఆధారము పరమాత్ముడు. అతీంద్రియుడు.

160. సంగ్రహః

- సులభముగా, కేవలము భక్తివల్లనే, పొందనగువాడు (అందుబాటులో ఉండేవాడు).
- ప్రళయ కాలమున సమస్తమును తనయందు చేర్చుకొనువాడు.
- సమస్తమును కలిపి తన అధీనములో ఉంచుకొన్నవాడు.

ఓం సంగ్రహాయ నమః

'సంగ్రహించుట' అనగా కలిపి పట్టుకొనుట, దగ్గరకు తీసికొనుట, స్వంతము చేసికొనుట అనే అర్థాలున్నాయి.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **అథః భక్తైః అయత్నేన సంగ్రహయతి ఇతి సంగ్రహః.** పెద్దగా శ్రమ లేకుండా, అంటే కేవలం భక్తి కలిగియుండడం ద్వారా, భక్తులకు ఆ వైకుంఠవాసుడు అందుబాటులో ఉంటాడు. భక్తి యోగమునకు శ్రమ లేదు. ఖర్చు లేదు. కాని ఆ జగన్నాధుని అందిపుచ్చుకొనవచ్చును.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సర్వేషామ్ సంహృతౌ ప్రతి సంహారాత్ సంగ్రహః.** ప్రళయకాలమున సమస్తమును ఆ విశ్వేశ్వరుడు తనయందు విలీనము చేసికొనును (సంగ్రహించును.)

శ్రీ చిన్మయానంద – భగవంతుడు జగత్తునంతటిని కలిపి యుంచును. కనుక ఆయన సంగ్రహుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – సమ-గ్రహ-సంగ్రహః – సకల భూతముల అంతస్థితమగు ఆత్మ భగవత్స్వరూపమే. ఆ పరమాత్ముడు అన్నింటి అంతరాత్మయైనందున, అన్నింటిని కలిపి పట్టుకొనేది ఆయనే. (పూలదండలో దారం వలె సకల జీవులందలి ఆత్మ ఒక్కటే). అన్నింటిని కలిపినందున ఆయన సంగ్రహుడు.

161. సర్గః

తనను తానే సృజించుకొని, తననుండి సమస్తమును సృజించినవాడు.

ఓం సర్గాయ నమః

సృజతి ఇతి సర్గః – సృష్టించువాడు 'సర్గః'. 'సృజ్' అనే ధాతువునుండి ఈ నామమును వివరించవచ్చును. స్థితి, ప్రళయ కార్యములకు ముందుగా సృష్టి కార్యము జరిగినది. సృష్టియంతయు ఆయన రూపమే.

బ్రహ్మాదిభ్యః సృజ్యతేయః సర్గః తం పరిచక్షతే – బ్రహ్మాది దేవతలను ఉద్ధరించడానికి తనకు తానుగా సృజింపబడేవాడు.

గీతా- తత్వ వివేచనీ వ్యాఖ్య నుండి (పండిత జయదయాల్ గోయందకా రచన)–
భీష్మ పితామహుడు ఇట్లనెను – వాసుదేవ భగవానుడు దేవదేవుడు. సర్వశ్రేష్ఠుడు. ఆయనయే ధర్మము. ధర్మజ్ఞుడు. వరదుడు. సర్వమనోరథములను ఈడేర్చువాడు. అతడే కర్త, కర్మ, స్వయంప్రభువు. భూత భవిష్యత్ వర్తమానములను, సంధ్యలను, దిశలను, ఆకాశమును, అన్ని నియమములను ఈ జనార్ధనుడే సృజించెను. మహాత్ముడును, శాశ్వతుడును ఐన ఈ ప్రభువే ఋషులను, తపస్సులను, జగత్సృష్టిని చేయు ప్రజాపతిని సృష్టించెను. ప్రాణులందరికిని అగ్రజుడైన సంకర్షణుని కూడ ఇతడే సృష్టించెను. లోకములు ఆదిశేషుని 'అనంతుడు' అని పిలుచును. పర్వతములతో సహా పృథ్విని ధరించు ఆదిశేషుడు కూడ ఈయననుండియే ఉత్పన్నుడాయెను. ఈయనయే వారాహ, నృసింహ, వామనాది అవతారములు దాల్చెను. అందరికిని తల్లియు, తండ్రియు ఇతడే. ఈయనకంటె శ్రేష్ఠుడు మరియొకడు లేడు. ఇతడే కేశవుడు. పరమ

తేజఃస్వరూపుడు. అందరికిని పితామహుడు. మునులు ఈయనను హృషీకేశుడు అని పిలిచెదరు. ఇతడే ఆచార్యుడు. పితృదేవుడు. గురుడు. ఈ శ్రీకృష్ణుని అనుగ్రహమునకు పాత్రుడైనవానికి అక్షయలోకప్రాప్తి కలుగును. భగవానుడైన ఈ కేశవుని భయగ్రస్తుడు శరణుపొంది, ఈయనను స్తుతించినచో అతడు భయవిముక్తుడై పరమ సుఖమును పొందును. శ్రీకృష్ణ భగవానుని శరణు పొందినవారు మోహపాశములలో చిక్కుకొనరు. మహాభయము (సంకటము)నకు గురియైనవారిని కూడ భగవానుడైన జనార్దనుడు అనుక్షణమూ కాపాడుచుండును.

యే చ కృష్ణం ప్రపద్యంతే తే న ముహ్యంతి మానవాః
భయే మహతి మగ్నాంశ్చ పాతి నిత్యం జనార్దన – మహాభారతము. భీష్మ పర్వము. 67/24

162. ధృతాత్మా

- సకల జీవాత్మలకును ఆధారమైనట్టివాడు (ధరించువాడు).
- షడ్భావ వికారములు లేనివాడు.

ఓం ధృతాత్మనే నమః

ధృతః ఆత్మా యేన సః ధృతాత్మా – అన్ని ఆత్మలను ధరించి (చేపట్టి) యున్నవాడు. జనన, మరణ, కామ, క్రోధాది వికారములకు అతీతముగ వర్తిల్లు సర్వాంతర్యామి.

163. నియమః

శాసన కర్త. నియమములనేర్పరచి, నియంత్రించి, నడపువాడు.

ఓం నియమాయ నమః

17వ శ్లోకము. 163వ నామము. 'నియమః' – **అతీంద్రః సంగ్రహః సర్గో ధృతాత్మా నియమో యమః**
92వ శ్లోకము. 869వ నామము. 'నియమః' లేదా 'అనియమః' – '**అపరాజితః సర్వసహో నియంతా నియమో యమః**' లేదా '**అపరాజితః సర్వసహో నియంతాऽనియమోऽయమః**'

నియమ్యతే జగద్యేన నియమః స ఉదీరితః – ఎవనిచేత జగత్తు అంతా నియమింపబడుతుందో ఆయన నియముడు. **నియమతి ఇతి నియమః** – నియమములనగా విధివిధానములు. ఇందుకు ధాతువైన 'యమ్'కు రెండు అర్థాలున్నాయి.

యమ్ – ఉపరమే – పర్యవేక్షించుట, పని చేయించుట.

యమ్ – పరివేషణే – చుట్టుముట్టుట, అధీనములోనుంచుకొనుట.

అన్నింటిని సృష్టించినవాడు భగవానుడు స్వయముగా అన్ని భూతములందును ఆత్మసాక్షియై యున్నాడు. కనుక అందరిని నియంత్రించుట ఆయనకే సాధ్యము. ఆయన శాసనమునకు లోబడియే పంచభూతములు, సూర్యచంద్రాది దేవతలు వర్తించును.

164. యమః

పరిపాలించువాడు. సమస్తమును వశము కావించుకొన్నవాడు.

ఓం యమాయ నమః

17వ శ్లోకంలోని 163, 164 నామములు. నియమః, యమః – **అతీంద్రః సంగ్రహః సర్గో ధృతాత్మా నియమో యమః**

92వ శ్లోకంలోని 869, 870 నామములు. నియమః, యమః లేదా అనియమః, అయమః – **'అపరాజితః సర్వసహో నియంతా నియమో యమః'** లేదా **'అపరాజితః సర్వసహో నియంతాऽనియమోऽయమః'**

అకంటకం చానుకూలం యచ్ఛతీ త్యఖిలం యమః – ఈ జగత్తును తన భక్తులకు అనుకూలంగా, అవరోధాలు లేకుండా చేసేవాడు.

యచ్ఛతి ఇతి యమః – లేదా – **యమయతి ఇతి యమః** – అంతయును శ్రీహరికి అధీనమై పాలింపబడుచున్నది. ఆయన సకల భూతములందును అంతస్థితుడై వానిని పాలించుచుండును. మరియు సూర్యమండల మధ్యవర్తియై భూమిపైని సకల జీవరాసులను పాలించును. ఇందుకు శృతులనుండి పెక్కు ఆధారాలున్నాయి. బృహదారణ్యకోపనిషత్తు –

3.7.15 – యః సర్వాణి భూతాని అంతరో యమయతి.

? – **యః పృథ్వీమ్ అంతరో యమయతి**

3.7.3 – **యః ఆత్మానమ్ అంతరో యమయతి**

శ్రీ పెమ్మరాజు రాజారావు రచననుండి –

భక్తి, జ్ఞాన, కర్మ మార్గములలో ఏ మార్గమును సాధించుచున్నను యమ, నియమములు అత్యంత ప్రధానములు.

యమములు అనగా

1. అహింస (ఏ ప్రాణికిని హింస చేయకుండుట)
2. సత్యము (నిజము పలుకుట)
3. అస్తేయము (దొంగతనము చేయకుండుట)
4. బ్రహ్మచర్యము (ఇంద్రియ నిగ్రహము)

5. అసంగ్రహము (ఇతరులనుండి స్వీకరింపకుండుట)

నియమములు అనగా

1. సంతోషము (సుఖ దుఃఖాది ద్వంద్వములయందు సమత్వము)

2. శౌచము (శరీరము, మనస్సుల శుద్ధి)

3. తపస్సు (శారీరిక, వాచిక, మానసిక నియమము)

4. స్వాధ్యాయము (పుణ్యగ్రంథ పఠనము)

5. ఈశ్వర ప్రణిధానము (భగవంతుని శరణాగతి)

ఈ దశవిధ గుణముల అనుష్టానము చేత మానవుడు మహాత్ముడగును. కావుననే ఈ స్తవరాజములో వీనికి ఎక్కువ ప్రాధాన్యమీయబడెను.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

వేద్యో వైద్యః సదాయోగీ వీరహా మాధవో మధుః |

అతీంద్రియో మహామాయో మహోత్సాహో మహాబలః || (18)

165. వేద్యః

- తెలిసికొన బడువాడు (**వేదితుమ్ శక్యః వేద్యః**)

- తెలిసికొన దగినవాడు (**వేదనార్హత్వాత్ వేద్యః, వేదితుమ్ యోగ్యః ఇతి వేద్యః**)

ఓం వేద్యాయ నమః

ముముక్షువులు, జ్ఞానులు, తాపసులు ఆ పరబ్రహ్మమును తెలిసికొనుటకే సదా ప్రయత్నించుదురు. అన్ని జప, తప, కర్మ, విద్యాదుల ద్వారాను తెలియబడునది ఆ పరబ్రహ్మమే.

కైవల్య 22 – **వేదైరనేకై రహమేవ వేద్యః** – అన్ని వేదములవల్లను తెలిసికొనదగినది నేనే.

శ్రీమహావిష్ణువే పరమసత్యము. ఇది తెలిసికొన్న తరువాత తక్కినవి అన్నియును తెలిసినట్లే. అని శ్రీ చిన్మయానంద వివరించారు.

జ్యోతిషామపి తజ్జ్యోతిః తమసః పరముచ్యతే

జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం హృది సర్వస్య విష్ఠితమ్ – గీత 13.17

ఆ పరబ్రహ్మ అన్ని జ్యోతులకును జ్యోతి (పరంజ్యోతి). మాయాతీతుడును, జ్ఞాన స్వరూపుడును, తెలిసికొనదగినవాడును, తత్వజ్ఞానముద్వారా ప్రాప్యుడును అతడే. సర్వప్రాణుల హృదయములయందు విశేషముగా ఉండువాడును అతడే.

సర్వస్యచాహం హృదిసన్నివిష్టో మత్తః స్మృతిర్ జ్ఞానమపోహనం చ

వేదైశ్చ సర్వైరహమేవ వేద్యో వేదాన్తకృద్వేదవిదేవ చాహమ్ – గీత 15.15

సమస్త ప్రాణుల హృదయములలో అంతర్యామిగా ఉన్నవాడను నేనే. నానుండియే స్మృతి, జ్ఞానము, అపోహనము (సందేహమును తొలగించుట) కలుగుచున్నవి. వేదములద్వారా తెలిసికొనదగినవాడను నేనే. వేదాంతకర్తను, వేదజ్ఞుడను కూడ నేనే.

166. వైద్యః

- విద్యలన్నియును తెలిసినవాడు. సర్వజ్ఞుడు.
- జనన మరణ చక్రమునుండి తన భక్తులను ముక్తులుగా చేయడం తెలిసినవాడు.

ఓం వైద్యాయ నమః

'విద్య' నెరిగినవాడు వైద్యుడు. శ్రీమహావిష్ణువే అనాదిగానున్న విద్యలన్నింటిని తెలిసినవాడు. విశ్వమునకు, విశ్వములోని సకల విద్యాజ్ఞానములకు సృష్టికర్త ఆయనే. ఆయన కెఱుక లేని విద్య లేదు. అంతేకాదు. వేరెవ్వరికి అన్ని విద్యలు తెలియవు. అయనొక్కడే సకలసృష్టివిద్య నెరిగిన వైద్యుడు.

విశ్వాని దేవ వాయునాని విద్వాన్ – యజుర్వేదము 7.43
ఈశ్వరః సర్వవిద్యానామ్ – తైత్తరీయారణ్యకము 10.21
ఆయన సర్వవిద్య. మహావిద్య. విద్యేశ్వరుడు. వేదవిదుడు. వేదవేద్యుడు. వైద్యుడు. పశుపక్షులలోను, క్రిమికీటకాదులలోను కూడ మనము గమనించే బుద్ధి, జ్ఞానము మనకు సర్వదా భగవంతుని సర్వజ్ఞత్వమును, సర్వాంతర్యామిత్వమును సూచించును. ఆయన పదసేవయే మనకు పరమార్థము.

వేదిత్వాణాం భవాఖ్యస్య గదన్య వినివర్తనీమ్
విద్యామధీతే వేదేతి యో వైద్యః స ముదాహృతః
తనను ఉపాసించేవారిని భవబంధాలనుండి విముక్తులుగా చేసి, విద్యను (జ్ఞానాన్ని) తెలియజేయువాడు.
శ్రీ భట్టుల ప్రత్యేక సూచన – శ్రీహరియే మన పాపములను హరించి, కర్మబంధములను తొలగించి, జననమరణ చక్రమునుండి ముక్తిని ప్రసాదించు విద్యనెరిగినవాడు. కనుక వైద్యుడు. జగద్గురువు.

వైద్యుడు అనగా 'డాక్టర్' అని సామాన్యార్థము. ఈ అర్థములో కూడ వ్యాఖ్యానకర్తలు పురుషోత్తముని కీర్తించినారు. ('భిషక్' అనే నామము కూడ తరువాత వస్తుంది.)

శ్రీ చిన్మయానంద – అహంకారము, మాయ, అజ్ఞానము అనే వ్యాధులతో బాధపడుతున్న లోకములను బాగుచేయగలిగిన వైద్యుడు ఆయన. ఇదే అర్థములో శ్రీ భట్టులు చూపిన ప్రమాణమునుబట్టి, సకల పాపములను నశింపజేయును గనుక శ్రీహరి వైద్యుడు.

మేరు మందర మాత్రోఽపి పాపస్య కర్మణః

కేశవమ్ వైద్యమ్ అసాధ్య దుర్వ్యాధిరివ నశ్యతి – విష్ణుధర్మము 69.110
మేరు పర్వతమంతటి పాపములు ప్రోగైనను సరే, కేశవుని అర్చించినట్లయితే ఆ పాపములన్నీ నశించును. వైద్యుని వైద్యమువలన దుర్వ్యాధులు తొలగిపోయినట్లే, కేశవార్చన వలన పాపములు నశించును.

తిరువేంకట రమణుడు కోరి మమ్మేలిన కులదైవము. రోగములన్నింటిని అణగించు దివ్యౌషధము. చెడనీక బ్రతికించే సిద్ధమంత్రము. కోరికలు వర్షించు కాలమేఘము.

167. సదాయోగీ

- భక్తులపట్ల ఎల్లప్పుడు జాగరూకుడై అందుబాటులో ఉండువాడు.
- సర్వ వ్యాపియై విశ్వమును అవిచ్ఛిన్నముగా నిలుపువాడు.
- సదా ధర్మమార్గానువర్తి యైనవాడు.
- యోగచింతనలో నిమగ్నుడైన సచ్చిదానంద స్వరూపుడు.
- ఎల్లప్పుడు సమత్వ బావన కలిగినవాడు.

ఓం సదాయోగినే నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – భగవానుడు భక్తులపట్ల సదా జాగృతుడై యుండును. అందరిలోను అంతర్యామియై వెలుగొందుచుండును. కనుక మనమెప్పుడు పూజించినా, శరణు కోరినా, స్మరించినా ఆయన మనకు అందుబాటులోనుండి మనలను బ్రోచును. రావే ఈశ్వర! కావవే వరద! సంరక్షించు భద్రాత్మకా! అని గజేంద్రుడు శరణు వేడగనే అపన్న ప్రసన్నుండు సంరంభియై

సిరికిం జెప్పడు, శంఖ చక్ర యుగముం జేదోయి సంధింపడే
పరివారంబును జీర డభ్రగపతిం బన్నింప డాకర్ణికాం
తర ధమ్మిల్లము జక్క నొత్తడు వివాద ప్రోత్థిత శ్రీ కుచో
పరిచేలాంచలమైన వీడడు గజ ప్రాణావనోత్సాహియై.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ మూడు విధాలుగా ఈ నామమును వివరించారు –
సతః అయోగీ, సదాయోగీ, సదా అయోగీ
'సతస్' అనగా సమభావము. 'అయుజ్' అనగా కలుపుట, సంధానించుట. ఈ నామమునకు మూలధాతువులు కూడా బహువిధములుగా ఉత్పన్నములు.
యుగి – వర్జనే – వర్జించుట, వదలివేయుట
యుజ్ – సమాధౌ – మనస్సును కేంద్రీకరించుట
యుజ్ – యోగే – కలుపుట, ఐక్యమగుట

యుజ్ – సంయమనే – జత చేయుట

సతః అయోగీ సదాయోగీ – భగవంతుడు సర్వవ్యాపియై లోకములను కలిపియుంచును. **సద్దైవ యోజయతి సంయమయతి విశ్వాన్ లోకాన్ స సదాయోగీ** – భగవంతుడు ఇందు కలడు అందు లేడని సందేహము వలదు. చక్రి సర్వోపగతుడు. ఎందెందు వెదకి చూచిన అందందే కలడు.

సత్యము, ధర్మము కానివానిని అన్నింటిని త్యజించినందున శ్రీహరి 'సదాయోగి' యగును. సత్యపాలనకు, ధర్మ రక్షణకు ఆయన సదా అవతరించి సజ్జనులను కాచుచుండును.

ఎల్లపుడు ఆయన యోగమూర్తియై (సమత్వ భావన కలిగి) ఉన్నందున ఆయన 'సదాయోగి'. సచ్చిదానందపూర్ణ పరబ్రహ్మము. శుద్ధసత్వమూర్తి. రాగద్వేషరహితుడు. జ్ఞానానందమయుడు. **సదాయోగః అస్య అస్తి ఇతి తమ్ సదాయోగినమ్, సదా యోగశీలమ్ స్వభావ ధర్మాణమ్ వా.**

ధర్మచక్రము రచయిత (పేరు తెలియదు) వ్యాఖ్యానము ప్రకారము ప్రజలు మూడువిధములైన జీవనము గడుపుచుందురు. రోగి, భోగి, యోగి. వీనిలో ఇంద్రియములను నిగ్రహించి, ఇంద్రియ సౌఖ్యములను పరిత్యజించి, పరమ పురుషుని పరంధామముపై దృష్టి నిలుపు జీవన్మార్గము యోగము. ఈ మార్గంలో ఆరోగ్యము, ఆనందము, మోక్షము లభిస్తాయి. అట్టి మార్గానువర్తులు సదాయోగియైన పరమాత్మునిపైననే మనసు నిలుపుకొందురు.

168. వీరహా

బలవంతులగు దుష్టులను నాశనము చేయువాడు.

ఓం వీరఘ్నే నమః

ఈ నామము 168, 747, 927వ నామములుగా మూడుమార్లు వస్తుంది.

18వ శ్లోకము. 168వ నామము. వీరహా - **వేద్యో వైద్యః సదాయోగీ వీరహా మాధవో మధుః**

79వ శ్లోకము. 747వ నామము. వీరహా - **వీరహా విషమః శూన్యో ఘృతాశీరచలశ్చలః**

99వ శ్లోకము. 927వ నామము. వీరహా - **వీరహా రక్షణః సంతో జీవనః పర్యవస్థితః**

పరిత్రాణాయ సాధూనామ్, వినాశాయ చ దుష్కృతామ్, ధర్మ సంస్థాపనార్థాయ – తాను యుగ యుగమున సంభవింతునని శ్రీకృష్ణభగవానుడు గీతోపదేశమున సెలవిచ్చెను. వీరుడైనవాడు తన శక్తిని అధర్మకార్యమునకు వినియోగించిన యెడల భగవంతుడు వానిని అంతమొందించుట తథ్యము. పెక్కు వరములు పొందినను, అసమాన బల పరాక్రమములు కలిగినను వానికి నాశనము తప్పదు. హిరణ్యకశిపుడు, రావణుడు, కంసుడు వీరులైనను వారికి శ్రీహరి చేత మరణము తప్పలేదు.

శ్రీ భట్టుల వ్యాఖ్య ప్రకారము ఇక్కడ 'వీర' అనే పదము 'కుకర్త శూరు'లకు వర్తించును. అట్టి కుకర్త వాదులు భగవంతుడు లేడనియో, తామే దేవుళ్ళమనియో, మరొక విధముగానో వాదించి భక్తులను పెడత్రోవ పట్టింతురు. వారి ప్రవృత్తి గురించి భగవద్గీత 16వ అద్యాయము (దైవాసుర సంపద్విభాగ యోగము) నందు 8 నుండి 19వ శ్లోకము వరకు చెప్పబడినది – అలాంటి కుకర్తా వాదులు అసుర స్వభావము కలవారు. దంభము, దర్పము, మదముచే మత్తులై, విషయ భోగ పరాయణులై యుందురు. మిథ్యా సిద్ధాంతములను ఆశ్రయించి భ్రష్టాచారులై వర్తించెదరు. వారు ఇతరులను నిదించుచు, తమ శరీరముల యందును, ఇతరుల శరీరములందును అంతర్యామిగా నున్న పురుషోత్తముని ద్వేషించుచుందురు. అట్టి 'వీరు'లను నశింపజేయువాడగుటచే శ్రీహరిని వీరఘ్నుడు అని నుతింపనగును.

శ్రీ కైవల్య సారధి నుండి – **స్వ ధ్యాన భంజకాన్ వీరాన్ హన్తి యః సతు వీరహా** – తన ధ్యానాన్ని చెడగొట్టు వీరులను అంతము చేయువాడు 'వీరహా'.

169. మాధవః

- బ్రహ్మ విద్యను ప్రసాదించువాడు. సకల విద్యా జ్ఞానములకు ప్రభువు. పరమాత్మను గూర్చిన జ్ఞానమును ప్రసాదించువాడు.
- మా+ధవః – లక్ష్మి (మా)కి భర్తయైనవాడు.
- మధువిద్య ద్వారా తెలియువాడు.
- మౌనము, ధ్యానము, యోగము ద్వారా తెలిసికొనబడువాడు.
- మధువంశము (యాదవ వంశము)నందు జన్మించినవాడు.
- తనకు వేరు ప్రభువు లేనివాడు (అందరకు ఆయనే ప్రభువు)
- మౌనముగానుండి, సాక్షియైనవాడు.

ఓం మాధవాయ నమః

సర్వ కాలములందు స్మరించి తరించనగు ఈ పుణ్య నామము శ్రీవిష్ణుసహస్రనామములో మూడుమారులు చెప్పబడినది. (73, 169, 741వ నామములు).

8వ శ్లోకము. 73వ నామము. మాధవః – **హిరణ్యగర్భో భూగర్భో మాధవో మధుసూదనః**

18వ శ్లోకము. 169వ నామము. మాధవః – **వేద్యో వైద్యః సదాయోగీ వీరహా మాధవో మధుః**

78వ శ్లోకము. 741వ నామము. మాధవః – **లోకబంధుః లోకనాథో మాధవో భక్తవత్సలః**

ఈ మూడు సందర్భములలోను మూడు విధములుగా విజ్ఞులు భాష్యమును చెప్పారు. వివిధ అర్థములు 73వ నామ వివరణలో చెప్పబడినవి.

మా విద్యా చ హరేః ప్రోక్తా తస్యాః స్వామీ ధవ స్మృతః

తస్మాన్మాధవ నామాऽసౌ బ్రహ్మవిద్యా ప్రదో మనుః

'మా' అంటే పరావిద్య. దానికి స్వామి (ధవుడు) గనుక ఆయనను మాధవుడు అన్నారు.

మౌనాత్ ధ్యానాచ్చ యోగాచ్చ మాధవః పరికీర్తితః – మౌన, ధ్యాన యోగములు కలవాడు మాధవుడు.

170. మధుః

- భక్తులకు తేనెవలె, అమృతము వలె, అత్యంత ప్రియమైనవాడు.
- మంగళకరమగు జ్ఞానమయుడు.

ఓం మధవే నమః

భక్తుల హృదయములందు భగవద్భావన, స్మరణ, కీర్తనలు తేనెవలె, అమృతమువలె ఆనందమును నింపును. **భక్తేభ్యో లబ్ద విద్యేభ్యో స్వదమానతయా మధుః** – మోక్షసాధన కొరకు పరావిద్యనాశ్రయించిన భక్తులకు మధువువలె తియ్యగా ఉండేవాడు మధువు. శ్రీహరి ధ్యానమే భక్తులకు మందార మకరంద మాధుర్యము. అంబుజోదర దివ్య పాదారవింద చింతనామృత పాన విశేష మత్త చిత్తమునకు ఇతర విషయములు సారహీనములు. అందువలననే ఆళ్వారులు, పోతన, అన్నమయ్య, త్యాగయ్య, రామదాసు, మీరాబాయి, తులసీదాసు వంటి భక్తులు హరినామ గానామృతమున పరవశించి తరించారు.

అయమాత్మా సర్వేషామ్ భూతానామ్ మధు – బృహదారణ్యకోపనిషత్తు 2.5.14. (నేను అన్ని భూతములందును ఆత్మస్థితుడనై, మధువునై యున్నాను)

పెరియాళ్వారుగారు 'పూచ్చూతల్'లో – **తేనియల్ ఇనియ సిరానె** – అని భగవంతుని ప్రస్తుతించారు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – 'మధు' అనగా జ్ఞానము అని కూడ అర్ధము. భగవంతుడు సర్వ వ్యాపి, సర్వాంతర్యామి యైనందున సర్వజ్ఞుడు కూడ. **జ్ఞాన ధర్మేణ వ్యాప్నువమ్ సర్వమ్ విశ్వమ్ మన్యతే జానాతి, తస్మాత్ స మధుః**. అలాగే యజుర్వేద మంత్రము – **తదంతరస్య సర్వస్య తదు సర్వస్యాస్య బాహ్యతః** – ఆయన అన్నింటి లోపలను, అన్నింటి బయటను ఉండును. కనుక ఆయన జ్ఞానమయుడు. ఆయనకు తెలియనిది లేదు.

ధర్మ చక్ర రచయిత మరిన్ని విశేషాలను పొందుపరచారు – ఆహార పదార్థములలో తేనె విశిష్ఠమైనది. రుచికరమైనది. అందులో వ్యర్థమయ్యేది ఏమీ లేదు. దానివలన విపరీత లక్షణములు సంభవింపవు. అదేవిధముగా సకల శుభదాయకమగు పరిపూర్ణ జ్ఞానానందమయుడు మధువు. శ్రీమహావిష్ణువు.

తూము నరసింహదాసు కీర్తన

నోరూరు గదవె శ్రీరాముని దలచిన నోరూరు గదవె
పాలు మీగడ మేలి చక్కెర – చాల మెక్కిన పోలికను ॥నోరూరు॥
మేరు సమదాధీరు జగదా – ధారు శ్రీ రఘువీరు దలచిన
కూరిమితో నరసింహ దాసుని – జేరు రాముని పేరు దలచిన ॥నోరూరు॥

భక్త రామదాసు కీర్తన

శ్రీరామ నీ నామమేమి రుచిరా - ఓరామ నీ నామ మెంత రుచిరా ॥శ్రీరామ॥
కరిరాజ ప్రహ్లాద ధరణి విభీషణుల - గాచిన నీనామ మేమి రుచిరా ॥శ్రీరామ॥
కదళీ ఖర్జూరాది ఫలములు కధికమో - కమ్మన నీనామ మేమిరుచిరా ॥శ్రీరామ॥
నవరసములకన్న నవనీతము కంటె - నధికమౌ నీ నామ మేమి రుచిరా ॥శ్రీరామ॥
అంజనాతనయ హృత్కమలంబు నందు - రంజిల్లు నీనామ మేమి రుచిరా ॥శ్రీరామ॥
శ్రీ సదా శివుడు తానేవేళ భజియించు - శుభరూప నీనామ మేమి రుచిరా ॥శ్రీరామ॥
సారము లేని సంసారమ తరణమునకు - తారకము నీనామ మేమి రుచిరా ॥శ్రీరామ॥
శరణన్న జనులను సరగున రక్షించు - బిరుదుగల్గు నీనామ మేమి రుచిరా ॥శ్రీరామ॥
తుంబురు నారదులు డంబుమీరగ – గానంబు చేసెడి నీనామ మేమి రుచిరా ॥శ్రీరామ॥
అరయ భద్రాచల శ్రీరామదాసుని - ఏలిన నీనామ మేమి రుచిరా ॥శ్రీరామ॥

---

171. అతీంద్రియః

ఇంద్రియములకు అందనివాడు. ఇంద్రియముల ద్వారా తెలిసికొనబడ జాలనివాడు.

ఓం అతీంద్రియాయ నమః

జ్ఞానోపకరణవ్రాత మతిక్రాన్తో హ్యతీంద్రియః – ఇంద్రియాలకు కనిపించనివాడు.
ఇంద్రియాణి అతిక్రాంతః అతీంద్రియః – ఇంద్రియాలను అతిక్రమించినవాడు.

మనకు ఏవిషయమునైనా తెలిసికొనడానికి కనులు, ముక్కు, చెవులు, స్పర్శ వంటి ఇంద్రియములే సాధనములు. కాని ఏదయినా ఆకారము, రంగు, వాసన వంటి గుణములు కలిగినవానినే ఇంద్రియముల ద్వారా తెలిసికొనగలము. అలాగే మనసుకు (బుద్ధికి) తెలిసిన ఒక విషయము ద్వారా మరొక విషయమును తెలిసికొనడానికి ప్రయత్నించవచ్చును. కాని పరమాత్ముడు **యతో వాచే నివర్తంతే అప్రాప్య మనసా సహ** – వాక్కు చేత గాని, మనస్సు చేత గాని పట్టరానివాడు పరమేశ్వరుడు. నిరాకార నిర్గుణ పరబ్రహ్మమును

ఇంద్రియములద్వారా తెలిసికొన సాధ్యము కాదు. (విశ్వరూప దర్శనమునకు సామాన్యదృష్టి చాలదని అర్జునునివంటి ఆప్తునికి దివ్యదృష్టి నొసగినాడు శ్రీకృష్ణపరమాత్ముడు.)

ఈశావాస్య ఉపనిషత్తులోని రెండు మంత్రములు (**అనేజదేకమ్..** .. , **తదేజతి తన్నైజతి...** ..) పరబ్రహ్మముయొక్క అతీంద్రియ, అవాఙ్మానస నిర్గుణత్వమును చెబుతున్నాయి.

కఠోపనిషత్తు 1.3.10 – **ఇంద్రియేభ్యః పరహ్యర్థా ... ... అవ్యక్తాత్ పురుషః పరః అశబ్దమ్, అస్పర్శమ్, అరూపమ్, అవ్యయమ్ తథారసమ్ నిత్యమ్, అగంధవచ్చయత్**

అతడు శబ్దము లేనివాడు. స్పృశింప జాలనివాడు. నిరాకారుడు. అవిచ్ఛిన్నుడు. నిత్యమైనాడు. గంధము (వాసన) లేనివాడు.

తదేజతి తన్నైజతి తద్దూరే తదంతికే
తదన్తరస్య సర్వస్య తదు సర్వస్యాస్య బాహ్యతః

అతడు నడచును, నడవడు. దూరస్థుడు, సమీపస్థుడును. ఈ సమస్త జగత్తునకు లోపల, బయట ఉండువాడు.

శ్రీ చిన్మయానంద – ఇంద్రియముల ద్వారా భగవంతుని గ్రహింపలేము అనియే గాక, ఇంద్రియములలోని గ్రహణశక్తి, తద్వారా మనకు లభించు జ్ఞానము భగవంతునివల్లనే సాధ్యము. కన్ను తనను తాను చూడలేదు (అద్దములో ప్రతిబింబమును చూచును). అలాగే ఇంద్రియములు భగవంతుని గ్రహింపలేవు. అంతే కాదు. ఇంద్రియములు బయటనున్నవానిని చూడగలవు. కాని సర్వుల హృదయ కుహరములందు అంగుష్ఠమాత్రుడై యున్న సర్వాంతర్యామిని ఇంద్రియముల ద్వారా తెలిసికొనుట సాధ్యము కాదు.

అతీంద్రియు నెఱుంగుటకు భక్తి మాత్రమే ఏకైక మార్గము. ఆయన వేదవేద్యుడు. భక్తులకు అనుభవైకవేద్యుడు.

172. మహామాయః

అధిగమింపజాలని మాయమయుడు.

ఓం మహామాయాయ నమః

మాయా యస్యా ప్రపన్నానాం సర్వేషామస్తి మోహినీ
మహామాయః స విజ్ఞేయః వస్వర్ణో మనురుజ్వలః

తనను శరణు పొందనివారిని మాయలో పడవేసేవాడు 'మహామాయః'. ఈ నామము అష్టాక్షరీమంత్రము. ఉజ్వలమైన ఫలితాన్నిస్తుంది. ఓం మహామాయాయ నమః.

మాయాతీతా యస్య సః మహామాయః – గొప్పదయిన మాయ కలవాడు.

భక్తితో శరణాగతులై సర్వస్వమును అర్పించినవారు తప్ప మిగిలినవారు ఆ సర్వోపగతుని కనుగొనజాలరు అని శ్రీభట్టులు వివరించారు. ఆ జగన్నాధుడు అతీంద్రియుడు గనుక ఆయనను తెలిసికొనుట ఎవ్వరికిని సాధ్యము కాదు. ఆయన మాయను అధిగమించ ఎవ్వరి తరము కాదు.

ఇక్కడ 'మాయ' అనగా కనికట్టు అనియో, మోసము అనియో, భ్రాంతి అనియో అర్థము తీసికొనకూడదు. భగవంతుని మాయ అసాధారణ, కార్యకారణ రూపమగు అపరాప్రకృతి. అద్భుతమైన తత్వగుణము. అత్యంత విచిత్రము. (**జనకస్య కులే జాతా దేవమాయేవ నిర్మితా** – ఇక్కడ సీతాదేవి 'దేవమాయ' అని చెప్పబడెను.)

దైవీహ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా
మామేవ ప్రపద్యంతే మాయామేతాం తరంతి తే – గీత 7.14

నా మాయ త్రిగుణాత్మకమైనది. ఇది అధిగమించుటకు సాధ్యము కానిది. కాని కేవలము నిరంతరము నన్నే భజించువారు ఈ మాయను అధిగమించి సంసార సముద్రమునుండి బయటపడగలరు.

శృతులనుండి మరికొన్ని ఆధారములు.

అతి మోహకారీ మాయా మమ – శరభ 24.

విద్యాత్ మాయినమ్ తు మహేశ్వరమ్ – శ్వేతాశ్వర 4.10

తరువాతి నామములు 'మహోత్సాహః' నుండి 'అనిరుద్ధః' వరకూ భగవానుని షాడ్గుణ్య పరిపూర్ణతను కీర్తించేవిగా వివరించారు.

ఐశ్వర్యస్య చ సర్వస్య వీర్యస్య యశసః శ్రియః
జ్ఞాన వైరాగ్య యోశ్చైవ షణ్ణాం భగ ఇతీరితాః

ఐశ్వర్యము, వీర్యము, యశస్సు, శ్రీ, జ్ఞానము, వైరాగ్యము అనేవి షడ్గుణములు. కొన్ని చోట్ల జ్ఞానము, శక్తి, ధనము, బలము, వీర్యము ఓజస్సు అనేవి షడ్గుణాలుగా చెప్పబడినాయి.

173. మహోత్సాహః

- గొప్ప ఉత్సాహముతో కార్యాచరణము కావించువాడు.
- అంతు లేని సహనముతో జగత్తును భరించువాడు.

ఓం మహోత్సాహాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య

మహదుత్సహనం యస్య హ్యైశ్వర్యం కర్తృలక్షణమ్

మహోత్సాహః స విజ్ఞేయో మనురైశ్వర్య దాయకః

సకల జగత్తును సృష్టించడం అనే గొప్పదైన ఐశ్వర్యము కలవాడు. ఈ నామము ఐశ్వర్యమును ప్రసాదించు మంత్రము. ఓం మహోత్సాహాయ నమః. శ్రీమహావిష్ణువు నిరవధికముగా (విసుగు లేకుండ) సృష్టివంటి కార్యములు సాగిస్తూనే ఉంటాడు. ఆయన చేసే సృష్టిలోని వైవిధ్యము అత్యద్భుతము. ఈ సృష్టి పరిమాణము అనూహ్యము. జగత్పాలనము అసమానము. ఇలాంటి కార్యములను నిరంతరముగా, నిరవధికముగా నిర్వహించే భగవానుని ఐశ్వర్యగుణము 'మహోత్సాహము' కాక మరేమగును? అది ఆయనకు బయటినుండి అబ్బిన గుణము కాదు. ఆయనే స్వతహాగా మహోత్సాహుడు. సాంఖ్య తత్వములో చెప్పబడినది ఏమనగా – భగవంతుడు సర్వజ్ఞుడు, నిర్వికారుడు కనుక ఆయన ప్రత్యేకించి ఏ కార్యములూ చేయడు, అని. ఇందుకు భిన్నముగా 'మహోత్సాహః' నామమును బట్టి భగవంతుడు నిష్కర్ముడు కాడని, ఎంతో ఉత్సాహముతో సృష్టి స్థితి లయాది కార్యములను అవిచ్ఛిన్నముగా సాగించుచునే ఉండునని అర్థము చేసికొనవచ్చును.

శ్రీ చిన్మయానంద – భగవంతుని మహాశక్తికి మహోత్సాహము తోడు అగుట వల్లనే జగత్తు నిలిచియున్నది. సముద్రములోని అలలు అలుపు సొలుపు లేకుండా ఎగసి పడుచున్నట్లుగానే, భగవంతుడు విరామము లేని ఉత్సాహముతో లోకములను ఏలుచుండును. దూడ కొఱకు ఆవు పొదుగులో పాలు నింపును. తేటి కొఱకు పూవులకు రంగులద్ది, లోపల మకరందము నింపును.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **మహాన్+ఉత్+సాహః, మహాన్తమ్ ఉచ్చైస్తమమ్ సాహః, సహతే సహ్యతి, సహతి వా స మహోత్సాహః** – గొప్పదైన సహనగుణము కలిగినవాడు. ఇక్కడ 'సాహ్' అనే ధాతువును 'సహనము' అనే అర్థంలో అన్వయించుకొనవచ్చును. అందుకు ప్రమాణము ఋగ్వేద మంత్రము (1.164.13) – **నా క్షతప్యతే భూరిభారః** – అలసట లేకుండ ఆయన సూర్యచంద్రాదుల మహాభారమును మోయుచునే యుండును. సృష్టించుట, పోషించుటతో సరిపెట్టుకొనక, తను సృష్టించిన ప్రతి అణువునకు అంతర్యామియై యున్నవానిని 'మహోత్సాహుడు' అనకుండా ఎలా చెల్లుతుంది? ఆయన సహన గుణమును సూచించే మరొక ఋగ్వేద మంత్రము (19.9) – **సహోసి సహో మయి దేహి.**

'ఉత్సాహము' అనే సామాన్యార్థమును వివరిస్తూ ధర్మచక్రము రచయిత ఇలా చెప్పారు – సత్వ, రజస్, తమో గుణములలో సాత్విక గుణ ప్రధానమైన పనులు ఉత్సాహ పూరితముగను, లోక కళ్యాణ ప్రదముగను ఉండును. అవి జయప్రదములు. శుభకరములు. మంగళ దాయకములు. కనుక సాత్విక జీవన విధానమును అనుసరించుట కూడ భగవంతుని సేవించుటయే.

174. మహాబలః

- ఇతరుల సహాయ సహకారాలు లేకుండానే సృష్టి చేసే బలము కలవాడు.

- అనంతమగు, అద్భుతమగు బలముకలవాడు. బలవంతులకంటె బలవంతుడు. అందరికి (భక్తులకు) వివిధ బలములు ప్రసాదించువాడు. జీవనాధారము.

ఓం మహాబలాయ నమః

కర్త్రన్తరానపేక్షో యః సృష్టేః సః స్యాత్ మహాబలః – ఇతరుల సహాయ సహకారాలు లేకుండానే సృష్టి చేసే బలము కలవాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **బలినామపి బలవత్వాత్ మహాబలః** – ఎంతో బలవంతులకంటె ఎక్కువ బలము కలవాడు. గోవర్ధనగిరిని వ్రేలిపై ఎత్తుట ఆయనకు ఆట మాత్రమే. బ్రహ్మాండంబులు పైబడినను తన వ్రేలు బెసకదని గోపాలకులకు అభయమిచ్చినాడు.

భగవంతుని 'మహాబల' గుణమునకు శ్రీరాధాకృష్ణశాస్త్రిగారు పెక్కు ఉదాహరణలు చెప్పారు. – ఒకమారు బలిని సందర్శించడానికి రావణుడు పాతాళానికి వెళ్ళాడు. బలిచక్రవర్తికి ద్వారపాలకుడుగా ఉన్న భగవంతుడు అదృశ్యమవగా రావణుడు ద్వారమునకు అడ్డుగా ఉన్న వస్తువును కదల్చడానికి ప్రయత్నించి విఫలుడయ్యాడు. ఆ వస్తువు హిరణ్యకశిపుని చెవి కుండలము. శ్రీనృసింహమూర్తి చేత చిక్కిన హిరణ్యకశిపుని చెవినుండి జారి పడినది. తన చేయి ఫ్రోగు క్రింద పడి, రావణుడు విలవిలలాడుతుండగా భగవంతుడు ప్రత్యక్షమై ఒక్క తన్ను తన్నాడు. దానితో రావణుడు ఆమడ దూరంలో పడ్డాడు. అట.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – 'బల్'-ప్రాణనే, అనగా ఊపిరి పీల్చుట, జీవించుట అనే అర్ధంలో – సమస్త లోకమునకు ప్రాణమును, బలమును ప్రసాదించువాడు గనుక శ్రీమహావిష్ణువు మహాబలుడగును. 'బలము' అనగా కండబలము మాత్రమే కాదు. విద్యా బలము, సేవా బలము, ధన బలము, అన్న బలము, జ్ఞాన బలము, ధర్మ బలము – అన్ని బలములకు ఆయనే ఆధారము గనుక ఆయన మహాబలుడు. **బలం బలవతాం చాహం కామరాగ వివర్జితమ్** – అని గీత (7.11)లో చెప్పబడినది. ఆయన బలవంతులకంటె బలవంతుడు. బలవంతులలోని బలము. మహాబలుడు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

మహాబుద్ధిర్మహావీర్యో మహాశక్తిర్మహాద్యుతిః |
అనిర్దేశ్యవపుః శ్రీమానమేయాత్మా మహాద్రిధృక్ || (19)

175. మహాబుద్ధిః

- అనంతమగు బుద్ధి (జ్ఞానము, విచక్షణ, గ్రహణము) కలవాడు.
- అన్ని ప్రాణులలోను బుద్ధికి కారణమైనవాడు.

ఓం మహాబుద్ధయే నమః

శ్రీమహావిష్ణువు సకలాంతర్యామి. సాక్షి. క్షేత్రజ్ఞుడు. అన్నియెడల శిరములు, కన్నులు, చెవులు, నోళ్ళు, చేతులు, పాదములు కలవాడు. మనము సామాన్యముగా అర్థము చేసికొనేలా ఇంద్రియముల ద్వారా పరిమితమైన జ్ఞానము గ్రహించుట, తద్వారా పరిమితమైన బుద్ధిని కలిగియుండుట ఆయనకు వర్తించదు. ఆయన స్వతహా అనంత, సకల జ్ఞాన సంపన్నుడు, మహాబుద్ధి యని శ్రీ భట్టులు వివరించారు. ఇందుకు శ్రుతులనుండి పెక్కు ఆధారములను చూపవచ్చును.

శ్వేతాశ్వరోపనిషత్తు 3.19 – **పశ్యత్యచక్షుః స శృణోతి అకర్ణః** – ఆయన కన్నులు లేకుండానే చూచును. చెవులు లేకుండానే వినును.

తైత్తరీయ నారాయణోపనిషత్తు 1.12 – **విశ్వతశ్చక్షురుత విశ్వతోముఖమ్** – ఆయన అన్నియెడల కన్నులు, అన్నియెడల ముఖములు కలవాడు.

సర్వతః పాణిపాదం తత్ సర్వతోऽక్షిశిరోముఖమ్

సర్వతః శృతి ముల్లోకే సర్వమావృత్య తిష్ఠతి – గీత 13.13

ఆ పరమాత్ముని చేతులు, పాదములు, నేత్రములు, చెవులు, శిరస్సులు, ముఖములు సర్వత్ర స్థితములైయున్నవి. అతడు సర్వమును ఆవరించియున్నాడు.

ఆచార్య నాతముని మహాత్ములు న్యాయతత్వములో ఇలా చెప్పారు. **యో వేత్తి యగపత్ సర్వమ్ ప్రత్యక్షేణ సదాస్వతః.** ఆయన ప్రత్యక్షముగా. స్వభావసిద్ధముగా అంతటను ఒకేమారు చూచుచుండును. ఆయనకు తెలియనిది లేదు. ఆయన బుద్ధికి తోచనిది లేదు. కనుక ఆయన మహాబుద్ధి.

ఆయన బుద్ధి అన్నింటికంటె గొప్పది గనుక మహాబుద్ధియని ఇంతవరకు చెప్పబడినది. అంతే కాదు. సకల ప్రాణులలోని బుద్ధి, జ్ఞానము ఆయనసే. అందువలననే చరాచరాత్మకమైన సకల విశ్వము నిర్ణీత మార్గములో వర్తించుచున్నది. 'బుధ్' అనే ధాతువును 'తెలిసికొనుట, అర్ధము చేసికొనుట' అని భావము.

బీజం మా సర్వభూతానాం విద్ధి పార్థ సనాతనమ్
బుద్ధిర్బుద్ధిమతామస్మి తేజస్తేజస్వినామహమ్ – గీత 7.10
ఓ పార్థ! సమస్త భూతములకును నన్ను సనాతనమైన (శాశ్వతమైన) బీజముగా ఎఱుంగుము. ప్రజ్ఞావంతులలోని ప్రజ్ఞను, తేజోవంతులలోని తేజస్సును నేనే.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ మరింత వివరించారు – సృష్టియందలి సకల జీవుల స్వభావములు, స్పందనలు, ప్రవర్తనలు వానిలో భగవంతుడు పొందుపరచిన బుద్ధికి అనుగుణముగా జరుగును. చెట్లు శిశిరములో ఆకులు రాల్చును. వసంతములో చిగురించును. తల్లులు బిడ్డలకు పాలుగుడిపి సాకును. 'లజ్జావంతి' మొక్కలు కేవలము ఆడువారు నీరుపోసినపుడే వర్ధిల్లును. మగవారు నీరు పోసిన వాడిపోవును. సకల చరాచరములు భగవంతుడు తమకు ఒసగిన బుద్ధి ప్రకారము వర్తించును. ఇంత వైవిధ్యమున్న సృష్టిని చేయుట, వానిలో బుద్ధిని నింపుట కేవలము మహాబుద్ధిగలవాడు మాత్రమే చేయగలడు. కనుకనే ఆయన మహాజ్ఞాని, మహాబుద్ధి.

శ్రీరామకృష్ణ తపోవనమువారు ప్రచురించిన 'ధర్మచక్రము' అనే పత్రికలో ఒక రచయిత (పేరు తెలియదు) ఇదే విషయం గురించి ఆసక్తికరమైన ఉదాహరణలను ఇచ్చారు. చిన్నపిల్లవాడు అదిలించినపుడు కాకి ఒకసారి రెక్కలు విదిలించి ఊరుకుంటుంది. పెద్ద వ్యక్తి అదిలిస్తే అది కొంచెం దూరం గెంతి ఆగుతుంది. కఱ్ఱతో బెదిరిస్తే కఱ్ఱకందనంత సురక్షితమైన దూరం వెళ్ళి ఆగుతుంది. తుపాకిని పట్టుకున్నవాడిని చూస్తే మాత్రం చుట్టుప్రక్కల కనుపించదు. ఇంత బుద్ధి కాకికి ఎవరిచ్చారు? ఆ బుద్ధి తరతరాలుగా కాకులలో ఎలా సంక్రమిస్తున్నది? ఇందుకు కారణం మహాబుద్ధియైన శ్రీమహావిష్ణువే. పిపీలికాది బ్రహ్మ పర్యంతము ఆయన బుద్ధియే వారివారి బుద్ధిగా ప్రవర్తిల్లుచున్నది.

శ్రీ రాధాకృష్ణశాస్త్రిగారి అదనపు వివరణ – బుద్ధి, మనసు, చిత్తము, అహంకారము అనే నాలుగు అంతఃకరణాలలో బుద్ధి అతిముఖ్యమైనది. అనుభవములు, పరిశీలనలు చిత్తము ద్వారా అందుతాయి. ఏమేమి చేయడానికి సాధ్యము అనే మార్గాలను మనసు సూచిస్తుంది. నిర్ణయించిన పనిని అహంకారము ఆచరిస్తుంది. అయితే ఈ నిర్ణయించడమనే కార్యక్రమం మాత్రం బుద్ధివల్ల జరగాలి. అల్పబుద్ధులు అనుచిత నిర్ణయములు చేయవచ్చును. అలా కాకుండా సర్వత్ర సన్మార్గయుతమైన నిర్ణయము చేసేది మహాబుద్ధి.

176. మహావీర్యః

- సకల సృజనాత్మక దివ్య శక్తులకు ఆధారము.
- అచంచల మూర్తి.

ఓం మహావీర్యాయ నమః

హేతౌ సతి వికారిత్వేత్యవికారిత్వ లక్షణమ్
మహద్విర్యం యస్యేతి మహావీర్యస్స చ స్మృతః

వికారాలకు కారణమున్నప్పటికీ, వికారము పొందకుండా ఉండడము వీర్యము అబడుతుంది. అటువంటి గొప్ప వీర్యము కలవాడు మహావీర్యుడు.

సృష్టిలో అన్నీ పరిణామము చెందుతాయి. (పాలు పెరుగుగా మారినట్లు). కానీ శ్రీమన్నారాయణుడు ఏకాకృతియై వెలుగుచునే యుండును. కనుక ఆయన మహావీర్యుడు. ఆయన వీర్యశక్తి, ఇంద్రియ నిగ్రహములే మహాయోగులలోని నిర్మల, నిశ్చయ భావములుగా ప్రతిబింబించును. శ్రమ లేకుండానే పూవు తన చుట్టుప్రక్కల అందమును, సుగంధమును వెదజల్లినట్లుగా భగవంతుడు సకల కార్యములను అలవోకగా నిర్వర్తించును గనుక ఆయన మహావీర్యుడు.

శ్రీ చిన్మయానంద – సకల చేతనత్వమునకు, సృష్టికి, సృజనాత్మతకతకును వీర్యమే మూలాధారము. సృష్టిలోని చైతన్యమంతా భగవంతుని అంశయే గనుక భగవంతుడు మహావీర్యుడు.

శ్రీ రాధాకృష్ణ శాస్త్రి – ఎంత అసాధ్యమనిపించినా గాని, ధ్యేయమును సాధించుటయే వీర్య లక్షణము. ప్రకృతినుండి విశ్వసృష్టిని కావించినందున భగవంతుడు మహావీర్యుడు.

ధర్మచక్ర వ్యాఖ్యాన రచయిత – వీర్యసంపన్నుడైనవాడు సంపూర్ణ ఇంద్రియ నిగ్రహమును కలిగి యున్నట్లయితే సర్వశ్రేయోదాయకమైన సృష్టి జరుగును. కనుక భగవంతుడొక్కడే మహావీర్యుడు.

177. మహాశక్తిః

- సృష్ట్యాది సకల కార్యములకు కారణమైన శక్తి గలవాడు.
- క్రియాశక్తి, ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తుల సంగమమైన అనంత శక్తిమయుడు.

ఓం మహాశక్తయే నమః

భగవంతుడు సకల శక్తులకును ఆధారము. అనంత శక్తిసంపన్నుడు. అందరిలోని శక్తి ఆయన అంశయే. కనుక శ్రీహరి మహాశక్తి.

సృష్టి, స్థితి, లయ వంటి కార్యక్రమములలో సంకల్పము మాత్రము భగవంతునిదని, భౌతికమైన పని చేసేది భగవంతుడు కాడని ఒక తత్వమార్గంలో (పసుపత తత్వము) చెప్పబడినది. ఇందుకు భిన్నంగా, సకల కార్యములలోను భగవంతుని శక్తియే ఆధారమైయున్నదని శ్రీభట్టులు ఈ నామ వ్యాఖ్యానంలో వివరించారు. కనుక సృష్టిలోని సకల కార్యములు, పరిణామములు, సృజనలు భగవంతుని మహాశక్తి కారణముగానే జరుగుచున్నవి.

శక్ – మర్షణే – సాధ్యమగుట, భరించి సాధించి సహించుట.
శక్తౌ – సామర్థ్యము కలిగియుండుట.

'మహాబల;', 'మహోత్సాహః' నామములను వ్యాఖ్యానించినట్లే శ్రీ సత్యదేవో వాసిష్ఠగారు 'మహాశక్తిః' నామమును కూడా వివరించారు. అన్ని శక్తులకు మూలమైనవాడు భగవంతుడు గనుక ఆయన మహాశక్తి యగును.

శ్రీ శంకరులు కూడ సామర్థ్యము, నేర్పరితనము అనే భావంలో ఈ నామమును వ్యాఖ్యానించారు.

> శ్రీ చిన్మయానంద – క్రియాశక్తి (పని చేయు శక్తి), ఇచ్ఛాశక్తి (కామ శక్తి, కోరుకొను శక్తి, సంకల్పించునది), జ్ఞానశక్తి (తెలిసికొను శక్తి) అనే మూడింటి మహాసంగమమే మహాశక్తి. సృష్టికి మూలము, ఆధారము.

మనము పరిశీలించే ప్రతిశక్తి (చీమలోను, సింహంలోను, మనిషిలోను, సముద్రంలోను, భూమిలోను, గాలిలోను.. ..) భగవంతుని గుర్తు చేయును.

178. మహాద్యుతిః

అసమానమగు దివ్యమైన కాంతితో విరాజిల్లువాడు. తేజోమయుడు.

ఓం మహాద్యుతయే నమః

'ద్యుతి' అనగా కాంతి. **ద్యుత దీప్తౌ** – ప్రకాశించుట. అనే ధాతువునండి. **ద్యోతయితా వా ద్యుతిః.** ప్రకాశించువాడు, ప్రకాశింపజేయువాడు ద్యుతి. భగవంతుని కాంతి అనంతము. సృష్టిలోని ప్రకాశము అంతా భగవంతుని కాంతిలోని అంశము వల్లనే కలుగుచున్నది.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ చెప్పిన యజుర్వేద ప్రమాణములు (23-2,4)

యస్తే దివి సూర్యే మహిమా సంబభూవ
తస్మైతే మహిమ్నే ప్రజాపతయే దేవేభ్యః స్వాహా
యస్తే నక్షత్రేషు చంద్రమసి మహిమా సంబభూవ
తస్మైతే మహిమ్నే ప్రజాపతయే దేవేభ్యః స్వాహా

శ్రీ భట్టుల వివరణ ప్రకారము భగవంతుని కార్యములకు బయటినుండి సహాయ సాధనములు అవుసరము లేదు. ఆయన శక్తి, తేజస్సు, బుద్ధి, జ్ఞానము, వీర్యము వంటి గుణములన్నియును ఆయనకు స్వాభావికముగా ఉన్న అనంత వైభవైశ్వర్యములు. అలాగే ఆయన ప్రకాశము బయటినుండి వచ్చు కాంతి మూలముగా సంభవింపదు. ఆయన స్వయంప్రకాశమూర్తి. మహాద్యుతి. తేజోమయుడు. సూర్యుని కాంతి, వజ్రము తళుకు, మబ్బులలోని మెరుపు భగవంతుని తేజస్సుయొక్క స్వల్ప అంశమువల్లనే కలుగుచున్నది. ఆయన తేజము మనచుట్టును కప్పిన, మన మనస్సులో గూడుకట్టుకొన్న అంధకారమును, అజ్ఞానమును పారద్రోలును. ఆయన తేజస్సు భక్తులకు నయనానందకరము. శత్రువులకు భీకర దుర్నిరీక్ష్యము.

ఆయన స్వయంప్రకాశమూర్తి యనుటకు శృతులలోని ఆధారములు.

స్వయం జ్యోతిః – బృహదారణ్యకోపనిషత్తు 4.3.9
జ్యోతిషామ్ జ్యోతిః – ముండకోపనిషత్తు 2.2.9
యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽఖిలమ్
యచ్చన్ద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధిమామకమ్ – గీత 15.12
సమస్త జగత్తును ప్రకాశింపజేయు సూర్యుని తేజస్సును, అటులనే చంద్రుని తేజస్సును, అగ్ని తేజస్సును నా తేజస్సేయని యెఱుంగుము.
దివి సూర్య సహస్రస్య భవేద్యుగపదుత్థితా
యది భాఃసదృశీ సా స్యాత్ భాస్తస్య మహాత్మనః
ఆకాశమున వేలకొలది సూర్యులు ఒక్కుమ్మడిగా ఉదయించినచో వచ్చు కాంతి పుంజములును ఆ విరాట్ రూప తేజస్సునకు సరికావు.

ధ్మచక్ర రచయిత – ఆ మహాద్యుతిని పూజించువారు భగవంతుడొసగిన కాంతితో, తేజస్సుతో వెలుగుదురు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – ఈ పుణ్యస్తవములో 'మహా' అనే శబ్దముతో మొదలయ్యే నామములు మొత్తము 43 ఉన్నాయి. అందులో ఆయన షడ్గుణైశ్వర్యములను కీర్తించే ఈ ఆరు నామములు ఆయన లీలా వైభవమును తెలుపును. వీనివల్లనే భగవానుడు 'మహామాయ' అగును.

173. మహోత్సాహః

174. మహాబలః

175. మహాబుద్ధిః

176. మహావీర్యః

177. మహాశక్తిః

178. మహాద్యుతిః

పరా అస్య శక్తిః వివిధైవ శ్రూయతే స్వభావికీ జ్ఞాన బల క్రియాచ (శ్వేతాశ్వరోపనిషత్తు 6.8) – జ్ఞానము, బలము, క్రియ వంటి వివిధములైన శక్తులు ఆయనలో స్వాభావికముగా (నేర్చుకొన్నవి కావు) అపరిమితములై యున్నవి.

జ్ఞాన శక్తి బల ఐశ్వర్య వీర్య తేజాంసి అశేషతః
భగవచ్ఛబ్ద వాచ్యాని వినా హేయైః గుణాదిభిః – విష్ణు పురాణము 65.79
'భగవత్' అను శబ్దము జ్ఞానము, బలము, ఐశ్వర్యము, వీర్యము, తేజము అను ఉత్తమ గుణములతో అనుసంధానమైనది. హేయమైన గుణములతో 'భగవత్' శబ్దమునకు సంబంధము లేదు.

తేజో బల ఐశ్వర్య మహా అవబోధ సువీర్య శక్త్యాది గుణైక రాసిః – విష్ణుపురాణము 6.5.85
భగవంతుడు తేజస్సు, బలము, ఐశ్వర్యము, గొప్ప జ్ఞానము, సమృద్ధిగా వీర్యము, శక్తి వంటి సద్గుణములకు నిలయుడు. తేజోమయుడు.

179. అనిర్దేశ్య వపుః

వర్ణించుటకు వీలు గానట్టి, ఊహింపనలవి కానట్టి ఆకృతి (శరీరము) కలవాడు.

ఓం అనిర్దేశ్య వపుషే నమః

ఈ నామము రెండుమార్లు స్తుతింపబడినది.

19వ శ్లోకము. 179వ నామము. అనిర్దేశ్యవపుః – **అనిర్దేశ్యవపుః శ్రీమాన్ అమేయాత్మా మహాద్రిధృక్**

70వ శ్లోకము. 662వ నామము. అనిర్దేశ్యవపుః – **అనిర్దేశ్యవపుః విష్ణుః వీరోఽనంతో ధనంజయః**

ఇదమ్ తత్ ఇత్యాది రూపేణ విజ్ఞాపనమ్, జ్ఞాప్యస్య ప్రకాశనమ్ వా నిర్దేశ్యః. ఇదీ అదీ అని చెప్పగలిగినది, ఇలా అలా అని చూపదగినది 'నిర్దేశ్య' అగును. అలా సాధ్యము కానిది, మాటలకు చాలనిది, ఊహలకు అందనిది అనిర్దేశ్యము. 'వపు' అనే పదానికి 'శరీరము' అనీ, 'విత్తుట, చల్లుట' అనీ అర్థములు చెప్పవచ్చును (**బీజ సంతానే ఛేదనే చ**). 'బాపు, బాప్' అనే హిందీ పదములు 'వపు'నుండి ఉద్భవించి ఉండవచ్చును.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ గారు 'అనిర్దేశ్య-వపు' అనే నామమునకు చెప్పిన అర్థము – వర్ణింపరానివాడు, విశ్వమునకు విత్తనము విత్తినవాడు (రెండు అర్థములు జోడింపబడినవి).

కాని విస్తారముగా చెప్పబడిన అర్థము – నిర్దేశింపజాలని శరీరము కలిగినవాడు భగవంతుడు.

జ్ఞానాది షాడ్గుణ్య మయం ఉపమాన విసర్జితమ్
వపుర్యస్యాతి తేజిష్ఠ అనిర్దేశ్య వపుర్హిస

జ్ఞానము మొదలైన షడ్గుణాల చేత సాటి లేనటువంటి, మిక్కిలి తేజోవంతము, పూర్ణమయము అయిన దివ్యమంగళ విగ్రహము కలవాడు. సకల భూతముల శరీరములు పంచభూతములు, మనస్సు, అహంకారములచే నిర్మితములు. కాని శ్రీమన్నారాయణుని శరీరము పాంచభౌతికము కాదు. ఆయన నిర్గుణ, నిరాకారమూర్తి. శుద్ధ సత్వ స్వరూపి. తేజోమయుడు. జ్ఞానానందమయుడు. సకలైశ్వర్య సంపన్నుడు. సర్వశక్తిమంతుడు. **రూపవర్ణాది నిర్దేశ విశేషణ వర్జితః** (విష్ణు పురాణము 1.2.10) – రూపము, రంగువంటి విశేషణములకు అతీతుడు. ఆయన రూపాది గుణములు వర్ణించ సాధ్యము కాదు. దేనితోను పోల్చుట కుదరదు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – భగవంతుడు మహాగుణ సంపన్నుడు. కనుక మన సామాన్య జ్ఞానము, పాండిత్యము శ్రీహరిని ఊహింప చాలవు. అంతరాత్మతోను, భక్తితోను భావించి, అనుభవించి, భగవంతుని తెలిసికొనుటకు యత్నింపవచ్చును.

శ్రీ చిన్మయానంద – మనము తక్కినవానివన్నీ చూచుటకు, తెలిసికొనుటకు సాధనమైన జ్ఞానము భగవంతునివలన కలుగుచున్నది. కనుక ఈ జ్ఞానముతో భగవంతుని వర్ణింప సాధ్యము కాదు (కన్ను తనను తాను చూడలేనట్లుగా).

180. శ్రీమాన్

- దివ్యాభరణ శోభితుడు.
- సౌందర్యమూర్తి, సుందరాంగుడు.
- సకలైశ్వర్య యుతుడు.

ఓం శ్రీమతే నమః

'శ్రీమాన్' అనే ఈ శుభమంగళ నామము 22వ, 180వ, 222వ నామములుగా మూడుమార్లు జపింపబడినది. ఈ మూడు సందర్భములలోను ప్రముఖ వ్యాఖ్యాతల అనుభవం క్రింద సంక్షిప్తంగా చెప్పడమైనది.

3వ శ్లోకము. 22వ నామము. శ్రీమాన్ - **నారసింహవపుః శ్రీమాన్ కేశవః పురుషోత్తమః**
శ్రీ భట్టుల వ్యాఖ్య: అతిమనోహర సుందర శ్రీ నారసింహ స్వరూపము
శ్రీ శంకరుల వ్యాఖ్య: వక్షస్థలమున శ్రీలక్ష్మిని ధరించినవాడు.

19వ శ్లోకము. 180వ నామము. శ్రీమాన్ - **అనిర్దేశ్యవపుః శ్రీమాన్ అమేయాత్మా మహాద్రిధృక్**
శ్రీ భట్టుల వ్యాఖ్య: దివ్యాభరణములతో, దివ్య మాల్యాంబరములతో శోభిల్లువాడు.
శ్రీ శంకరుల వ్యాఖ్య: సకలైశ్వర్య సంపన్నుడు

24వ శ్లోకము. 222వ నామము. శ్రీమాన్ - **అగ్రణీః గ్రామణీః శ్రీమాన్ న్యాయోనేతా సమీరణః**
శ్రీ భట్టుల వ్యాఖ్య: శ్రీయుత మత్స్య మూర్తి. అన్ని సంపదలను కలిగినవాడు.
శ్రీ శంకరుల వ్యాఖ్య: అనన్య తేజోమయుడు.

మళ్ళీ 65వశ్లోకంలో '**శ్రీధరః శ్రీకరః శ్రేయః శ్రీమాన్ లోకత్రయాశ్రయః**' అని వస్తుంది. అప్పుడు శ్రీ శంకరులు '**శ్రీమాన్**' ను ప్రత్యేక నామముగా పరిగణించారు. శ్రీ భట్టులు మాత్రము '**శ్రేయశ్శ్రీమాన్**' ఒకేనామముగా పరిగణించారు.

65వ శ్లోకము – 619వ నామము. శ్రీమాన్ / శ్రేయశ్శ్రీమాన్ – **శ్రీధరః శ్రీకరః శ్రేయఃశ్రీమాన్ లోకత్రయాశ్రయః**
శ్రీ భట్టుల వ్యాఖ్య: **శ్రేయశ్శ్రీమాన్** – సకల సంపదలను ప్రసాదించు లక్ష్మీదేవిని నిత్యము కలిగియున్న శ్రీధరుడు.
శ్రీ శంకరుల వ్యాఖ్య: **శ్రీమాన్** – సకల వైభవములు, సమస్త భోగభాగ్యములు, సకల విభూతులు, సకల సద్గుణములు, సర్వశక్తులు, సర్వనిధులు తనయందే కలిగియున్న శ్రీమంతుడు.

21వ నామము 'నారసింహ వపుః'. తరువాత 22వ నామము 'శ్రీమాన్'. అక్కడ శ్రీనారసింహావతారపరంగా 'శ్రీమాన్' నామమును శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు. అవధులు లేని సౌందర్యముగల శ్రీనారసింహమూర్తియే శ్రీమాన్.

అలాగే మత్స్యావతారపరంగా వివరింపబడిన నామములలో 222వ నామమైన 'శ్రీమాన్' వచ్చును. అప్పుడు మత్స్యావతార సౌందర్యపరంగా 'శ్రీమాన్' పుణ్య నామమునకు వ్యాఖ్య చెప్పబడింది.

ఇదే విధంగా భగవంతుని శరీర వైశిష్ట్యమును ప్రస్తుతించే 'అనిర్దేశ్యవపుః' నామము ననుసరించి ఈ 180వ నామము 'శ్రీమాన్'వచ్చింది గనుక శ్రీహరి సౌందర్య వర్ణనతో ఈ నామమును వివరించారు.

శ్రీ భట్టులు: భగవంతుడు దివ్యాయుధములతో, దివ్య మాల్యాంబరములతో శోభిల్లువాడు. శిఖిపింఛమౌళి. **అతసీపుష్ప సకాశం హారనూపుర శోభితం రత్నకంకణ కేయూరం కృష్ణం వందే జగద్గురుం.**

శ్రీ శంకరులు – భగవంతుడు షడ్గుణైశ్వర్య సంపన్నుడు. సకల శుభలక్షణ శోభితుడు. సర్వాంగ సుందరుడు – అని శ్రీ అనంతకృష్ణశాస్త్రిగారు తమ శంకరభాష్యము అనువాదములో చెప్పారు. భగవంతుడు సిరిగలవాడు. సకలైశ్వర్య సంపన్నుడు.

ధర్మ చక్రము రచయిత వివరణ – శ్రియఃపతి, లక్ష్మీవల్లభుడు గనుక వేంకటరమణుడు 'శ్రీమాన్'అని కీర్తింపబడుచున్నాడు. లక్ష్మిని వక్షస్థలమున ధరించినందున (**తద్వక్షస్థల నిత్యవాస రసికామ్ తత్ క్షాంతి సంవర్ధినీమ్**) ఆయన అందము స్వాభావికము. అనంతము. వారిది విడదీయరాని బంధము. అట్లే ప్రకృతి, పురుషులను వేరుచేయ సాధ్యము కాదు. ఇద్దరూ ఒకే పరబ్రహ్మముయొక్క అవినాభావ భావములు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – 'శ్రీ' అనగా సేవింపదగినది (సేవాయామ్). 'శ్రీ' అనగా శోభ, కాంతి. 'శ్రీ' అనగా సంపద. శ్రీమన్నారాయణుని సేవించుటయే జీవిత పరమార్థము. ప్రకృతిలోని ప్రతి అందము, ప్రతి వెలుగు (చెట్లు, పూలు, పక్షులు, నీళ్ళు, నక్షత్రములు, సూర్యచంద్రులు) అన్నీ భగవంతుని గుర్తు చేయును. భగవంతుని సేవించినవారికి నిత్యము, సత్యము, అనంతమునగు ఆనందైశ్వర్యములు లభించును.

శ్రీ లక్ష్మీ అష్టోత్తర శత నామ స్తోత్రము

దేవ్యువాచ

దేవదేవ! మహాదేవ! త్రికాలజ్ఞ! మహేశ్వర!

కరుణాకర దేవేశ! భక్తానుగ్రహకారక! ||

అష్టోత్తర శతం లక్ష్మ్యాః శ్రోతుమిచ్ఛామి తత్త్వతః ||

ఈశ్వర ఉవాచ

దేవి! సాధు మహాభాగే మహాభాగ్య ప్రదాయకమ్ |

సర్వైశ్వర్యకరం పుణ్యం సర్వపాప ప్రణాశనమ్ ||

సర్వదారిద్ర్య శమనం శ్రవణాద్భుక్తి ముక్తిదమ్ |

రాజవశ్యకరం దివ్యం గుహ్యాద్ గుహ్యతరం పరమ్ ||

దుర్లభం సర్వదేవానాం చతుష్షష్టి కళాస్పదమ్ |

పద్మాదీనాం వరాంతానాం నిధీనాం నిత్యదాయకమ్ ||

సమస్త దేవ సంసేవ్యమ్ అణిమాద్యష్ట సిద్ధిదమ్ |
కిమత్ర బహునోక్తేన దేవీ ప్రత్యక్షదాయకమ్ ||
తవ ప్రీత్యాద్య వక్ష్యామి సమాహితమనాశ్శృణు |
అష్టోత్తర శతస్యాస్య మహాలక్ష్మిస్తు దేవతా ||
క్లీం బీజ పదమిత్యుక్తం శక్తిస్తు భువనేశ్వరీ |
అంగన్యాసః కరన్యాసః స ఇత్యాది ప్రకీర్తితః ||
ధ్యానమ్
వందే పద్మకరాం ప్రసన్నవదనాం సౌభాగ్యదాం భాగ్యదాం
హస్తాభ్యామభయప్రదాం మణిగణైః నానావిధైః భూషితామ్ |
భక్తాభీష్ట ఫలప్రదాం హరిహర బ్రహ్మాదిభిస్సేవితాం
పార్శ్వే పంకజ శంఖపద్మ నిధిభిర్యుక్తాం సదా శక్తిభిః ||
సరసిజ నయనే సరోజహస్తే ధవళ తరాంశుక గంధమాల్య శోభే |
భగవతి హరివల్లభే మనోజ్ఞే త్రిభువన భూతికరి ప్రసీదమహ్యమ్ ||

ఓం ప్రకృతిం, వికృతిం, విద్యాం, సర్వభూత హితప్రదామ్ |
శ్రద్ధాం, విభూతిం, సురభిం, నమామి పరమాత్మికామ్ || 1 ||
వాచం, పద్మాలయాం, పద్మాం, శుచిం, స్వాహాం, స్వధాం, సుధామ్ |
ధన్యాం, హిరణ్యయీం, లక్ష్మీం, నిత్యపుష్టాం, విభావరీమ్ || 2 ||
అదితిం చ, దితిం, దీప్తాం, వసుధాం, వసుధారిణీమ్ |
నమామి కమలాం, కాంతాం, క్షమాం, క్షీరోద సంభవామ్ || 3 ||
అనుగ్రహప్రదాం, బుద్ధిం, అనఘాం, హరివల్లభామ్ |
అశోకామమృతాం దీప్తాం, లోకశోక వినాశినీమ్ || 4 ||
నమామి ధర్మనిలయాం, కరుణాం, లోకమాతరమ్ |
పద్మప్రియాం, పద్మహస్తాం, పద్మాక్షీం, పద్మసుందరీమ్ || 5 ||
పద్మోద్భవాం, పద్మముఖీం, పద్మనాభప్రియాం, రమామ్ |
పద్మమాలాధరాం, దేవీం, పద్మినీం, పద్మగంధినీమ్ || 6 ||
పుణ్యగంధాం, సుప్రసన్నాం, ప్రసాదాభిముఖీం, ప్రభామ్ |
నమామి చంద్రవదనాం, చంద్రాం, చంద్రసహోదరీమ్ || 7 ||
చతుర్భుజాం, చంద్రరూపాం, ఇందిరా,మిందుశీతలామ్ |
ఆహ్లాద జననీం, పుష్టిం, శివాం, శివకరీం, సతీమ్ || 8 ||
విమలాం, విశ్వజననీం, తుష్టిం, దారిద్ర్య నాశినీమ్ |
ప్రీతి పుష్కరిణీం, శాంతాం, శుక్లమాల్యాంబరాం, శ్రియమ్ || 9 ||

భాస్కరీం, బిల్వనిలయాం, వరారోహాం, యశస్వినీమ్ |
వసుంధరా, ముదారాంగాం, హరిణీం, హేమమాలినీమ్ || 10 ||
ధనధాన్యకరీం, సిద్ధిం, స్త్రైణసౌమ్యాం, శుభప్రదామ్ |
నృపవేశ్మ గతానందాం, వరలక్ష్మీం, వసుప్రదామ్ || 11 ||
శుభాం, హిరణ్యప్రాకారాం, సముద్రతనయాం, జయామ్ |
నమామి మంగళాం దేవీం, విష్ణు వక్షఃస్థల స్థితామ్ || 12 ||
విష్ణుపత్నీం, ప్రసన్నాక్షీం, నారాయణ సమాశ్రితామ్ |
దారిద్ర్య ధ్వంసినీం, దేవీం, సర్వోపద్రవ వారిణీమ్ || 13 ||
నవదుర్గాం, మహాకాళీం, బ్రహ్మ విష్ణు శివాత్మికామ్ |
త్రికాలజ్ఞాన సంపన్నాం, నమామి భువనేశ్వరీమ్ || 14 ||
లక్ష్మీం క్షీరసముద్రరాజ తనయాం శ్రీరంగధామేశ్వరీమ్ |
దాసీభూత సమస్తదేవ వనితాం లోకైక దీపాంకురామ్ ||
శ్రీమన్మంద కటాక్ష లబ్ధ విభవద్-బ్రహ్మేంద్ర గంగాధరామ్ |
త్వాం త్రైలోక్య కుటుంబినీం సరసిజాం వందే ముకుందప్రియామ్ || 15 ||
మాతర్నమామి! కమలే! కమలాయతాక్షి!
శ్రీ విష్ణు హృత్-కమలవాసిని! విశ్వమాతః!
క్షీరోదజే కమల కోమల గర్భగౌరి!
లక్ష్మీ! ప్రసీద సతతం సమతాం శరణ్యే || 16 ||

త్రికాలం యో జపేత్ విద్వాన్ షణ్మాసం విజితేంద్రియః |
దారిద్ర్య ధ్వంసనం కృత్వా సర్వమాప్నోత్-యయత్నతః |
దేవీనామ సహస్రేషు పుణ్యమష్టోత్తరం శతమ్ |
యేన శ్రియ మవాప్నోతి కోటిజన్మ దరిద్రతః || 17 ||
భృగువారే శతం ధీమాన్ పఠేత్ వత్సరమాత్రకమ్ |
అష్టైశ్వర్య మవాప్నోతి కుబేర ఇవ భూతలే ||
దారిద్ర్య మోచనం నామ స్తోత్రమంబాపరం శతమ్ |
యేన శ్రియ మవాప్నోతి కోటిజన్మ దరిద్రతః || 18 ||
భుక్త్వాతు విపులాన్ భోగాన్ అంతే సాయుజ్యమాప్నుయాత్ |
ప్రాతఃకాలే పఠేన్నిత్యం సర్వ దుఃఖోప శాంతయే |
పఠంతు చింతయేద్దేవీం సర్వాభరణ భూషితామ్ || 19 ||
ఇతి శ్రీ లక్ష్మీ అష్టోత్తర శతనామ స్తోత్రం సంపూర్ణమ్
(http://telugu.devotionalonly.com నుండి. మరియు బొమ్మ ఇంటర్నెట్ నుండి సేకరించినది)

282. అమేయాత్మా

తెలియరాని స్వరూపము గలవాడు. ఊహింపరాని తత్వమూర్తి.

ఓం అమేయాత్మనే నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – ఇంతకు పూర్వము చెప్పబడిన నామములు భగవంతుని విశిష్ఠ బహువిధ గుణములను, శక్తిని కీర్తించుచున్నవి. శ్రీమహావిష్ణువును ఇంద్రియముల ద్వారా తెలిసికొనలేము (అతీంద్రియుడు). ఆయన మాయను అధిగమించజాలము (మహామాయుడు). మహోత్సాహి. మహాబలుడు. మహాబుద్ధి. సకలసృష్టి మూలము (మహావీర్యుడు). మహాశక్తి. అసమాన కాంతిమయుడగు మహాద్యుతి. శ్రీయుతమూర్తి. ఆయన గుణవైభవములకు అంతములేదు. ఆయన స్వరూపమును ఎంచజాలము. కనుక శ్రీవాసుదేవుడు అమేయాత్ముడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – 'ఆత్మ' యనగా బుద్ధి, తెలిసిన విషయము. మహాబుద్ధియైన శ్రీహరిని తెలిసికొనుట, ఆయన బుద్ధిని అంచనా వేయుట అసాధ్యము. కనుక ఆయన అమేయాత్ముడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ గారు 'మా' అనే ధాతువునుండి ఈ నామమును వివరించారు. మా-మానె-కొలుచుట, పోల్చుట. **మాతుమ్ అర్హః మేయః, న మాతుమ్ అర్హః అమేయః.** కొలుచుటకు అందనిది అమేయయము. 'ఆత్మ' అనగా స్వరూపము. భగవంతుడు అంతటను అంతరాత్మయై యున్నవాడు గనుక బయటినుండి ఆయనను తెలిసికొనుట, కొలుచుట సాధ్యము కాదు.

శ్రీ కృష్ణ తులాభారము వృత్తాంతమును స్మరింపనగును. బ్రహ్మాండములను ఉదరమున భరించిన పరబ్రహ్మమును తులవేయతరమా?.

182. మహాద్రిధృత్ / మహాద్రిధృక్

గొప్పకొండలనెత్తినవాడు. (ధరించినవాడు)

ఓం మహాద్రిధృతే నమః

శ్రీమహావిష్ణువు కూర్మావతారమున మందర పర్వతమును ధరించెను. నందగోపాలుడై గోవర్ధనగిరిని ధరించెను. దేవదానవులు అమృతమును కోరి వాసుకిని త్రాడుగా జేసి, మందరగిరిని కవ్వముగా వాడి క్షీరసాగరమును మధించు సమయమున ఆ పర్వతము జారిపడిపోవుచుండెను. అప్పుడు భగవంతుడు మహాకూర్మరూపమును ధరించి ఆ పర్వతమును వీపుపై భరించెను. మరల కృష్ణావతారమున ఆయన తనను నమ్ముకొన్న గోకులమును కాచుటకై గోవర్ధనగిరినెత్తి ఇంద్రుని గర్వమునణగించెను. బ్రహ్మాండమును

సృజించి భరించు పరబ్రహ్మమునకు, రెండడుగులలో సకల భువనముల నతిక్రమించిన త్రివిక్రమునకు ఒక కొండనెత్తుట ఏపాటి కార్యము?

శ్రీ చిన్మయానంద – సాధకుని భక్తిపూరిత హృదయమే పాలకడలి. మనసు కవ్వము. వివిధములగు భావములే దేవదానవులు. బుద్ధియే వాసుకి. శ్రవణ మననాది సాధనలే చిలుకుట అనే ప్రక్రియ. మోక్షమే అమృతమను ధ్యేయము. ఇట్టి సాధనయందు కర్మ, బంధనములవలన సంసార సాగరమున మునిగిపోకుండ సహకరించువాడు శ్రీమహావిష్ణువు. కూర్మరూపధారి.

సహస్రనామము యొక్క కొన్ని పాఠములలో ఈ నామమే 'మహాద్రిదృక్' అని చెప్పబడినది. ఈ రెండు పాఠాంతరములను శ్రీరాధాకృష్ణశాస్త్రిగారు ఇలా వివరించారు.

మహాద్రిధృక్ – మహాద్రయే దిధృష్ణోతి – గొప్ప కొండనెత్తగల అంతటి మొనగాడు.

మహాద్రిధృత్ – మహాద్రిమ్ ధరతి – కొండనెత్తినవాడు.

---

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

సదాశివ బ్రహ్మేంద్ర స్వామి రచన

మానస సంచరరే బ్రహ్మణి మానస సంచరరే ॥ మానస॥

మదశిఖి పింఛా లంకృత చికురే - మహనీయ కపోల విజిత ముకురే ॥ మానస॥

శ్రీ రమణీ కుచ దుర్గ విహారే - సేవకజన మందిర మందారే ॥ మానస ॥

పరమహంస ముఖ చంద్ర చకోరే - పరిపూరిత మురళీ రవధారే ॥ మానస॥

మహేష్వాసో మహీభర్తా శ్రీనివాసః సతాం గతిః |
అనిరుద్ధః సురానందో గోవిందో గోవిదాంపతిః || (20)

183. మహేష్వాసః

- తిరుగులేని, గొప్ప బాణములు ప్రయోగించువాడు.

- బ్రహ్మాండమైన ధనుస్సును ధరించినవాడు. గొప్ప విలుకాడు.

ఓం మహేష్వాసాయ నమః

మహాన్-ఈషూణామ్-ఆసః – మహేష్వాసః – గొప్పవైన బాణములను వేయువాడు.
శ్రీమహావిష్ణువు శార్ఙ్గము అనే మహాధనుస్సును ఆయుధముగా పూనినవాడు. ఆయనే కోదండరాముడై సాగరముపై బాణమును ఎక్కుపెట్టెను. ఆయనే బ్రహ్మాస్త్రమును వేసి రావణుని అంతము చేసెను. (శ్రీ భట్టులు చెప్పిన ఉదాహరణలు).

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – 'ఇషు' అనగా బాణములు. 'ఇష్వాస' అనగా బాణములు వేయు ఆయుధము (ధనుస్సు) అగును. **మహాన్ ఇష్వాసః అస్య ఇతి మహేష్వాసః** – గొప్పదైన ధనుస్సును ధరించినవాడు మహేష్వాసుడు.

ధర్మచక్రము రచయిత – ఆధునిక ఆయుధములలో ఎంత బలమున్నా, ఇంకా యుద్ధ పరిస్థితులు, అన్యాయములు పెచ్చరిల్లుతూనే ఉన్నాయి. అంటే వీనిలోని శక్తికి, ధర్మరక్షణకు సంబంధం లేదు. కాని భగవానుని ఆయుధములు వ్యర్థములు కాసేరవు. రామబాణమునకు తిరుగు లేదు. దానివలన అధర్మము నశించుట, ధర్మము వర్ధిల్లుట తథ్యము.

ఆపదుద్ధారక స్తోత్రమునుండి

నమః కోదండ హస్తాయ సంధీకృత శరాయచ
దండితాఖిల దైత్యాయ రామాయాపన్నివారణే

ఆపదామపహర్తారం దాతారం సర్వ సంపదామ్
లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహమ్

184. మహీభర్తా

భూభారము వహించినవాడు. ఆదికూర్మరూపుడు. శ్రీవరాహమూర్తి.

ఓం మహీభర్త్రే నమః

హళెబీడులోని శ్రీవరాహమూర్తి శిల్పం. వికీపీడియానుండి.

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీహరి ఆదికూర్మమై భూమిని సదా భరించియుండును గనుక ఆయన మహీభర్త.

శ్రీ శ్రీనివాస రాఘవాచారిగారు తమ 'నృసింహప్రియ' వ్యాసములో చెప్పిన వివరణ – నిత్య ఆహ్నిక కర్మలోని '**ఓం అఖిల జగదాధారాయ కూర్మరూపిణే నారాయణాయ నమః**' అనే మంత్రములో శ్రీమన్నారాయణుని మహీభర్తగా జపించుచున్నాము.

భర్త అనగా 'మగడు, భరించువాడు' అనే అర్థంలో 'మహీభర్త' అనగా భూదేవికి భర్త. శ్రీమన్నారాయణుడు శ్రీవరాహమూర్తియై ప్రళయానంతరము పాతాళాంతర్గతయైన భూదేవిని ఉద్ధరించినాడు. అట్టి శ్రీభూవరాహస్వామియే మహీభర్త.

ధర్మ చక్రము రచయిత – శాస్త్రానుసారము సకల గ్రహ నక్షత్రాదులను భ్రమింపజేయు గురుత్వాకర్షణ శక్తి కూడా మహీభర్తయొక్క అంశమే.

185. శ్రీనివాసః

సిరికి నిలయమైనవాడు. లక్ష్మీవల్లభుడు.

ఓం శ్రీనివాసాయ నమః

ఈ పుణ్యనామము 185వ నామముగాను, 614వ నామముగాను స్తుతింపబడినది.

20వ శ్లోకము. 185వ నామము. శ్రీనివాసః – **మహేష్వాసో మహీభర్తా శ్రీనివాసః సతాం గతిః**

65వ శ్లోకము. 614వ నామము. శ్రీనివాసః – **శ్రీదః శ్రీశః శ్రీనివాసః శ్రీనిధిః శ్రీవిభావనః**

'శ్రీ' అనగా లక్ష్మీదేవి. క్షీరసాగర మథన సమయమున అవతరించిన లక్ష్మీదేవి నారాయణుని వరించినది. ఆమెను తన వక్షస్థలమున ధరించి ఆయన శ్రీమన్నారాయణుడైనాడు. ఆ అలమేలు మంగమ్మతల్లి నిత్యానపాయినియై, తద్వక్షస్థల నిత్యవాస రసికయై వేంకటరమణుని కాంతిసంవర్ధినియై విలసిల్లుచున్నది.

శ్రీ చిన్మయానంద – 'శ్రీ' అనగా సకల శక్తి సంపదలు, కీర్తి, వైభవము, బలము, ధైర్యము, ధర్మము, సృజన, విద్య తదితర గుణసంపద. ఇన్ని సంపదలు ఒకచోట స్థిరముగానుండవు. కనుకనే లక్ష్మీదేవి నితాంత చంచల స్వభావము కలదియని చెప్పుదురు. ఇందుకు అసలు కారణము – అన్నియెడల, అందరియందు దోషములు, తమోగుణము. అజ్ఞానము ఎంతో కొంత ఆవరించి యుండును. కనుక అచట శ్రీదేవి నిలువజాలదు. కాని పురుషోత్తముడు, సచ్చిదానంద స్వరూపుడు, సకల కళ్యాణగుణనిధియైన నారాయణునివద్ద అలాంటి సమస్య లేనందున లక్ష్మీదేవి ఆయన వక్షస్థలమున నిత్యవాసియై యుండును. కనుకనే ఆయన శ్రీనివాసుడు.

పోతన భాగతము – గోపవనితలు శిశువులను చంకలనిడుకొని నందగోపాలునకు ఎదురేగి ఆనంద బాష్పములతో కౌగిలించుకొని స్వాగతించిన విధము.

సిరి చాంచల్యము తోడి దయ్యుఁ దనకుం జిత్తేశ్వరుండంచు నే
పురుషశ్రేష్ఠు వరించె నట్టి పరమున్ బుద్ధిన్ విలోకంబులన్
గరయుగ్మంబులఁ గౌఁగిలించిరి సతుల్ గల్యాణ బాష్పంబు లా
భరణ శ్రేణులుగాఁ బ్రతిక్షణ నవప్రాప్తాను రాగంబులన్

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – 'శ్రీ' అనగా శోభ, కీర్తి, ధనము. ఇలాంటి సంపదలు స్వాభావికముగా, అనంతముగా కలిగియున్నందున భగవంతుడు శ్రీనివాసుడగును.

లక్ష్మీనారాయణులు వేరువేరు కాదు. భగవంతుని సకలైశ్వర్య శక్తి శుభ కళ్యాణ లక్షణములే లక్ష్మి. శ్రీదేవియే పరబ్రహ్మమగు నారాయణుడు. వెరసి శ్రీనివాసుడు.

అన్నమయ్య కీర్తన

అలమేలుమంగనీ వభినవరూపము - జలజాక్షు కన్నులకు చవులిచ్చేవమ్మ

గరుడాచలాధీశు ఘనవక్షముననుండి - పరమానంద సంభరితవై
నెరతనములు జూపి నిరంతరము నాధుని - హరుషించగ జేసితి గదమ్మ

శశికిరణములకు చలువలచూపులు - విశదముగా మీద వెదజల్లుచు
రసికత పెంపున కరగించి ఎప్పుడు నీ - వశముజేసుకొంటి వల్లభునోయమ్మ

రట్టడి శ్రీవేంకటరాయనికి నీవు - పట్టపురాణివై పరగుచు
వట్టిమాకులిగిరించు వలపు మాటల విభు - జట్టిగొని వురమున సతమైతివమ్మ

186. సతాంగతిః

సత్పురుషులకు, ముముక్షువులకు పరమగతియైనవాడు.

ఓం సతాంగతయే నమః

20వ శ్లోకము. 186వ నామము. సతాంగతిః – **మహేష్వాసో మహీభర్తా శ్రీనివాసః సతాం గతిః**
48వ శ్లోకము. 451వ నామము. సతాంగతిః – **యజ్ఞ ఇజ్యో మహేజ్యశ్చ క్రతుః సత్రం సతాంగతిః**

ప్రణతానాం ప్రియకరః సతాంగతిః – శరణాగతులకు ప్రియము చేకూర్చువాడు సతాంగతి.
'సత్' అన్న పదమునకు సన్మార్గమున వర్తించువారని, మోక్షసాధన చేయువారని కూడ అర్థము చెప్పవచ్చును. అట్టివారికి పరమ గమ్యము శ్రీవైకుంఠవాసుడు, పరమాత్ముడు, పురుషోత్తముడు. వారికి గమ్యమే కాదు. దిశ, మార్గము, గమనము కూడ ఆయనే (శ్రీ చిన్మయానంద).

శ్రీహరిపట్ల భక్తి కలిగి ఆయనను శరణుజొచ్చినవారికి వేఱు సంపదలు, సాధనములు సమ్మతములు కావు. కనుకనే నరహరిని కీర్తించు నోటితో నరులను శ్లాఘించుటకు అన్నమయ్య నిరాకరించినాడు.

అన్నమయ్య కీర్తన

పలువిచారములేల పరమాత్మనీవు నాకు - కలవు కలవు ఉన్న కడమలేమిటికి

నీపాదముల చెంత నిబిడమైతే చాలు - యేపాతకములైన ఏమిసేసును
యేపార నీభక్తి ఇంత గలిగిన చాలు - పై పై సిరులచ్చట పాదుకొని నిలుచు

సొరిదినీ శరణము జొచ్చితినంటే చాలు - కరుణించి యప్పుడట్టే కాతువు నీవు
సరుస నీముద్రలు భుజములనుంటే చాలు - అరుదుగా చేతనుండు అఖిలలోకములు

సేరక వేసిన చాలు నీమీద నొక పువ్వు - కోరిన కోరికలెల్ల కొనసాగును
మేరతో శ్రీవేంకటేశ నిన్నుగొలిచితి నేను – యేరీతి నుండిన గాని యిన్నిటా ఘనుడను

187. అనిరుద్ధః

- ఎవరివల్లను, ఎన్నడైనను నిరోధింపబడనివాడు.
- అపరిమిత చేష్టామూర్తి.

ఓం అనిరుద్ధాయ నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

20వ శ్లోకము. 187వ నామము. అనిరుద్ధః – **అనిరుద్ధః సురానందో గోవిందో గోవిదాం పతిః**

68వ శ్లోకము. 644వ నామము. అనిరుద్ధః – **అనిరుద్ధోఽప్రతిరథః ప్రద్యుమ్నోఽమితవిక్రమః**

శ్రీ భట్టుల వ్యాఖ్య ప్రకారము

187వనామము – అనిరుద్ధః – నిరోధింపబడనివాడు.

644వనామము – అనిరుద్ధః – వసుభాండము (భూమిపై) జనార్దనునిగా నిత్యము వసించువాడు.

న నిరుద్ధః అనిరుద్ధః –నిరోధింపబడజాలనివాడు అనిరుద్ధుడు. భగవంతుని అనిరుద్ధ తత్వమును మనము ఎల్లెడల గమనించవచ్చును. సూర్యుడు ఉదయించును, అస్తమించును. అలలు ఎగసి ఎగసి పడును. ప్రకృతి నియమములు జరిగి తీరును. కాలము ఆగదు. అంతా భగవంతుని నియమానుసారము వర్తించి తీరును. ఆయన శాసనము అనివార్యము. ఆయన అనిరుద్ధుడు.

అనంత చేష్టాయుక్తత్వాత్ అనిరుద్ధ ఉదాహృతః – ఆయన చేష్టలకు మితి లేదు. భక్తులను రక్షించడానికి అనేకమైన పనులు చేసేవాడు అనిరుద్ధుడు. శ్రీ భట్టులు మూలసంహితమునుండి చెప్పిన ప్రమాణము – **అపరిమిత చేష్టో భగవాన్ అనిరుద్ధః**.

ధర్మ చక్రము రచయిత వివరణ – కృష్ణుని నిరోధించుటకు కంసుడు ఎన్నో యత్నములు చేసెను. కృష్ణుని పుట్టుకకు ముందునుండి మొదలుపెట్టెను. అయినా కృష్ణుని అవతరణము, కంసుని మరణము తప్పలేదు. భగవంతుని భక్తులకు రక్షణ తథ్యము. భగవంతుని శత్రువులను రక్షించగలిగినవారు లేరు.

188వ నామము నుండి 199వ నామము వరకు - సురానందః, గోవిందః, గోవిదాం పతిః, మరీచిః, దమనః, హంసః, సుపర్ణః, భుజగోత్తమః, హిరణ్యనాభః, సుతపః, పద్మనాభః, ప్రజాపతిః – నామములు భగవానుని హంసావతారమును సూచించునవని శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు.

188. సురానందః

దేవతలకు ఆనందమును ప్రసాదించు దేవదేవుడు.

ఓం సురానందాయ నమః

సురాన్ ఆనందయతి ఇతి సురానందః – దేవతలను ఆనందింపజేయువాడు సురానందుడు.
'సు'-మంచి, 'రా'-ఇచ్చుట. లోకములకు మంచి (క్షేమము) చేయువారు సురులు (దేవతలు). భగవంతుడొసగిన శక్తి సామర్ధ్యముల వల్ల, భగవంతునిచే నియమింపబడిన కార్యములు చేయుచు దేవతలు లోకములకు క్షేమము కూర్చుచున్నారు. అలాంటి దేవతలకు మేలు, రక్షణ, ఆనందము శ్రీహరివల్లనే కలుగును. ఆయన కృపవల్లనే వారు పాలకడలిని చిలికి అమృతమును పొందగలిగారు. వారికి కలిగిన ఇక్కట్లను తొలగించి వారిని కాచు ప్రభువు శ్రీమన్నారాయణుడే. దేవతల శక్తికి ఆధారము, దేవతల ఆనందమునకు ఆలవాలము ఆ ప్రభువే.

దివ్య ప్రబంధములలో తరచుగా కీర్తింపబడిన హంసావతారమును ఈ నామవివరణలో శ్రీ భట్టులు ఉదాహరించారు. అజ్ఞానము వల్ల, మోహమువల్ల లోకములు అంధకారములో మునిగిపోయినపుడు బ్రహ్మ, సనక సనందనాదులు శ్రీమన్నారాయణుని ప్రార్థించారు. ఆయన హంస రూపంలో ప్రత్యక్షమై వారికి సత్యమును ఉపదేశించెను. హంస నీటిని పాలను వేరు చేసే విధంగా భగవంతుడు మంచి చెడుల విచక్షణను దేవతలకు ప్రసాదించాడు. శ్రీమద్భాగవతము 11వ స్కంధము 13వ అధ్యాయము పూర్తిగా హంసావతారమును గూర్చి చెబుతుంది.

శ్రీ మద్భాగవతము – ఏకాదశ స్కంధము – 13వ అధ్యాయము – హంసావతారము

http://srimad.org/wp/ నుండి. (శ్రీ మధ్వాచార్యుల 'భాగవత తాత్పర్య నిర్ణయము' ఆధారంగా శ్రీ వసంత మాధవపాయ్ గారు భాగవతము 11వ స్కంధమును ఆంగ్లంలోకి అనువదించారు. ఆ ఆంగ్లపాఠం యొక్క నా తెలుగు అనువాదం ఇక్కడ వ్రాస్తున్నాను – కా.సు. బాబు)

భగవంతుడు దివ్య హంస స్వరూపమున ఏతెంచి, సనక సనందనాదులకు ఒనరించిన ఉపదేశము – ధర్మమార్గమున చరించి రజస్తమోగుణములను అధిగమించు ఉపాయము – మోహమును విడనాడి అజ్ఞానమును పారద్రోలు ఆవశ్యకత --

ముందుగా, సత్వగుణ ప్రధానమగు ధర్మమునాచరించి, క్రమముగా రజోగుణమును, తమోగుణమును జయింపవలెనని భగవంతుడు ఉద్ధవునకు ఉపదేశించెను. ఏదైనా గుణము వృద్ధియగుటకు పది ప్రధాన కారణములున్నవి. అవి – శాస్త్రములు, నీరు, జనులు, స్థలము, కాలము, వృత్తి, జన్మము. మనోవాంఛితము, మంత్రము, యజ్ఞకర్మలు.

తత్త్వవిదులైనవారు ప్రశంసించునది సాత్త్వికము. వారిచే నిరసింపబడునది తామసికము. మరియు వారు తటస్థముగానుండు గుణము రాజసము. వెదురు పొదల రాపిడి వల్ల ఉత్పన్నమైన అగ్ని ఆ వెదురు పొదలను దహించిన పిమ్మట అణగారును. అట్లే సత్త్వగుణాధిక్యము వలన ప్రకాశవంతమైన జ్ఞానము బాహ్యేంద్రియములను (జ్ఞాన సాధనములను) అణచివేసి, పిదప సమత్వ భావనమున విలీనమగును.

ఉద్ధవుడు భగవంతుని ఇట్లు ప్రశ్నించెను – ఇంద్రియ సౌఖ్యములు దుఃఖహేతువులని, ఆపత్తులకు మూలమని తెలిసి కూడ మానవులు అట్టి సుఖములయందు మోహితులై ఏల వర్తించెదరు?

అందులకు భగవంతుని సమాధానము – మాయామోహితమైన జీవుల హృదయములందు వికార పూరితమైన ‘అహం’భావము రజోగుణమును పెంపొందించును. ఇది మనస్సునావరించి దుఃఖములకు కారణమగును. రజోగుణము వలన వస్తువుల ననుభవించు భావము కలుగును. అందుండి అనుభవించు మార్గముపై మనస్సు నిమగ్నమగును. తద్వారా నియంత్రింప శక్యము గాని కామము జనించును. ఇట్లు రజోగుణ ప్రభావితుడై, కామ ప్రేరేపితుడై, ఇంద్రియ నిగ్రహమును కోల్పోయి జీవుడు చేయు కార్యములు దుఃఖమునకు కారణమగును.

విషయ వ్యామోహమును జయించుటకును, ఇంద్రియములను నిగ్రహించుటకును, రజోగుణమును నియంత్రించుటకును ప్రాణాయామాది యోగముల ద్వారా మనమును ప్రశాంతపరచుచు భగవంతునిపై నిలుపనగును. ఇదే విషయమై భగవంతుడు సనక సనందనాదులకు యోగోపదేశము కావించెను.

సనక సనందనాదులు బ్రహ్మను ఇట్లు ప్రశ్నించిరి – మనస్సు, ఇంద్రియములు ఒకదానినొకటి పెనవేసికొని జీవుని మోహములో బంధించుచున్నవి. అట్టి పరిస్థితిలో ఇంద్రియ వ్యామోహమునుండి మనసును విడదీసి, భవ సాగర తరణమునకు సిద్ధము చేయుట ఎట్లు సాధ్యము?

ఇదే ప్రశ్నకు సమాధానము కొఱకు బ్రహ్మ నారాయణుని ప్రార్థించెను. అప్పుడు నారాయణుడిచ్చిన ఉత్తరము – మనస్సు విషయవాసనలందు మగ్నమై ఇంద్రియముల చెప్పుచేతలకు లోబడును. మనస్సునకు, ఇంద్రియములకు కూడ పరమాత్ముడే అధిపతి. కనుక మనస్సును భగవంతునివైపు మరల్చినట్లయితే విషయ వ్యామోహము నశించి ఇంద్రియములు నిగ్రహింపబడును.

జాగ్రదవస్థ (మెళకువ), స్వప్నావస్థ (కలత నిదుర), సుషుప్తి అవస్థ (గాఢనిద్ర) అనునవి ప్రకృతి జనితమగు అవస్థలు. ఇందు సుషుప్తి అనునది తమోగుణ ప్రధానమైనది. స్వప్నావస్థయందు రజోగుణము ముఖ్యము. జాగ్రదవస్థ సత్త్వగుణ వర్ధకము. ఈ మూడింటికంటే జీవుడు వేరు. ఈ మూడు అవస్థలకు జీవుడు సాక్షియనవచ్చును. ఈ మూడు గుణములు జీవుని సంసారమున బంధించుచున్నవి. కనుక సంసారముయొక్క క్షణిక లక్షణమును గ్రహించి, సకల భయములను పారద్రోలి, జీవుడు నాలుగవదైన తురీయావస్థను (ఆత్మ సమాధి స్థితిని) సాధింపవలెను. ఇందుకై మోహమును విడనాడి, విరుద్ధ భావములను త్యజించి సమత్వ బుద్ధిని సాధింపవలెను.

బ్రహ్మాది దేవతలందరు శ్రీహరియొసగు శక్తిపైననే ఆధారపడి యున్నారు. శ్రీహరి ఒక్కడే దేవదేవుడు, సర్వేశ్వరుడు. ఆ శ్రీహరియే తన విశ్వ, తైజస, ప్రజ్ఞ స్వరూపములలో సకల జీవులకు మూడు అవస్థలలో వేర్వేరు అనుభవములను కలుగజేయుచున్నాడు. ఇది గ్రహించి జీవులు ఇంద్రియములను నిగ్రహించి, కామమును త్యజించి, దుష్కర్మములకు దూరముగానుండవలెను. తద్వారా ప్రశాంతమైన మనమును శ్రీహరి ధ్యానముపై మగ్నము చేయవలెను. ఆ విధముగా జీవుని నిజతత్త్వము, పరమాత్మతోడి సంబంధము తెలియుటయు, శరీరమే 'నేను' అను అజ్ఞానము నశించుటయు జరుగును. అట్టివారు దేహమును ధరించుట, విసర్జించుట పట్ల మమకారమును త్యజింతురు. ఇదే సాంఖ్యము, యోగముల రహస్యము – అని భగవానుడు సెలవిచ్చెను.

189. గోవిందః

- దేవతలచే ప్రస్తుతింపబడు దేవదేవుడు.
- మహార్ణవమునుండి భూమిని పైకెత్తి కాపాడినవాడు. శ్రీవరాహమూర్తి.
- గోవులను కాచేటి గోపాలుడు.
- వేదముల నొసగిన, వేదముల ద్వారా పొందదగినవాడు. వేదవేద్యుడు.

ఓం గోవిందాయ నమః

శ్రీరామచంద్రా! గోవిందా! గోపాలా! వేంకటరమణా! గురువాయూరప్పా! శ్రీలక్ష్మీనారసింహా! త్రివిక్రమా! జనార్ధనా! శరణు శరణు! శ్రీ సత్యనారాయణా! శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీవరాహమూర్తీ! శ్రీనివాసా! శ్రీవేంకటేశా! పాహి పాహి!

మరల గోవింద నామము 58వ శ్లోకములో వస్తుంది.

20వ శ్లోకము. 189వ నామము. గోవిందః – **అనిరుద్ధః సురానందో గోవిందో గోవిదాం పతిః**

58వ శ్లోకము. 543వ నామము. గోవిందః – **మహావరాహో గోవిందః సుషేణః కనకాంగదీ**

'గో' శబ్దానికి భూమి, గోవు, వాక్కు, వేదము అని వివిధ అర్థములున్నాయి. ఈ ధాతువునుండి 'గవామ్', 'గామ్' అనేధాతువులు ఉత్పన్నములు.
'విద్' అనగా లభించుట, కనుగొనుట. ఇందునుండి 'వింద' శబ్దము వస్తుంది.

గవామ్ విందః గోవిందః – స్తుతి వాక్కులను స్వీకరించువాడు గోవిందుడు. శ్రీహరియే సురానందుడు గనుక దేవతలకు జ్ఞానము నుపదేశించును. వారికి శ్రేయము కూర్చును. వారికి మార్గము చూపును. మరియు బ్రహ్మాది దేవతలొనరించు స్తుతివాక్యములను స్వీకరించి ప్రసన్నుడగును. కనుక ఆ దేవదేవుని, శ్రీవేంకటేశ్వరుని 'గోవిందుడు' అని స్మరించి భక్తులు తరింతురు.

గామ్ అవిందత్ గోవిందః – భూమిని మహాసాగరమునుండి ఉద్ధరించినవాడు గోవిందుడు.

నష్టామ్ వై ధరణీమ్ పూర్వమ్ అవిందమ్ వై గుహాగతమ్

గోవింద ఇతి తేనాऽహమ్ దేవైర్వాగ్భిరభీష్టుతః – మహాభారతము. శాంతిపర్వము. 330.5

సాగరగర్భమున (అసురునిచే) దాచబడిన భూమిని లేవనెత్తినందున దేవతలు, శృతులు నన్ను 'గోవింద'యని స్తుతింతురు.

ఈ భావము యొక్క ప్రాముఖ్యతను ధర్మచక్రము రచయిత వివరముగా తెలిపారు. సమస్త లోకములను, జీవులను సంపూర్ణముగా నెఱిగినవాడు శ్రీనివాసుడే.

గావో వేద వాణ్యో విందన్తి లభన్తే, యత్ర వా అవిష్ఠన్తే స గోవిందో భగవాన్ విష్ణుః – వేదపారాయణము వలన లభించువాడు, వేదములకు నిలయమైనవాడునగు విష్ణుభగవానుడే గోవిందుడు.

గౌరేషా తు యతో వాణీ తామ్ చ విందయతే భగవాన్

గోవిందస్తు తతో దేవః మునిభిః కథ్యతే భగవాన్ – హరివంశము 3.88.50

ఇక్కడ 'గౌ' అనగా వాక్కు, వాణి. అన్ని వాక్కులయందు వ్యాపించి, వానికి శక్తిని ప్రసాదింతువు గనుక మునులు నిన్ను గోవిందుడనియెదరు.

గోవులను కాచు గోపాలుడు గనుక గోవిందుడగును. ఇందుకు కూడ ఆధారము హరివంశమునుండి చెప్పారు.

అహమ్ కీలేంద్రో దేవానామ్ త్వమ్ గవామ్ ఇంద్రతామ్ గతః

గోవింద ఇతి లోకాస్త్వామ్ స్తోష్యన్తి భువి శాశ్వతమ్ – హరివంశము 2.19.45

నేను దేవతలలో ముఖ్యుడనైన ఇంద్రుడను. నీవు గోవులకధిపత్యము వహించితివి. కనుక భువిలో జనులెల్లపుడు నిన్ను 'గోవిందా' యని స్తుతింతురు. – ఆయన గోవుల కాపరి. బృందావన విహారి. గోపీజన మనోహారి. మురళీగానలోలుడు. గోపాలుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – పాలు, పెరుగు, వెన్న, నెయ్యి వంటి పదార్థములు నిత్య జీవితములో ఆహారముగాను, యజ్ఞాదికములందు హవ్యములుగాను ఎంతో ప్రాముఖ్యము గలవని మనము గమనింపనగును. ఆయన గోపాలుడయినందున జీవులకాధారము. యజ్ఞమునకు సాధనము. యజ్ఞమునకు భోక్త.

శ్రీ శంకరుల విష్ణు సహస్ర నామ వ్యాఖ్యానమును అనువదించిన శ్రీ అనంతకృష్ణశాస్త్రిగారు 'గో+విద్' శబ్ద సముదాయమునకు 10 అర్థాలను ఇచ్చారు.

1. గో – స్వర్గము → స్వర్గములను అధిగమించినవాడు.
2. గో – బాణములు → సకల శస్త్రాస్త్ర ప్రవీణుడు.
3. గో – ఆవులు → పశుగణమునకు పాలకుడు.
4. గో – వాక్కు → వేదములద్వారా తెలియబడువాడు.
5. గో – పిడుగు (మెరుపు) → పాదములపై వజ్ర చిహ్నములు గలవాడు.

6. గో – లోకములు → అన్ని లోకములందు విఖ్యాతుడు (పూజింపబడువాడు).
7. గో – కన్నులు → అందరియందు అంతర్యామియైన సాక్షి, దృష్టి.
8. గో – సూర్యుడు → సూర్య మండలాంతర్వర్తి.
9. గో – భూమి → సాగరమునుండి భూమిని ఉద్ధరించినవాడు.
10. గో – నీరు → జలములే నిలయమైనవాడు – నారాయణుడు.

అన్నమయ్య కీర్తన

భావములోనా బాహ్యము నందును - గోవింద గోవిందయని కొలువవో మనసా ॥భావము॥

హరి యవతారములే యఖిల దేవతలు - హరి లోనివే బ్రహ్మాండంబులు
హరి నామములే అన్ని మంత్రములు - హరి హరి హరి హరి యనవో మనసా ॥భావము॥

విష్ణుని మహిమలే విహిత కర్మములు - విష్ణుని పొగడెడి వేదంబులు
విష్ణుడొక్కడే విశ్వాంతరాత్ముడు - విష్ణువు విష్ణువని వెదకవో మనసా ॥భావము॥

అచ్యుతుడితడే ఆదియు నంత్యము - అచ్యుతుడే యసురాంతకుడు
అచ్యుతుడు శ్రీవేంకటాద్రి మీదనిదె - అచ్యుత యచ్యుత శరణనవో మనసా ॥భావము॥

190. గోవిదాం పతిః

వేదార్థముల నెఱిగిన జ్ఞానులకు రక్షకుడు.

ఓం గోవిదాం పతయే నమః

గావో వేదగిరః ప్రోక్తాః గోవిందస్తత్సుపాలనాత్
గోవిందా పతిరుద్దిష్టో వేదవిద్వత్ప్రదో మనుః

గోవులు అంటే వేదవాక్కులు. వానిని రక్షించువాడు గోవిందుడు. ఈ నామము వేదవిద్వత్తును ప్రసాదించు మహామంత్రము. 'గో-విద్' అనగా 'వేదములు తెలిసినవారు' అని ఇంతకుముందు 'గోవింద' నామవివరణ ప్రకారమగానే గ్రహించవచ్చును. 'పతి' అనగా నాయకుడు, రక్షకుడు అని అర్థములు గలవు. కనుక వేదాధ్యయనము చేయువారికి ఆ వేదవిదుడు, వేదవేద్యుడు నాథుడగును.

ఇక్కడ మనము స్మరించి పరవశింపదగిన విషయము – సమస్త జ్ఞానమునకు గోవిందుడే మూలము. జ్ఞానార్జనకు గోవిందుడే ఆధారము. జ్ఞానమువల్ల మనకు గోవిందుడే అందివచ్చును.

'గో' అనగా వాక్కు, భూమి, గోవులు – ఇలా వివిధ అర్థములు ఉన్నాయని ఇంతకుముందే చెప్పుకొన్నాము. ఈ అర్థముల ఆధారముగా 'గోవిదాంపతి' పుణ్య నామమునకు మరిన్ని మనోహరమైన భావములు స్ఫురిస్తాయి. భగవంతుడు పశుపక్ష్యాది సకల జీవజాలమునకు భాషనొసగినవాడు. విశ్వతత్వము నెఱిగిన మహానుభావులకు ముఖ్యుడు. భూనాథుడు. గోనాథుడు. గోపాలబాలుడు. గోపీజన ప్రియుడు.

(శ్రీ ఎమ్. శ్రీనివాసన్ గారు అందించిన ఆధారములు ఈ వివరణకు ఉపయోగపడినవని శ్రీకృష్ణమాచారిగారు కృతజ్ఞతలు తెలిపారు.)

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

శ్రీ అళవందార్ (యమునాచార్యులు) వారి స్తోత్ర రత్నము నుండి 36వ శ్లోకము

స్ఫురత్కిరీటాంగద హార కంఠికా
మణీంద్ర కాంచీగుణ నూపురాదిభిః
రథాంద శంఖాసి గదా ధనువరైః
లసత్తులస్యా వనమాల యోజ్వలమ్

శ్రీమహావిష్ణువు ప్రకాశమానమగు కిరీటమును, ముత్యాల హారమును, కౌస్తుభమణిని, దివ్యాభరణములను ధరించియున్నాడు. శంఖ, చక్ర, ఖడ్గ, గదా ధనుష్పాణి. తులసీ వనమాలతో వెలుగొందుచున్నాడు.